ఆదివారం వార్త మెయిన్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com

WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-4-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 85 పేజీలు: 10+4 వెల: 8.00


ఉగ్రదాడిపై దర్యాప్తునకు మేం సిద్ధమే: పాకిస్థాన్

మానససరోవర్ యాత్రకు రిజిస్ట్రేషన్లు షురూ

5

## అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే

# మా ప్రభుత్వ లక్ష్యం



భారత్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

### రాష్ట్రంలోకి రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాక

### మహిళా సాధికారతకు ప్రాధాన్యం.. కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యం

### యువతకు నైపుణ్య శిక్షణ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు

### భారత్ సమ్మిట్‌లో తెలంగాణ ప్రగతిపై సిఎం రేవంత్ ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్26:** సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు, అణగారిన కులాల ఆకాంక్షలు నెరవేర్చడం మా కర్తవ్యమని పేర్కొన్నారు. దీని కోసం అనేక పథకాలను తీసుకొచ్చామని. దేశంలోనే అతి పెద్దరైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 15 ఆగస్టు 2024 న రూ. 20,617 కోట్లు చెల్లించి 25లక్షల 50 వేల మంది రైతులను పూర్తిగా రుణ విముక్తులను చేశామని వెల్లడించారు. హెచ్ ఐసిసిలో రెండురోజుల పాటు నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో శనివారం ముగింపు కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ ప్రగతిపై ప్రసంగించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నాం. భూమిలేని రైతుకూలీలకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.12,000 సాయం అందిస్తున్నాం. వ్యవసాయ రంగంలో భూమిలేని, భూమికలిగిన రైతులకు కలిపి ఏటా రూ.20,000 కోట్లకు పైగా నిధులు ఇస్తున్నాం,రైతుల పండించిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటా లుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం.రైతుబీమా, పంటల బీమాలతో రైతులకు లబ్ధి చేకూరుస్తున్నామని, యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని >>2

# ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే..



### ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయి

### భారత్ జోడో యాత్రతో సరిగ్గా వినడం నేర్చుకున్నా

### భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో రాహుల్‌గాంధీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందని తెలిపారు.రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని రాహుల్ సూచించారు. దేశ సమస్యలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానన్నారు. పాదయాత్ర మొదలుపెట్టక ముందు ఆలోచించాను. మొదలుపెట్టాక వెనకడుగు వేయలేదని వివరించారు. శనివారం హెచ్ఐసిసిలో రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మిట్ నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు.శుక్రవారం భారత్ >>2

# తెలివున్నవారు కాళేశ్వరం చేపడతారా?

### ఆ కథ త్వరలోనే తెలుస్తుంది: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్ ఏప్రిల్ 26,ప్రభాతవార్త:** కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని ఆర్ అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. "తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళ్లు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారు" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.



శనివారం వాటికన్ సిటీలో ప్రజల సందర్శనార్థం ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయం

# పోప్‌ఫ్రాన్సిస్‌కు అశ్రునివాళి

### వాటికన్ వెలుపల బాసిలికాలో అంత్యక్రియలు

**వాటికన్ సిటీ, ఏప్రిల్ 26:** రోమన్ క్యాథలిక్ మతగురువు,వాటికన్‌సిటీ ప్రధాన క్రైస్తవ ప్రచారకుడు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వేలాది మంది అశ్రునయనాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమానికి సుమారు 2.5 లక్షల మందికి పైగా విశ్వాసులు, ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల ప్రతినిధులు, పలువురు దేశాధినేతలు, ప్రముఖులు హాజరై దివంగత పోప్‌కు తుది వీడ్కోలు పలికారు. భారత ప్రభుత్వం తరఫున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం ఈ అంత్యక్రియలకు హాజరైంది.సెయింట్ పీటర్స్ బాసిలికా ప్రాంగణంలో జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనలకు కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వం వహించారు. దాదాపు రెండుగంటల పాటు సాగిన ఈకార్యక్రమంలో సుమారు 250 మంది కార్డినల్స్, ఆర్చ్‌బిషప్‌లు, బిషప్‌లు, మత గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్డినల్ రే మాట్లాడుతూ.. పోప్ ఫ్రాన్సిస్ ప్రజల మనిషి అని, అందరి పట్ల విశాల హృదయంతో వ్యవహరించారని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ చివరిక్షణం వరకు తన కర్తవ్యాన్ని నిబద్ధతతో >>2

# ఉగ్రవాదంపై కఠిన నిర్ణయాలు



### పాక్ వెన్నులో వణుకుపుట్టేలా చర్యలు

### రోజ్‌గార్‌మేళాల్లో 10 లక్షల ఉద్యోగాల భర్తీ

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

### ఎంసిహెచ్‌ఆర్‌డిలో జరిగిన మేళాలో 100 మందికి నియామక పత్రాలు అందజేత

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పెహల్‌గాం ఘటన అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తుపాకీ పట్టినోడు చివరకు ఆ తుపాకీకే బలికాక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుండబోతున్నాయని అన్నారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని, ఇందుకు యావత్ దేశం అండగా నిలవాలని కోరారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు జిఎస్‌టి చీఫ్ కమిషనర్లు సందీప్ ప్రకాశ్, వి.సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అత్యంత ఇష్టమైన కార్యక్రమం రోజ్‌గార్ మేళా 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానన్న మాట నిలబెట్టుకున్న నాయకుడు మోడీ అన్నారు. 2022 అక్టోబర్ 22న ప్రారంభమైన రోజ్‌గార్ మేళా నేటికీ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 రోజ్‌గార్ మేళాలను నిర్వహించి 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేసామన్నారు. శనివారం 15వ రోజ్‌గార్ మేళా ద్వారా దేశవ్యాప్తంగా 51 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని వివరించారు. అంటే దాదాపు 10 లక్షల మార్క్‌కు చేరుకున్నట్లే అన్నారు. ఏ చిన్న అవినీతికి, పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా ఇన్ని లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం మామూలు విషయం కాదన్నారు. మోడీ ప్రభుత్వానికి ఈ ఘనత దక్కిందన్నారు. ఎంసిహెచ్‌ఆర్‌డి కేంద్రం నుంచి సుమారు 700 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకోబోతున్నారని, వీరిలో 100 మంది అభ్యర్థులకు నా చేతుల మీదుగా నియమాక పత్రాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చే టెక్నాలజీని, ఉద్యోగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగండి. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పేరుతో ఉద్యోగాలు చేసేస్థాయినుండి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి మన భారతీయ యువతను ప్రోత్సహిస్తున్నారు. కరోనా హయాంలో అమెరికాసహా ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే ఆత్మనిర్భర్ ప్యాకేజీతో భారత్‌ను ఆర్థికంగా స్థిరంగా ఉంచిన ఘనత మోడీ ప్రభుత్వానిదే అన్నారు. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. పేపర్ లీకేజీలు, కాలయాపనతో >>2

# సింధూ విషయంలో భారత్‌కు గట్టి బదులిస్తాం

### ఆ జలాలు మావే: బిలావల్ భుట్టో



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 26:** పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మెన్ బిలావల్ భుట్టోజర్దారీ ఇండియాకు వార్నింగ్ ఇచ్చారు. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత సర్కారు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని బిలావల్ ప్రస్తావించారు. సింధూ నదీ వ్యవహారంలో భారత ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయానికి గట్టిగా బదులిస్తామని బిలావల్ తెలిపారు. భారత్ తన నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకున్నట్లు ఆయన ఖండించారు. సింధూ జలాలు మావే అని, అవి ఎప్పటికీ మా నీళ్లే అని, ఆ నదిలో మా నీళ్ల అయినా పారాలి లేక మీ రక్తమైనా పారాలని అని బిలావల్ తన వార్నింగ్‌లో పేర్కొన్నారు. సింధూ నదిపై కొత్తగా కెనాల్స్ నిర్మించే అంశం గురించి ఇటీవల పాకిస్థాన్ ప్రభుత్వం సమావేశం నిర్వహించింది. పరస్పర అంగీకారం లేకుండా కెనాల్స్ >>2



# రూ.1000 కోట్ల భూకుంభకోణంపై ఇడి సోదాలు

**న్యూఢిల్లీ:** గోవాలో భారీ భూ కుంభకోణం బయటపడింది. సుమారు వెయ్యి కోట్ల విలువైన ల్యాండ్ స్కామ్‌ను గుర్తించారు. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెండురోజులపాటు పలు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. గురు, శుక్రవారాల్లో తనిఖీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా సోదాలు చేపట్టారు. రోహన్ హర్‌మాల్కర్ ఈ భూ కుంభకోణంలో కీలక సూత్రధారి అని తేలింది. వెయ్యి కోట్ల మేర విలువైన ప్రాపర్టీ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రోహన్ హర్‌మాల్కర్ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేవారు. బీజేపీ టికెట్ నిరాకరించడంతో అతను ఇండిపెండెంట్‌గా >>2

## బిఆర్ఎస్ రజతోత్సవ సభకు

# సర్వం సిద్ధం

### 154 ఎకరాల్లో సభా వేదిక.. భారీగా ఏర్పాట్లు

**హన్మకొండ బ్యూరో, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రజతోత్సవానికి పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్టీ ఏర్పడి పాతికేళ్ల పడిలోకి అడుగు పెడుతుండటంతో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలతో ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు జంక్షన్‌గా ఉన్న ఎల్కతుర్తిని సభ నిర్వహణకు ఎంపిక చేసి, జన సమీకరణపై ఫోకస్ పెట్టారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, వొడితల సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో పార్కింగ్ ఏర్పాట్లతో పాటు సభా వేదికను ముస్తాబు చేశారు. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మందికిపైగా జనాలను తరలించేందుకు గులాబీ నేతలంతా ప్లాన్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనాలను తరలించేందుకు టీజీఎస్ఆర్టీసీ నుంచి 3 వేలకు పైగా బస్సులకు పర్మిషన్ కూడా తీసుకున్నారు. వాటితోపాటు ఇతర బస్సులు,కార్లు, లారీలు, డీసీఎంలు అన్ని కలిపి 20 వేలకు పైగా వెహికిల్స్ వస్తాయని అంచనా వేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ వైపులా నుంచి వచ్చే జనాలు, వాహనాల కోసం ఎల్కతుర్తి, చింతలపల్లి శివారులో దాదాపు 1250 ఎకరాలను >>2



ఎల్కతుర్తిలో సిద్ధమైన బిఆర్ఎస్ రజతోత్సవ సభా వేదిక



పుల్వామా జిల్లాలోని ముర్రాన్ ప్రాంతంలో పేలుడుకు ధ్వంసమైన పహల్గాం ఉగ్రవాద దాడి నిందితుడు అహ్సాన్ ఉల్ హక్ షేక్ ఇంటి వద్ద గుమిగూడిన ప్రజలు

## కాశ్మీర్‌లో ఐదుగురు ఉగ్రవాదుల

# ఇళ్లు కూల్చివేత

### భద్రతా దళాల గాలింపు ముమ్మరం

**శ్రీనగర్, ఏప్రిల్ 26:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడి తర్వాత ముష్కరుల ఏరివేతకు భద్రతా దళాలు గాలింపుచేపట్టాయి. లష్కరే తోయిబా ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు అనుమానితులకోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈక్రమంలోనే వారి ఇళ్లను వెతికి వాటిని ధ్వంసంచేస్తున్నాయి. జమ్ముకాష్మీర్ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఐదుగురు ఉగ్రవాదుల నివాసాలను పేల్చేసాయి. షోపియాన్‌లోని చోటిపోరా గ్రామంలో లష్కరే తోయిబా కమాండర్ షాహిద్ అహ్మదక్ష నివాసాన్ని భద్రతా బలగాలు పేల్చేసాయి. మూడునాలుగేళ్లుగా ఉగ్రసంబంధిత కార్యకలాపాల్లో చురుగ్గా >>2

# రూ.1,400 కోట్ల రుణానికి ఇండెంట్



### బహిరంగ మార్కెట్ నుంచి రుణం పొందేందుకు సర్కార్ ప్రతిపాదనలు

**హైదరాబాద్,ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ రుణాన్ని సేకరించేందుకు సిద్ధంమైంది. ఇందులో భాగంగా రిజర్వ్ బ్యాంక్‌కు ఈ సమాచారాన్ని అందించింది. ఇందుకు గాను రాష్ట్ర సర్కారు మరో 1,400 కోట్ల రూపాయల మేర రుణం తీసుకోనున్నది. ఈ రుణాన్ని త్వరలో రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో జరిగే బహిరంగ మార్కెట్ నుంచి తీసుకునేందుకు ఇండెంట్ పెట్టింది. ఈ నెల 29న నిర్వహించే ఈవేలం ద్వారా 700 కోట్ల రూపాయల చొప్పున ఈ రుణ సమీకరణ చేయనున్నట్టు పేర్కొన్నది. ప్రస్తుత 2025-26 తొలి త్రైమాసికంలో 14 వేల కోట్ల రూపాయల చొప్పున రుణ సమీకరణ కోసం రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో 4 వేల కోట్ల రూపాయల మేర అప్పు తీసుకోనున్నట్టు ఈ ప్రతిపాదనల్లో తెలిపింది. అందులో ఇప్పటికే 3 వేల కోట్ల రూపాయల చొప్పున రుణం తీసుకున్నది.



శ్రీనగర్‌లో ఉగ్రవాద సహచరుల ఇళ్లలో శనివారం సోదాలు జరుపుతున్న భద్రతా సిబ్బంది

# కాశ్మీర్‌లో ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు కూల్చివేత

>> ఉన్నాడని అధికారుల వాదన. కుల్గాంలోని మతాలం ప్రాంతంలో మరో చురుకుగా ఉన్న టెర్రిస్ట్ జాహిద్ అహ్మద్ నివాసాన్ని ధ్వంసంచేసారు. ఇదే జిల్లాలో లష్కరేకు చెందిన మరో ఉగ్రవాది ఇషాన్ అహ్మద్‌షేక్ నివాసం కూడా పేల్చేసారు. 2023 జూన్‌నుంచి ఇతడు దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ఉన్నాడు. కుల్గాంలోని ముర్రాన్‌ప్రాంతంలో ఉగ్రవాది అహసన్ ఉల్ హక్ ఇంటిని బాంబులతో కూల్చారు. అహసన్ 2018లో పాకిస్థాన్ వెళ్లి ఉగ్రశిక్షనను తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత కాశ్మీర్‌లోయలోకి తిరిగొచ్చి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిఘా ఏజెన్సీలు తెలిపాయి. పుల్వామాలోని కాచిపొరా ప్రాంతంలో హారిస్ అహ్మద్ అనే ఉగ్రవాదిఇంటిని బాంబులతో కూల్చేసారు. 2023నుంచి లష్కరే తరపున చురుకుగా పనిచేస్తున్నట్లు అధికారులు అంచనా. ఈ ఐదుగురిపైనా ఇప్పటికే పలు కేసులునమోదయ్యాయి. పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరుల్లో ఆదిల్‌హుస్సేన్ థోకర్ మరో ఉగ్రవాది ఆసిఫ్ షేక్ ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వేరువేరు పలేదు ఘటనల్లో ఇవి ధ్వంసం అయ్యాయి. వారి ఇళ్లల్లో అప్పటికే బాంబులు అమర్చి ఉన్నాయని భద్రతా బలగాలను ట్రాప్‌చేయడంకోసమే వాటిని యాక్టివేట్‌చేసారని పోలీసుల అనుమానం. అలాగే కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దరు అనుచరులను భద్రతా దళాలు శనివారం అరెస్టుచేసాయి. ఖైమోహ్‌ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే వారిపేర్లు ఇతర వివరాలను భద్రతా సిబ్బంది వెల్లడించలేదు.

# ఉగ్రవాదంపై కఠిన నిర్ణయాలు

>> నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వంలో కూడా అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం వాటికి తావులేకుండా క్రమం తప్పకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోండి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో భారత్ ఆర్థిక ప్రగతిలో అగ్రభాగాన నిలిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. గతంలో 11వ స్థానంలో ఉన్న భారత్‌ను 5వ స్థానంలో నిలిపారని, మరో మూడేళ్లలో 3వ స్థానానికి తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారని అన్నారు. అట్లాగే భారత్‌కు స్వాతంత్రం వచ్చి 2047 నాటికి 100 ఏళ్ల పూర్తి కానున్న సందర్భంగా అప్పటికి అమెరికా, చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలన్నదే మోడీ ఆకాంక్ష అన్నారు. మోడీ కృషిలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నట్లు బండి సంజయ్‌కుమార్ అన్నారు.

# సింధూ విషయంలో భారత్‌కు గట్టి బదులిస్తాం

>> నిర్మించరాదు అన్న అభిప్రాయాన్ని అక్కడ స్థానకి ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో సుకుర్‌లో జరిగిన బహిరంగ సభలో బిలావల్ భుట్టో ప్రసంగించారు. ఈ అంశంలో పీపీపీ, పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ పార్టీల మధ్య అగ్రిమెంట్ కుదిరినట్లు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల ఆమోదం లేకుండా సింధూ నదిపై కొత్తగా కాలువలు నిర్మించరాదు అని పాక్ ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. సింధూ నదిపై మరోసారి దాడి జరుగుతోందని బిలావల్ ఆరోపించారు. ఈసారి భారత్ ఆ ప్రయత్నానికి ఒడి గట్టిందన్నారు. పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అంశంలో పాకిస్థాన్‌ను తప్పుగా ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని తమ దేశం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మోదీ తన వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు పాకిస్థాన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు బిలావల్ పేర్కొన్నారు. దానిలో భాగంగానే సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేశారన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో నదిని రక్షించుకునేందుకు, ఇండియాపై పోరాటం కొనసాగుతుందన్నారు. ఇండియా తన ఏకపక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

# సజ్జల శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు రిమాండ్

**విజయవాడ,ఏప్రిల్26,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డిని సిట్ అధికారులు విజయవాడకు తీసుకువచ్చారు. నేడు ఆయన్ను ఏసిబీ కోర్టులో హాజరుపర్చనున్నారు. ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డి మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కీలక నిందితునిగా ఉన్నాడు. కేసులో ఎ-6గా ఉన్న ఆయన్ను సిట్ అధికారులు హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్‌లో అరెస్ట్ చేశారు. శనివారం విజయవాడకు తీసుకువచ్చారు. వైఎస్ జగన్ ప్రభుత్వంహయాం నాటి రూ.వేలకోట్ల విలువైన మద్యం కుంభకోణం కేసులో ఏ6గా ఉన్న ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్ రెడ్డిని సిట్ అరెస్ట్ చేసింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన్ను అదుపులోకి తీసుకుంది. 2019లో వైఎస్సార్సీపీ అధికారం చేపట్టాక నూతన మద్యం విధానం ముసుగులో నెలనెలా రూ.50 నుంచి రూ.60 కోట్ల రూపాయల మేర ముడుపులు కొల్లగొట్టేందుకు జగన్ ముఠా నిర్వహించిన ప్రతిసమావేశంలో వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌తో కలిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డిదే ప్రధాన పాత్ర: నంద్యాలలో ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు చెందిన డిస్టిలరీలో ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి పెద్ద ఎత్తున జే బ్రాండ్లు ఉత్పత్తి చేయించారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు వాటికే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు. మద్యం సరఫరా ఆర్డర్లను అడ్డుపెట్టుకుని ముడుపులు వసూలు చేయొచ్చనే ఆలోచన అందించటంలోనూ శ్రీధర్‌రెడ్డిదే ప్రధాన పాత్రగా సిట్ ఇప్పటికే గుర్తించింది.

ముడుపుల 20 శాతానికి పెంచారు. మద్యం కుంభకోణం కుట్రదారులంతా కలిసి ముడుపుల వసూళ్ల ప్రణాళిక సిద్ధం చేశాక సజ్జల శ్రీధర్‌రెడ్డే హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముడుపులు చెల్లించే కంపెనీలకే మద్యం సరఫరా ఆర్డర్లు ఇస్తామని కాదంటే తీవ్రంగా నష్టపోతారని బెదిరించారు. కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు మూలధరపై 12 శాతం ముడుపులు చెల్లించేందుకు అంగీకరించారు. తర్వాత కొద్ది రోజులకే ముడుపుల మొత్తాన్ని 20 శాతానికి పెంచేశారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాహుల్‌కి స్వాగతం పలికిన రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు (శంషాబాద్)రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో రాహుల్ గాంధీ హెచ్ఐసీసీకి బయలుదేరారు. సమ్మిట్‌లో పాల్గొన్న అనంతరం సాయంత్రం 6 గంటలకు తిరిగి ఢిల్లీకి వెళ్లిపోయారు.

# అశ్రునివాళి

>> నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. "గత ఈస్టర్ ఆదివారం నాడు కూడా తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ, సెయింట్ పీటర్స్ బేసిలికా బాల్కనీ నుంచి ఆయన మనందరినీ ఆశీర్వదించిన దృశ్యం మన మదిలో చిరకాలం నిలిచిపోతుంది" అని కార్డినల్ రే పేర్కొన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల జరుగుతున్న నష్టాన్ని చూసి పోప్ తీవ్రంగా కలత చెందారని, శాంతి స్థాపన కోసం, చర్చల ద్వారా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పిలుపునిచ్చారని ఆయన వివరించారు. అంత్యక్రియల ప్రార్థనల అనంతరం, పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని ప్రత్యేక వాహనంలో రోమ్‌లోని బేసిలికా డి శాంటా మారియా మగ్గియోరేకు తరలించారు. పోప్ ఫ్రాన్సిస్ తన వీలునామాలో పేర్కొన్న ప్రకారం, వాటికన్ గోడల వెలుపల ఈ బాసిలికాలో ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. శతాబ్ద కాలంలో వాటికన్ వెలుపల ఖననం చేయబడిన తొలి పోప్... పోప్ ఫ్రాన్సిస్ కావడం గమనార్హం. కార్డినల్ కెవిన్ ఫారెల్ ఆధ్వర్యంలో ఖనన ప్రక్రియ పూర్తయింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జార్జ్ కురియన్, గోవా శాసనసభ డిప్యూటీ స్పీకర్ జోషువా డిసౌజా తదితరులు భారత ప్రతినిధి బృందంలో ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులు డి సిల్వా, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ, బ్రిటన్ యువరాజు విలియం, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సహా పలువురు ప్రపంచ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా రోమ్ నగరం అంతటా 2000 మందికి పైగా పోలీసులను మోహరించారు.

## వారం - వర్జ్యం

**తేది : 27-04-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**చైత్రమాసం, ఉత్తరాయణం,**
**వసంత ఋతువు, కృష్ణ పక్షం**
అమావాస్య రా.1.00
అశ్వని రా.12.38
వర్జ్యం ఉ.9.02-10.26
దు.సా.4.41-5.32
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం నిదానంగా దాలుస్తాయి.

**వృషభం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలు అంతంత మాత్రంగా ఉంటాయి.

**కర్కాటకం :** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**సింహం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయటా అనుకూలత. వస్తులాభం.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ధన వ్యయం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృశ్చికం:** కుటుంబంలో ఒత్తిడులు ఎదురైన అనగమించి ముందుకు సాగుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**ధనుస్సు:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు నిదానంగా కుదురుతాయి. ఉద్యోగాలలో స్థాన మార్పులు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో కొంత చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. సోదరుల కలయిక.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. సన్నిహితుల నుండి సహాయ సహకారాలు పొందుతారు. వస్తు సేకరణ.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. తండ్రి నుండి ఆస్తి లాభం పొందడారు. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మా ప్రభుత్వ లక్ష్యం

>> ప్రారంభించాం. మేం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగలిగాం. 5లక్షల మంది యువతకు ప్రయోజనం కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించుకుమని చెప్పారు. ప్రజోపయోగ విధా నాలను రూపొందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నీటిపారుదల, విద్యపై దృష్టి సారిం చారు. ఇందిరాగాంధీ గారు రోటీ, కపడా ఔర్ మకాన్ అనే నినా దంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారు.ఆ తర్వాత వచ్చిన ముగ్గురు కాంగ్రెస్ ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్.. వారు ఆధునికీకరణ, అభివృద్ధి, టెలికాం, సాఫ్ట్ వేర్ వంటి ప్రపంచ సాంకేతిక విప్లవాలపై దృష్టి సారించారని గుర్తు చేశారు. వారి కృషి వల్లే భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. దావోస్, అమెరికా, దక్షిణ కొరి యా, జపాన్, సింగపూర్ లలో జరిగిన పెట్టుబడుల సదస్సులకు మేం హాజరయ్యామని చెప్పారు. ప్రైవేటు రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టు బడులు వచ్చాయి.మా రాష్ట్రంలో అద్భుతమైన మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని,. కొంత మంది మహిళలు కలిసి స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 67 లక్షల మంది స్వయం సహాయక సభ్యులున్నారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చూడాలన్నదే మా లక్ష్యమని పేర్కొన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులను చేశాం మన విద్యుత్ పంపిణీ సంస్థలు వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు మహిళా సౌర విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయని తెలిపారు.కార్పొరేట్ రవాణా సంస్థలతో పోటీ పడుతూ మహిళలు 600 బస్సులను నడుపుతున్నారు.సోలార్ ప్లాంట్లు, ఈవీ బస్సులు నడపడంలో అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థలతో మన మహిళా పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి మహిళను ఇంటి యజమానిని చేయాలని సంకల్పించామని,.తొలి ఏడాదిలో 4,50,000 కుటుంబాలకు సొంత ఇళ్ల నిర్మించుకునేందుకు రూ.22 వేల కోట్లు అందిస్తున్నామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు పథకం కోసం 15 నెలల్లో రూ.5 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు.200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్,రేషన్ ద్వారా సన్న బియ్యం అందిస్తున్నాంమా ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ .10 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పౌరుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నాం.ఏడాదిలో ఇప్పటి వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,000 కోట్లు ఆర్థికసాయం అందించామని వెల్లడించారు. మూసీ పునరుజ్జీవ నంతో హైదరాబాద్ ను కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.న్యూయార్క్ లోని హడ్సన్ నది, లండన్ లోని థేమ్స్ నది, టోక్యోలోని సుమిదాతో సహా అనేక నగరాల్లో నదీ, నదీతీర అభివృద్ధిని అధ్యయనం చేశామని,భవిష్యత్తులో మూసీ మన నగరానికి అతిపెద్ద ఆకర్షణగా మారి వేలాది మందికి ఉపాధిని కల్పిస్తుందని తెలిపారు.హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చి దిద్దేందుకు అనేక ఇన్ ఫ్రా ప్రాజెక్టులు చేపడుతున్నామని, 30 వేల ఎకరాల్లో ప్రపంచస్థాయి నగరం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.370 కిలోమీటర్ల పొడవైన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో రైలు విస్తరణ చేపడుతున్నాం.త్వరలో గిగ్, యాప్ వర్కర్స్ వెల్ఫేర్ పాలసీని రూపొందించబోతున్నామని,ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు.భారతదేశంలో కుల సర్వే నిర్వహించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వంగా ఉందని,దేశంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేపట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.ట్రాఫిక్ పోలీస్ విభాగంలో థర్డ్ జెండర్‌ను రిక్రూట్ చేసుకున్న తొలి ప్రభుత్వం తెలంగాణ అని చెప్పడానికి సంతోషిస్తున్నామన్నారు.మేం ఇప్పుడే పని మొదలు పెట్టాం.ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు.ప్రజల జీవితాలను మార్చేందుకు మేం చేపట్టిన మిషన్ లో చేరాలని మీ అందరినీ ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మీ అనుభవం, పరిజ్ఞానం, నైపుణ్యాలను మాతో పంచుకోండి,మీరే 'తెలంగాణ రైజింగ్' బ్రాండ్ అంబాసిడర్లుగా మారి..తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి అని భారత్ సమ్మిట్‌కు హాజరైన దేశ,విదేశ ప్రతినిధులను కోరారు.

# ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే..

>> సమ్మిట్ లో పాల్గొనాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని తెలిపారు. పాతతరం నాయకత్వం అంతరించిపోయిందని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని పిలుపునిచ్చారు. కొత్త తరం భాషను రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలని సూచించారు. కొత్త తరాన్ని ప్రోత్సహించాలి, యువ నేతలను తయారు చేయాలని రాహుల్ గాంధీ తెలిపారు. గత పది సంవత్సరాలలో ప్రపంచ రాజకీయాలు చాలా మారిపోయాయని అన్నారు. ఆధునిక సమాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందని.. రాజకీయా ల్లోకి కొత్తతరం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచ వ్యాప్తంగా మారిపోయాయని,పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని ఆయన తెలిపారు. ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే, ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయని, మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయిందన్నారు. విపక్షాలకు సభలో మాట్లడే అవకాశం రావడం లేదని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి పాదయాత్ర మొదలు పెట్టానని 10 రోజుల తర్వాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగిపోయిందని. చాలా మంది నాతో కలిసి నడవటం మొదలుపెట్టారన్నారు. భారత్ జోడో యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నానని. సగం దూరం నడిచేటప్పటికీ నేను గతంలో లాగా లేనని చెప్పారు. పాదయాత్రలో ప్రజలతో ఎలా మాట్లాడాలో వారి సమస్యలు ఎలా వినాలో నేర్చుకున్నానని, నేను గతంలో ఎప్పుడూ ప్రజలపై ఉన్న ప్రేమను వ్యక్త పరచలేదని రాహుల్‌గాంధీ వెల్లడించారు. కానీ పాదయాత్రలో నేను ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరచగలిగానని పేర్కొన్నారు. నేను ఎప్పుడైతే ప్రజలపై నా ప్రేమను వ్యక్తపరిచానో అప్పట్నుంచి అందరూ స్పందిస్తున్నారని తెలిపారు. యాత్రలో కొన్ని సార్లు స్టక్ అయ్యాను. అప్పటి నుంచి నన్ను చాలా మంది ఇష్టపడటం మొదలు పెట్టారని పేర్కొన్నారు. ఓ చిన్న అమ్మాయి వచ్చి లవ్ యూ అని చెప్పిందని, ఆ తర్వాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్‌ప్రెస్ చేస్తూ వచ్చానని పేర్కొన్నారు. హిందీలో ఓ స్లోగన్ తీసుకున్నాం విద్వేషం అనే బజార్‌లో ప్రేమ అనే దుకాణం తెరిచా(నఫ్రత్ కే బజార్ మే... మహబత్‌కే దుకాన్) అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. పాదయాత్రలో జనం సమస్యలు వినటం నేర్చుకున్నానని, ఇప్పుడు వారి సమస్యలు వినటంలో నాయకులు విఫలమయ్యారని రాహుల్ గాంధీ వివరించారు.



వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బసిలికాలో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# బిఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధం

>> సేకరించారు. అందులో సుమారు 154 ఎకరాల్లో సభా వేదికను ఏర్పాటు చేశారు. మిగతా వెయ్యికిపైగా ఎకరాలను పార్కింగ్ అవసరాల కోసం కేటాయించారు. ఈ మేరకు ఐదు జోన్లలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

**2 వేల మంది వలంటీర్లు**

రజతోత్సవ బహిరంగ సభకు ఐదు చోట్లా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయగా, వాహనాల మళ్లింపు, ఇతర సేవల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 2 వేల మందికిపైగా వలంటీర్లను అందుబాటులో ఉంచారు. ఈ మేరకు వారికి ప్రత్యేకంగా డ్రెస్ కోడ్ ఇచ్చి వెహికిల్స్ మళ్లింపుతో పాటు జనాలకు అవసరమైన సేవలందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే వారందరికీ ట్రైనింగ్ కూడా ఇచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

**200 జనరేటర్లు..**

ఎల్కతుర్తి వద్ద దాదాపు 1,250 ఎకరాల్లో సభ నిర్వహించనుండగా.. సభా ప్రాంగణంలో 300కుపైగా లైటింగ్ స్టాండ్స్ ఏర్పాటు చేశారు. వాటికి విద్యుత్తు సరఫరా అందించేందుకు 200కుపైగా జనరేటర్లు పెడుతున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఇదిలాఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చే కరెంట్ పై తమకు నమ్మకం లేదని, అందుకే 200కుపైగా జనరేటర్లు ఏర్పాటు చేసినట్లు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా వ్యాఖ్యానించడం గమనార్హం.

**వైద్య సేవల కోసం బృందాలు**

సభకు 10 లక్షల మంది వరకు వస్తారని పార్టీ అంచనా వేస్తుండగా, ఎండల నేపథ్యంలో అక్కడ వందకు పైగా వైద్య బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. అంతేగాకుండా ఎమర్జెన్సీ సేవల కోసం 15 అంబులెన్సులు, 10 లక్షల వాటర్ బాటిల్స్, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో పెడుతున్నారు. అంతేగాకుండా ఎక్కడికక్కడ తాత్కాలిక టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేశారు.రజతోత్సవ సభ నిర్వహణకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, పార్టీ నేతలు జన సమీకరణపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే జిల్లాలు, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్చార్జులను నియమించి, కార్యకర్తలతో సమావేశాలు కూడా నిర్వహించారు. ఇప్పటికే దూర ప్రాంతాల నుంచి ప్రభ బండ్లతో పాటు పాదయాత్రలతో పార్టీ కార్యకర్తలు ఎల్కతుర్తి సభా ప్రాంగణానికి బయలుదేరారు. ఇవాళ (27వ తేదీ) సాయంత్రం వరకు సభ ప్రారంభం కానుండగా, సాయంత్రం 4 గంటలలోగా కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని పార్టీ నేతలు సూచిస్తున్నారు.

# రూ.1000 కోట్ల భూకుంభకోణంపై ఇడి సోదాలు

>> బరిలో నిలిచాడు. భూ కుంభకోణం వెనుక అతనే మాస్టర్‌మైండ్ అన్న ఆరోపణలు వస్తున్నాయి. నిజమైన హక్కుదారులకు చెందిన భూమిని అక్రమ రీతిలో, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెవన్యూ రికార్డులను కూడా తారుమారు చేసినట్లు రోహన్‌పై కేసు బుక్కైంది. వ్యక్తిగత, ఫ్యామిలీ ఎస్టేట్‌లకు చెందిన భూముల్ని.. అక్రమ రీతిలో అమ్మేసి.. తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

అక్రమ భూ మార్పిడి కేసులను పరిష్కరించేందుకు గోవా సర్కారు 2022 జూన్ 15వ తేదీన సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో భూమి ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 100కుపైగా ఉన్న ప్రాపర్టీలకు చెందిన 44 ఎఫ్ఐఆర్‌లను సిట్ విచారించింది. పురావాస్తు శాఖకు చెందిన అధికారుల్ని ఈ కేసులో అరెస్టు చేసింది. ల్యాండ్ గ్రాబింగ్ కేసుల్ని విచారించేందుకు బాంబే హైకోర్టు మాజీ జస్టిస్ వీకే జాదవ్ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# మాజీ ఎంపి బుట్టా రేణుక ఆస్తుల వేలం

**విజయవాడ ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి అనుబంధ విభాగమైన ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.310 కోట్లు అప్పు తీసుకున్న వైకాపా మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతులు తిరిగి చెల్లించక పోవడంతో వారి ఆస్తుల వేలం దిశగా అడుగులు పడుతున్నాయి. కొంతకాలం పాటు కిస్తీలు సక్రమంగా చెల్లించినప్పటికీ ఐదేళ్ల నుంచి ముఖం చాటేశారు. సంస్థ బెంగళూరు బ్రాంచి ప్రతినిధులు పలుసార్లు నోటీసులు పంపడంతో పాటు సంప్రదింపులు జరిపినప్పటికీ నిష్ఫలమే అయింది. బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠలు 2018లో 15 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించేలా రూ.310 కోట్ల రుణం తీసుకున్నారు. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ కార్యకలాపాలకు రుణాన్ని వినియోగించారు. రుణంపై సుమారు రూ.40 కోట్ల వరకు చెల్లించారు. అసలు, వడ్డీ కలిపి ఇంకా రూ.340 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. వడ్డీ భారం ఎక్కువగా ఉన్నందున కొన్ని ఆస్తులు విక్రయించి రుణం రీషెడ్యూలు చేయాలని వారు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపాదన ఉందని హెచ్ఎఫ్ఎల్ ప్రతినిధులు అంగీకరించలేదు. రుణం తీసుకున్న మొత్తానికి నెలసరి వాయిదా రూ.3.40 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం భారంగా మారినందున తొలుత తక్కువ మొత్తం తీసుకుని చెల్లింపు మొత్తాన్ని క్రమేణా పెంచాలని ప్రతిపాదిం చారు. ఆ ప్రతిపాదననూ హెచ్ఎఫ్ఎల్ తిరస్కరించింది. రుణాలు చెల్లించడం ఆపేసినందున హెచ్ఎఫ్ఎల్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. ప్రస్తుతం కేసు పెండింగ్‌లో ఉంది. రుణ నిబంధనలకు అనుగుణంగా బుట్టా రేణుక దంపతులకు చెందిన బంజారా హిల్స్‌లోని ఐదువేల గజాల ఆస్తిని రూ.145 కోట్లకు వేలం వేయగా ఎవరూ ముందుకు రాలేదు. మాదాపూర్‌లోని 7205 చ.గజాల్లో ఉన్న బుట్టా కన్వెన్షన్ వేలానికీ స్పందన రాలేదు. మరోసారి వేలానికీ ప్రయత్నిస్తున్నారు.

# పి 4తోనే పేదరికం నుంచి విముక్తి

## ఎపి సిఎం చంద్రబాబు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాలసీలతో ఆర్థికంగా పైకొచ్చిన వారు సమాజంలోని పేదలకు చేయూతనిచ్చి అన్ని విధాలా వారిని అభివృద్ధి చేసేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో మత్స్యకారుల సేవలో పథకాన్ని ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రజావేదిక సభలో జీరో పావర్టీపీ4 కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే కాకుండా మార్గదర్శుల ద్వారా సాయం అందించి అన్ని విధాలాపైకి తీసుకొచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మార్గదర్శులు దత్తత తీసుకున్న కుటుంబాలకు ఏం చేస్తున్నారో కూడా సమీక్ష చేస్తామని ఆయన పేర్కొన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నది తన లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని విధాలా ఆర్థికంగా పైకొచ్చిన వారు పేద కుటుంబాలను ఆదుకుంటే సమాజంలో అసమాన తలు ఉండవని ఆయన వ్యాఖ్యానించారు. ఇబ్బందులు తెలుసుకుందామనే నేరుగా మీ దగ్గర కి వచ్చా : సీ ఎం : కార్యక్రమం లో భాగంగా సీ ఎం చంద్రబాబు బుడగట్లపాలెం మత్స్యకారులతో ముఖాముఖి అయ్యారు. మొదట పోలేష్, రామలక్ష్మి దంపతులతో మాట్లాడారు. పోలేష్ మాట్లాడుతూ.... గ్రామంలో 600 కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయని, సముద్రంలో అలల ఉధృతి సమయంలో బోట్లు తిరగబడి ప్రమాదాలకు గురవుతున్నామని సీఎంకు వివరించారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తే వేటకు సులభం అవ్వడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గుతాయని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వంలో వలలు, మోటార్లు వంటివేమీ మత్స్యకారులకు అందించలేదని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.... మీ సమస్యలు నేరుగా వినేందుకు బుడగట్లపాలెం వచ్చానని, ఏం చేస్తే మీ జీవితాలు బాగుపడతాయో అడిగి తెలుసుకోవడానికే వచ్చానన్నారు. మత్స్యకారుల సేవ పథకంలో భాగంగా రూ.20 వేలు ఆర్థిక సాయంగా వేట నిషేధ సమయంలో ఇస్తున్నామని, మీ పిల్లల్ని చదివించుకోవడానికి ఇబ్బంది లేకుండా వచ్చే నెలలోనే తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ప్రతి చదువుకునే బిడ్డకు ఇస్తామన్నారు. త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, ఇతర వసతులు కల్పిస్తాం : సీఎం అనంతరం మరో మత్స్యకార బృందం వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు... కారి రాంబాబు, సీతోగ్య, ఎర్రయ్యతో మాట్లాడారు. ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఇతర అవకాశాలు కల్పిస్తే ఎంతమేర ఆదాయం పెరుగుతుందని ఆయన వారిని ప్రశ్నించారు. ఇప్పుడు వచ్చేదానికంటే అదనంగా 50 శాతం వస్తుందని మత్స్యకారులు బదులిచ్చారు.



# రాష్ట్రంలోని మదర్సాల్లో ఏం నేర్పిస్తున్నారు?

### వాటిల్లో ఎందుకు తనిఖీలు చేయడం లేదు?

### డిజిపితో భేటీ అయిన ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న ప్రతీ మదర్సలోని వారందరూ ఏ రాష్ట్రం, ఏ దేశం వాళ్లు, వారికి ఏం నేర్పిస్తున్నారో సిఎస్, డిజిపి చూడాలని ఎంపి రఘునందన్‌రావు డిజిపి జితేందర్‌రెడ్డిని కోరారు. శనివారం తెలంగాణ డిజిపి జితేందర్ రెడ్డితో మెదక్ ఎంపి రఘునందన్ రావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో శివాలయం ధ్వంసం చేసిన పోలీసులు సకాలంలో స్పందిం చలేదని తెలిపారు. ఘటన మధ్యాహ్నాం జరిగితే రాత్రి దాకా పోలీసులు రాలేదన్నారు. కేవలం హిందువుల మీద నాలుగు ఎఫ్ఐఆర్‌లు పెట్టారని అన్నారు. నాలుగు పేర్లు రాసి ఇతరులు అని రాసి బిజెపి, హిందూ కార్య కర్తలను ఇష్టం వచ్చినట్టు అరెస్ట్ చేస్తున్నారంటూ మండిపడ్డారు.

పక్కన ఉన్న మదర్సాలోని పిల్లలు కూడా హిందువులే అని పోలీసులకు అప్పజెప్పారు ఇప్పటికే 19 మంది జైలుకు పోయారు. ఇంకా అరెస్ట్ చేస్తూనే ఉన్నారన్నారు. సిసి కెమెరాలు బాగున్నాయి, కమాండ్ కంట్రోల్ ఉందని పోలీసులు, రాత్రి దాకా ఎందుకు స్పందించలేదు అని డిజిపిని రఘునందన్ రావు ప్రశ్నించారు. అయితే, అక్కడ మదర్సలోఉన్న పిల్లలు ఈ దేశం పిల్లలు అని మీ ఎస్‌పి చెప్పగలరా అంటూ రఘునందన్‌రావు అడిగారు. టోపీ పెట్టుకుంటే మనోడు అని కాపాడుతున్నారు అన్నారు. అక్కడ మదర్సాలో ఉండే 12 యేళ్లలోపు పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం పెంచడం ఎందుకు అంటూ ప్రశ్నించారు. అక్కడ విగ్రహం పగిలిన తర్వాత మదర్స పిల్లలు లోపలికి పోయి వచ్చిన వీడియోలు ఎందుకు బయటకు రావడం లేదని మండిపడ్డారు.

రామాలయం జాగాలో మదర్స ఎట్లా వచ్చిందని, కలెక్టర్ ఆ మదర్సలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్లో చెప్పండి అని డిమాండ్ చేశారు. శివనగర్, సదాశివపేటలో ఉన్నట్టు వంటి మదర్సలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్ళు అని అడిగారు. ముత్యాలమ్మ దేవాలయం సంఘటన తర్వాత మీ ఇంటెలిజెన్స్ ఎందుకు వైఫల్యం చెందిందన్నారు. అక్కడ ఏం జరిగిందని గుమిగూడిన అందరినీ రిమాండ్ చేయడం ఎంత వరకు సమజసం అంటూ పేర్కొన్నారు.

ఇక, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భారత ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, రోహింగ్యాలను వెళ్లగొట్టకపోతే భాగ్యనగరం మండుతుందన్నారు. హైదరాబాద్‌లో 70 వేల మంది రోహింగ్యాలు ఉన్నారని అంటున్నారు. ఇంతకీ ఏం జరుగుతున్నాదని ప్రశ్నించారు. గతంలో డిజిపి ఆఫీసు మీద బురఖాలో వచ్చి దాడి చేసిన ఘటనను మర్చిపోవద్దని గుర్తు చేశారు. అహింసో పరమో ధర్మో అనేది మా నినాదం కానీ మమ్మల్ని ఇబ్బంది పెడితే హింస ఉంటుందన్నారు.

# కాళేశ్వరం ఇఎన్‌సి హరిరామ్ ఇంటిపై ఎసిబి దాడులు

### జలసౌధలో అధికారుల తనిఖీ

### ఉల్కిపడిన నీటిపారుదల శాఖ అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26,ప్రభాతవార్త:** హైదరాబాద్ షేక్‌పేటలోని ఆదిత్య టవర్స్‌లో నివాసం ఉంటున్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఇఎన్‌సి హరిరామ్ ఇంట్లో శనివారం తెల్లవారుజాము నుంచి అవినీతి నిరోధకశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జలసౌధలోని ఆయన క్యాంపు కార్యాలయానికి, గజ్వేల్‌లోని ఆఫీసుకు ఉదయం ఏడు గంటలకు ఎసిబి అధికారులు చేరుకొని వివిధరకాల ఫైళ్లు, ఇతర అధికార ఉత్తర ప్రత్యుత్తరాల పత్రాలు, కంప్యూటర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఇప్పటివరకు విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎ, పిసి ఘోష్ కమిషన్ విచారణ మాత్రమే నిర్వహిస్తున్నారు. ఎన్‌డిఎస్‌ఏ నివేదిక వెలువడిన కొద్దిరోజుల్లోనే ఎసిబి సోదాలు చేపట్టడం తీవ్రకలకలం సృష్టించింది. ఇరిగేషన్ మాజీ ఇఎన్సీ హరిరాం ఇంటిపై ఏసీబీ అధికారులు శనివారం తెల్లవారుజాము నుంచే సోదాలు నిర్వహిస్తున్నారు. జలసౌధలో, మెదక్ తహసిల్ కార్యాలయంలో ఆయనకు సంబంధించిన 14 చోట్ల ఎసిబి అధికారులు ఏక కాలంలో దాడులు సోదాలు చేపట్టారు. అయితే, ఎన్డీఎస్ఏ రిపోర్టు ఆధారంగా ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా, గజ్వేల్ ప్రాంత ఇఎన్‌సిగా విధులు నిర్వర్తిస్తున్నారు. టోలీచౌకిలోని హరిరాం ఇంట్లో కొనసాగుతున్న ఎసిబి సోదాలలో నగదు, బంగారు ఆభరణాలు,ఇతర విలువైన భూముల డాక్యుమెంట్లు లభ్యమైనట్లు ఒక అధికారి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా భారీగా ఆస్తిపత్రాలను అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. గజ్వేల్లో 30 ఎకరాల భూమి దస్తావేజులు దొరికాయని తెలిసింది. అలాగే, మూడు బ్యాంక్ లాకర్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ సోదాల్లో భాగంగా అనధికారిక లావాదేవీలను కూడా గుర్తించే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నారు. ఆర్థికపర అంశాలతో పాటు అనుమతుల విషయంలో జరిగిన అవకతవకల్లో తన పాత్ర పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ లో ప్రశ్నలు ఎదుర్కొన్నారు. ఆయన భార్య అనిత ఇంట్లో జరిపిన సోదాలో మార్కుక్‌లోని వంద ఎకరాల భూమికి సంబంధించిన దస్తావేజులు లభించగా ఎమ్మార్వో ఆఫీసులో తనిఖీకి ఎసిబి బృందం వెళ్ళిందని తెలిసింది. మరోవైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన తుది నివేదిక తీవ్ర దుమారం రేపుతోంది. వీటిని రీడిజైన్ చేసి.. మళ్లీ నిర్మించాలని సిఫారసు చేసింది. నిర్మాణం, డిజైన్లో అన్నీ లోపాలేనని స్పష్టం చేసింది. ఎన్డీఎస్ఏ రిపోర్టులో నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే మూడు బ్యారేజీలకు గండిని తేల్చే యడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది.

**మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో...**

**మర్కుక్/గజ్వేల్ :** ఆదాయంకు మించి ఆస్తులు ఉన్నాయని, గతంలో ఈఎన్‌సిగా విధులు నిర్వహించిన హరిరామ్‌పై కేసు నమోదు చేయడంతో పాటు శనివారం మండలకేంద్రం మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసిబి డిఎస్పీ సుదర్శన్, ఇన్స్పెక్టర్లు కొండా రమేష్, వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. మర్కుక్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 6 గంటల నుండి సుమారు అర్ధరాత్రి వరకు ఏసిబి అధికారులు పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించి అతని పేరుపై ఉన్న కొన్ని డాక్యుమెంట్లను గుర్తించినట్లు సమాచారం. మర్కుక్ మండలంలో అతని సంబంధించి సుమారు 32 ఎకరాలను గుర్తించినట్లు తెలిసింది. అలాగే నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఈఎన్‌సిగా విధులు నిర్వహిస్తున్న హరిరామ్ సతీమణి అనిత పేరుపై మర్కుక్ మండలంలో 30 ఎకరాల్లో ఫాంహౌజ్ ఉన్నట్లు, హైదరాబాద్‌లో లగ్జరీ ప్లాట్లతోపాటు అనేక ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది.

# మార్గదర్శక చట్టాలు, గిగ్ కార్మికుల హక్కుల పెంపుపై సదస్సు




కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** భారత్ సమ్మిట్‌లో భాగంగా 'భారతదేశంలో మార్గదర్శక చట్టాలు, గిగ్ కార్మికుల హక్కులను పెంపొందించడం' అనే అంశంపై తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూని యన్, తెలంగాణ కార్మిక శాఖ, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వ హించింది. ఈ సందర్భంగా జరిగిన కార్య క్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ ప్రొహిబిషన్ పర్యాటక సంస్కృతి, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రోడ్లు, భవనాలు సినిమా టోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంత ర్జాతీయ ప్రతినిధులు, గిగ్ అనేక మంది వాటా దారులు, వేదిక కార్మికులు, అనేక విబీవీలు యూనియన్ ప్రతినిధులు బిల్లుపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రారం భానికి ముందు కార్మిక ఉపాధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారాల కమిషనర్ సంజయ్ కుమార్, కార్మిక అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్ ముసాయిదా బిల్లులోని కీలక నిబంధనలను సమర్పించారు. హామీ ఇవ్వబడిన సహకార సామాజిక భద్రతా నిధి, పారదర్శక అల్గోరిథమిక్ నిర్వహణ కోసం చర్యలను వారి ప్రదర్శన వివరించింది. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటరెడ్డి కూడా ఈ సెషన్‌లో పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రతినిధులు సామాజిక భద్రత, త్రైపాక్షి క పాలన చట్టాలపై విలువైన అభిప్రాయాలను అందించారు. బ్రెజిల్‌కు చెందిన ఫెడరల్ డిప్యూటీ లూసీన్ కావల్కాంటే తన దేశ రంగాల నిధి నమూనాను ప్రతిబిం బించగా, చిలీ మాజీ సామాజిక అభివృద్ధి మంత్రి జార్జియో జాక్సన్, కొలంబియా సెనేటర్ క్లారా లోపెజ్ ఒబ్రెగాన్ జాతీయ చట్టంలో సామూహిక అంశాలను డిజిటల్ గుర్తింపు వ్యవస్థలను పొందు పరచడంలో తమ అనుభవాలను పంచుకున్నారు. కార్మిక నాయకులు అమ్జాద్ ఖాన్, అబ్దుల్ అజీమ్ యాప్ ఆధారిత డెలివరీ, సేవా పనుల రోజువారీ సవాళ్ల గురించి ప్రసంగించారు. ఎన్ఎల్ఎస్ఐయు నుండి బాబు మాథ్యూ, కర్ణాటక యాప్ ఆధారిత వర్కర్స్ యూనియన్‌కు చెందిన మొహమ్మద్ ఇనాయత్ అలీ వంటి విద్యావేత్తలు పోర్టబుల్ ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కార విధానాల ఆవశ్యకతను ప్రస్తావించారు.

# విద్యుత్ కనెక్షన్ల జాప్యానికి చెక్

### ఆన్‌లైన్‌లో వ్యవసాయ కనెక్షన్ల దరఖాస్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యమ్నాయ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వ్యవసాయ విద్యుత్ నిమిత్తం దరఖాస్తులను ఆన్‌లైన్లో స్వీకరించాలని నిర్ణయించింది. అంతేకాకుండా దరఖాస్తు స్థితిగతులను సంబంధిత రైతులే స్వయంగా తెలుసుకునేలా అవకాశాన్ని కల్పించనుంది. ఇందుకోసం ఎన్‌పీడీసీఎల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేస్తోంది. ప్రస్తుతం విద్యుత్ శాఖ నూతన సాంకేతికతతో అన్నదాతలకు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను త్వరగా మంజూరు చేస్తోంది. ఇప్పటి వరకూ వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల మంజూరు కోసం అన్నదాతలు సంవత్సరాలుగా నిరీక్షించేవారు. గడిచిన రెండు సంవత్సరాల నుంచి వేగం పెంచారు.

వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశారు. మొన్నటి వరకు అధికారులు సాంకేతికత ఉపయోగించుకునేవారు. ఈస్టోర్ విధానం ద్వారా స్టోర్‌లోని మెటీరియల్‌ను విత్‌డ్రా చేసేవారు. ప్రస్తుతం దరఖాస్తుదారుడికి కూడా తన దరఖాస్తు స్థితి గతులు తెలుస్తున్నాయి. అధికారులు ఎలాంటి సామగ్రిని ఎంచుకున్నారు. అదే సామగ్రి క్షేత్రస్థాయికి వచ్చిందా లేదా అనే విషయాలు కూడా తెలుస్తాయని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతు మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు సెల్ ఫోన్‌కు సమాచారం అందుతుంది. తదుపరి టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. దానిని ఓపెన్ చేసి అందులో ఎల్‌టీ న్యూ సర్వీస్ కనెక్షన్ విభాగంలో అగ్రికల్చర్ అనే ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి. మీసేవ ద్వారా సెల్ ఫోన్‌కు వచ్చిన నంబరును యాప్‌లో నమోదు చేయాలి. ఈ విధంగా చేయడం ద్వారా కనెక్షన్ వివరాలు ఫోన్‌లో కనిపిస్తాయి. కనెక్షన్ మంజూరు అయితే ఆ సమాచారం ఫోన్ లోని యాప్‌లో అందుబాటులో ఉంచుతారు.

# భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలి

### స్పీకింగ్, రైటింగ్ స్కిల్స్ పెంచుకోవాలి

### బిసి గురుకుల ఇంటర్ విద్యార్థులతో మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బిసి గురుకులాల్లో ఇంటర్ విద్యను పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం అభినందించారు. భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని బేగంపేట్ టూరిజం ప్లాజాలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సత్కరించారు. ఇంటర్మీడియట్ లో మంచి ర్యాంకులు సాధించిన 200 మంది విద్యార్థులకు అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, బిసి గురుకుల సెక్రటరీ సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇంటర్మీడియట్ విద్యా ర్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సంఘ నాయకుడిగా మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించాల్సి ందే నన్నారు. ఈ సత్కారం ద్వారా మిగిలిన విద్యార్థులు తాము కూడా ర్యాంకులు తెచ్చుకోవాలని స్పూర్తి పొందుతారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్య దేవోభవ అని ఉపాధ్యాయులను గౌరవించుకొని విద్యార్థులను తీర్చిద్దిద్దాలన్నారు. అధికారుల నిరంతర పర్యవేక్షణతో వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గతంలో కంటే డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచామని మంత్రి తెలిపారు. విద్యార్థులు తమ ఊరి గౌరవాన్ని, సంస్థ గౌరవాన్ని కాపాడాలన్నారు. ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు భవిష్యత్‌లోనూ ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలని మంత్రి సూచించారు. హార్డ్ వర్క్‌తో పాటు ఎక్కడకు వెళ్లినా గెలిచేలా స్పీకింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించు కోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే ఎలా అధిగమించాలనే నైపుణ్యాన్ని నేర్చుకోవాలన్నారు. ఈ మూడు స్కిల్స్ ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం సులువు అవుతుందన్నారు. గురుకులాల్లో రిజల్ట్ తక్కువ వచ్చిన పాఠశాలపై కూడా రివ్యూ చేస్తామని ..వారిలో మార్పు తీసుకొస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికలతో ముందుకు పోతామనారు. 327 గురుకులాల్లో 700కిపైగా హాస్టల్‌లలో ప్రభుత్వమే అబ్బురపడేలా గురుకులాల్లో రిజల్ట్ వస్తుందనేలా సాధించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. మే 10 నుండి జరిగే 150 దేశాలు పాల్గొంటున్న అందాల పోటీల ప్రారంభోత్సవ వేడుకల్లో మీకు కూడా ఆహ్వానం ఇస్తామని నిర్వాహకులు తెలిపారని.. అక్కడ జరిగే పోటీల్లో చూడడానికి ప్రత్యక్షంగా పాల్గొనడానికి అవకాశం ఇస్తున్నారని తెలిపారు.

# ఆర్థిక కష్టాల్లో మదర్ డెయిరీ

### రైతులకు రూ.22 కోట్లు బకాయిలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తెలంగాణ లోని ప్రముఖ నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్‌ను (మదర్ డెయిరీ) ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. సహకార సంఘం తెచ్చిన రుణాలే 32 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఈ నష్టాల నుండి గట్టెక్కాలంటే మదర్ డెయిరీ స్థిరాస్తులు అమ్మాల్సిన పరిస్థితి తప్పేలా కనిపించడం లేదు. వివిధ కారణాలతో డెయిరీ అప్పులు పెరిగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అప్పులకు వడ్డీల కింద నెలకు రూ.45 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలియ వచ్చింది. 2014-15 వరకు డెయిరీ లాభాల్లో నడవగా, ఆ తర్వాత క్రమంగా అన్నీ నష్టాల ఊబిలోకి వెళ్లిపోయింది. దీంతో నకిరేకల్, చిట్యాల, చండూరులోని డెయిరీకి చెందిన స్థిర ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి మదర్ డెయిరీ యాజమాన్యం అప్పు తీసుకుంది. దీంతో రుణాలు రూ.32 కోట్లకు చేరాయి. మరోపక్క డెయిరీకి పాలు పోసిన రైతులకు రూ.22 కోట్లు బకాయి పడింది. ప్రధానంగా ఢిల్లీ మదర్ డెయిరీ కాంట్రాక్టు రద్దయిన తర్వాతే ఈ నష్టాలు రావడం గమనార్హం.

# కుంట్లూరులో భారీ అగ్నిప్రమాదం

### కాలి బూడిదైన గుడిసెలు..

**హైదరాబాద్ (హాయత్‌నగర్), ఏప్రిల్ 26, ప్రకభాత వార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో దాదాపు 250 నుంచి 300 వరకు గుడిసెలు కాలి బూడిదయ్యాయి. గుడిసెల్లోని వస్తువులు వంట సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. సిలిండర్లు సైతం పేలిపోయాయి. గుడిసెవాసులకి కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. ప్రమాదం మధ్యాహ్నాం సంభవించడం... గుడిసెవాసులు పనులకు వెళ్లిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హాయత్ నగర్ పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హాయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్ సీఐలు నాగరాజు గౌడ్, అంజి రెడ్డి లు సిబ్బందితో వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

**ప్రమాదమా లేక దుశ్చర్యనా..**

మధ్యాహ్నాం సమయంలో గుడిసెల్లో ఎవరు ఉండరు. వంట చేసుకోవడం కూడా చేయరు. అలాంటి సమయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంపై అనుమానలు వ్యక్తం అవుతున్నాయి. గుడిసెలకు కరెంట్ సరఫరా లేకపోవడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం లేదు. దీంతో ఇది ప్రమాదమా లేక ఉదేశ్య పూర్వకంగా ఎవరైనా గుడిసెలకు నిప్పు పెట్టి ఉంటారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి: సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి**

అగ్ని ప్రమాదంలో కట్టు బట్టలతో మిగిలిన గుడిసె వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జాతీ య కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగి స్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరు తున్నా ప్రభుత్వం పట్టించు కోవడం లేదని, కనీస వసతులు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణ సహాయంగా బియ్యం, వంట పాత్రలు, దుస్తులు, కొంత నగదు అందించాలన్నారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకొవాలని పోలీ సులను కోరినట్లు తెలిపారు.

**కలెక్టర్‌కు నివేదిస్తాను: తహసీల్దార్**

ప్రమాదంలో ఆస్థి నష్టం సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కు నివేదిస్తానని అబ్దుల్లా పూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భాదిత కుటుంబాలకు పరిహారం, ఇతర సహాయ సహకారలు అందిస్తామన్నారు. అగి ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాలకు ప్రభుత్వమే పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీ పీ ఐ నాయకులు ఈ టీ నర్సింహా, రవీంద్రచారి, యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు లక్ష్మణ్, హరిసింగ్ నాయక్ డిమాండ్ చేసారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించు కోవడం లేదాన్నారు. కనీస సదుపాయలు కల్పించడం, పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడం చేయాలన్నారు.



గుడిసెల్లో చెలరేగుతున్న మంటలు

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పోలీసులు నమోదు చేసిన కేసులో ఫిర్యాదుదారైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జూన్ 13వ తేదీకి వాయిందా వేసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు వ్యతిరేకంగా నకిలీ వీడియోలను విడుదల చేశారని ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గతేడాది మే 25న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కేటీఆర్, జగదీశ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్ పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ మోసమీ భట్టాచార్య పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కేటీఆర్, జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలు చేయలేదని టివి రమణరావు తెలిపారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా నమోదైన కేసును కొట్టివేయాలని కోరిన న్యాయ వాది రమణారావు కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి పోలీసులు, తీన్మార్ మల్లన్నకు నోటీసులు జారీ చేశారు, పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశిస్తూ విచారణ జూన్ 13కు వాయిదా వేసింది.

# కర్రెగుట్టలో తక్షణమే కూంబింగ్ నిలిపివేయాలి

### మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరపాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కర్రెగుట్టలో జరుపుతున్న కూంబింగ్‌ను వెంటనే నిలిపివేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే శాంతి చర్చలు జరపాలన్నారు. ాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదేపదే ప్రతిపాదిస్తున్నప్పటికీ చత్తీస్‌ఘడ్ సరిహద్దులోని కర్రెగుట్టలో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదన్నారు. తక్షణమే కర్రెగుట్ట అడవులలో కూంబింగ్ నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు అంగీకరించాలని కూనంనేని డిమాండ్ చేశారు. మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా వేలాదిమంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మారణహోమం చేయడం సరైన చర్య కాదన్నారు. అణచివేత ఒక్కటే మార్గం కాదని.. వాటిని చర్చల ద్వారా పరి ష్కరించాలని కోరారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు మరోసారి చేసిన ప్రతిపాదనను పెడచెవిన పెట్టడం శ్రేయస్కరం కాదని సూచించారు. ఇప్పటికే మావోయిస్టులు పదుల సంఖ్యలో హతమైనట్లు వార్త లు వస్తున్నాయని, అలాగే పదుల సంఖ్యలో సాయుధ బలగాలు వడదెబ్బకు గురైనట్లు సమాచారం వస్తోందని.. వీటన్నింటిని పరిగణలోకి తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ధర్మపురి అరవింద్

# కల్వకుంట్ల కుటుంబం తీవ్రవాదులకేమి తక్కువ కాదు

### ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కల్వకుంట్ల కుటుంబం తీవ్రవాదులకేమి తక్కువ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరి కన్నా ప్రమాదకరమని నిజామాబాద్ బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2018 ఎలక్షన్స్ కోసమని దాదాపు లక్ష కోట్లపైన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, ప్రాజెక్టు వ్యయం పెంచే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. కేంద్రం ఫండింగ్ ఇవ్వడం లేదని, నేషనల్ ప్రాజెక్టుగా గుర్తించడం లేదని అనేక సార్లు కెటిఆర్ బిజెపిపై బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిపిఆర్ ఆమోదం అవ్వకముందే ప్రాజెక్టు మొదలుపెట్టి, నచ్చినట్టు ప్రాజెక్టు ప్లానింగ్‌లో, నిర్మాణ ప్రదేశాలలో, ప్రణాళికలలో మార్పులు చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుని ఆదరాబాదరాగా కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై ఆరా తీస్తాం, కెసిఆర్‌ను జైలులో వేస్తాం అంటూ అధికారంలోకి వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇక, ఏం ముఖం పెట్టుకుని రేపు పార్టీ సభ పెట్టబోతున్నారో కెటిఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సిఎం కెసిఆర్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రమాదం పొంచి ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే గత కొన్నేళ్లుగా కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటు న్నారని చెప్పుకొచ్చారు. అందరు ఒకే దగ్గర ఉంటే తనను కుటుంబ సభ్యులే చంపే అవకాశం ఉందనే భయంతో కెసిఆర్ దూరంగా ఉంటున్నారని అన్నారు. కన్నా బిడ్డలు ఆయనను కలవాలన్న ముందుగా అపాయింట్‌మెంట్ ఉండాల్సిందేనని అన్నారు.

# డ్రగ్స్ కేసుల్లో నిందితులకు కఠినశిక్షలు పడేలా కృషి చేయాలి

### టి.నాబ్ అధికారులతో భేటీలో డిజిపి జితేందర్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలను కలిసికట్టుగా కృషి చేయాలని, మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) అధికారులను డిజిపి జితేందర్ ఆదేశించారు. శనివారం నాడు టి.నాబ్ అధికారులతో తన కార్యాలయంలో జరిగిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా చూడాలన్న ప్రభుత్వం సంకల్పాన్ని నెరవేర్చాలని కోరారు. ఈ విషయంలో పోలీసులతో పాటు టి.నాబ్ ఇతర సర్కారీ విభాగాలు మరింత సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. టి.నాబ్ ఏర్పాటైన ఉద్దేశం రాష్ట్రంలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకని డిజిపి తెలిపారు. దేశంలో ఈ తరహా విభాగం వున్నది ఒక్క తెలంగాణలోనే అని ఆయన తెలిపారు. డ్రగ్స్ కేసులో పక్కాగా దర్యాప్తు చేస్తే దోషులకు పది నుంచి 20 ఏళ్ల కఠిన శిక్షలు పడతాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల విద్యార్థులతో పాటు యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయని, వీటిని మొగ్గదశలోనే అంతమొందించాలని డిజిపి ఆదేశించారు. శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ మాట్లాడుతూ డ్రగ్స్ కేసుల విచారణలో దర్యాప్తు సమయంలోనే అన్ని ఆధారాలను సేకరించాలని, నిందితులపై అభియోగాలు దాఖలు చేసే సమయంలో పక్కాగా వుండాలని కోరారు. ఈ విషయం లో విచారణాధికారులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వుండరాదని ఆయన కోరారు. నేరగాళ్ల దర్యాప్తులో లొసుగులను ఎత్తిచూపుతూ బెయిలు పొందుతూ, ఆనక శిక్షల నుంచి తప్పించుకుంటున్నారని, వీటిని కట్టడి చేయకుంటే పరిణామాలు తీవ్రంగా వుంటాయని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ప్రాతిపదికన చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశం సందర్భం గా డ్రగ్స్ కట్టడికి కృషి చేసిన టి.నాబ్ సిబ్బందికి డిజిపి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో అదనపు డిజి అనిల్ కుమార్, టి.నాబ్ ఎస్‌పి రూపేష్, అదనపు ఎస్‌పి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆరుగాలం కష్టమంతా వృధాఅయింది.రాత్రింబవళ్లు పడిన శ్రమంతా నీటిపాలైంది. అకాల వర్షం అన్నదాతలకు అపారనష్టాన్ని మిగిల్చింది. వరుణాగ్రహానికి చేతికందొచ్చిన పంటనేలపాలైంది. కష్టాలకు ఎదురీది పంటలు సాగు చేసిన రైతులను అకాల వర్షాలు నట్టేట ముంచాయి. నోటికాడి బుక్క నీటిపాలడంతోదిక్కుతోచక తలలుపట్టుకున్నారు. అకాల వర్షాలు అన్నదాతల ఆరుగాల కష్టాన్ని ఆగంఆగం చేస్తున్నాయి. పొట్టదశలో ఉన్నపైరు,కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్నధాన్యం నీటి పాలవుతుండటాన్ని చూసి రైతన్న గుండె చెరువవుతోంది. రాలిపోతున్న మామిడి కాయలు, నాశనమవుతున్న కూరగాయలతో ఆశలు అడియాశలవుతున్నాయి. రబీ సీజన్‌లో పంటలు వేసిన మొదట్లో సాగునీటి కొరతతో రైతులు కష్టాలుపడ్డారు. కానీ ప్రస్తుతం కోతల సమయంలో అకాల వర్షాలు వారికి శరాఘాతంగా మారాయి. మధ్యలో మార్చిలోనూ వడగళ్ల వానలతో పంటలు దెబ్బతిన్నాయి. ముందు వేసవిలో భారీవర్షాలు, ఈదురుగాలులు అన్నదాతల వెన్నువిరుస్తున్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణంగా నవంబర్ నుంచి మే వరకు యాసంగి కొనసాగుతుంది. అయితే వాతావరణ మార్పులు రైతుల ఆశలకు గండి కొడుతున్నాయి. అకాలవర్షాలు, వడగళ్లతో ప్రధానంగా వరి,మిర్చి, పత్తి, మొక్కజొన్న, మామిడిపంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కొన్నేళ్లుగా ఈనష్టాలు ఆనవాయితీగా మారాయి. పంట నష్టాలకు ప్రభుత్వాలు విపత్తు నిర్వహణ నిధులనుంచి సాయం అందించాలి. అకాల వర్షాల విషయంలో మాత్రం సరిగా అందడంలేదు. వ్యవసాయశాఖ నిబంధనలు కూడా అసంబద్ధంగా ఉంటున్నాయి. ఒక రైతుకు సంబంధించి మూడోవంతు కంటే ఎక్కువ పంట నష్టం జరిగితేనే సాయం పొందేందుకు అర్హులుగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆలోపు నష్టపోయిన వారికి ఎలాంటి సాయం అందడం లేదు.

# పంట పరిహారం అందేనా!

అన్నదాతను ప్రకృతి పరీక్షిస్తోంది. విత్తు నాటిన నుండి పంట చేతికొచ్చేంత వరకూ ఏదోఒక రూపంలో రైతులను దెబ్బతీస్తోంది. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కురిసిన అకాల, వడగండ్ల వానలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఈ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లింపు ప్రశ్నార్థకంగా మారింది. నష్టపరిహారం కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. అయితే ప్రభుత్వాల ఆంక్షలు, మార్గదర్శకాలతో పంట దెబ్బతిన్న పలువురు రైతులకు పరిహారం ఎంతవరకూ అందుతుందనేది సందేహాస్పదమే అవుతోంది. రెండు రాష్ట్రాల్లో వడగండ్ల వానకు ఆహార ధాన్యాలతో పాటు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్నతో పాటు, మామిడి, అరటి, కూరగాయల తోటలు నేలవాలాయి. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 10 వేల రూపాయలు చెల్లిస్తామని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఇంత వరకూ దానిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. మరోపక్క పంటకీలక దశలో వర్షాలు కురుస్తుండటంతో దిగుబడులు భారీగా తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తీసుకొచ్చి పంటలుసాగుచేస్తే నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారం కాసింత ఊరట నిచ్చే అవకాశంఉన్నా రైతులకు మాత్రం నిరాశే మిగులుతోంది. ఇటీవల కురిసిన పంట నష్టంపై సమగ్రంగా పరిశీలించి అంచనా వేయడంలో సైతం రైతులకు అన్యాయమే జరుగుతోంది. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా దెబ్బతిన్న పంటల నష్టంపై వ్యవసాయ శాఖలు సర్వేలుచేస్తున్నాయి. గత నెల నుండి ఇటీవల వరకూ రాష్ట్రంలో ఈదురుగాలలతో కూడిన అకాల, వడగండ్ల వానాలు పడ్డాయి. ఈ నేపథ్యంలో పంట నష్టాలపై సర్వే చేసి దాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. గ్రామాల వారీగా, సాగుదారులైన రైతులు, కౌలురైతులతో సహా సర్వేచేపట్టి నష్టం వివరాలు పూర్తిగా పంపాలని స్పష్టంచేసింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

**సిహెచ్ వి వి రఘుబాబు**

ఇటీవల పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు సర్వే చేసి వివరాలను సేకరించారు. కాగా పంట నష్టం అంచనాకు, బాధిత రైతులను పరిహార జాబితాలో చేర్చడానికి 33 శాతం పంట నష్టాన్నే అధికారులు ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. అంటే వేసిన పంటలో 33శాతానికి మించి నష్టం జరుగుతుందో ఆ పంటను, సంబంధిత రైతులపేర్లను పరిహారం జాబితాలో చేర్చుతారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో పంట



నష్టం వివరాలను అధికారులు ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. క్లస్టర్ల వారీగా పంట గ్రామాల్లో ఏ పంటలు, ఎంత మేరకు సాగయ్యాయి,అందులో దెబ్బతిన్న పంట ఏవి తదితర సమాచారాన్ని సేకరించారు. ఈ విధంగా సేకరించిన వివరాలతో పాటు, రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆధార్ కార్డు వివరాలను ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో పొందుపరుస్తున్నారు. వీటిని మండల, జిల్లాస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు మదింపు చేసి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తదుపరి వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వనుంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.10 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు రైతు సంఘాల అంచనా. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం రాష్ట్రం మొత్తం మీద ఇప్పటికే గత నెలలో కురిసిన వర్షాలకు తెలంగణలో ఇన్‌పుట్ సబ్సిడీకింద ఎకరానికి 10 వేల రూపాయలు చొప్పున మార్గర్శకాలకు అనుగుణంగా పంపిణీచేస్తామన్నా అది పూర్తిస్థాయిలో ఇంకా అమలు కాలేదు. తదుపరి రెండు దఫాలుగా కురిసిన వడగండ్ల వానాలు కారణంగా దెబ్బతిన్న పంటకు ఇంతవరకూ పరిహారం అంద లేదు, అదే ఆంధ్రప్రదేశ్‌లో అయితే అసలు పంట నష్ట పరిహారం పంపిణీ కాలేదు. మార్చి 21 నుండి ఈ నెల 15 వరకు కురిసిన వడగళ్ల వానలతో జరిగిన పంటనష్టంపై వ్యవసాయ శాఖ నివేదికలు తెప్పించింది. దాదాపు 16 జిల్లాల్లోని 78 మండలాల్లో సుమారు 15,600 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. దెబ్బతిన్న పంటల్లో 9500 ఎకరాల్లో వరి, 4900 ఎకరాల్లో మొక్కజొన్న, 380 ఎకరాల్లో మామిడి ఇతర పంటలు ఉన్నాయి. వరి, మొక్కజొన్న, మిర్చి, జొన్న,శనగ ఉండగా, ఉద్యాన పంట అయిన మామిడి, సపోటా, కూరగాయలు తదితర తోటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టంపై పూర్తి నివేదిక అందగానే నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించినాఅది కార్యరూపం దాల్చలేదు. గత ఏడాదిలో అకాల వర్షాలకుదెబ్బతిన్న పంటకు ప్రభుత్వం రూ.10వేలు పరిహారం పంపిణీ చేసింది. ఈసారి అకాల వర్షాలకు కూడా రూ.10వేలు ఇచ్చేందుకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు పంపించింది. చాలా మంది రైతులకు రైతుభరోసా జమకాలేదని, కనీసం పరిహారం పెంపుతోనైనా ఉపశమనం కలుగుతుందని రైతాంగం ఆశతో ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలోనే పంట నష్టంపై క్షేత్ర స్థాయిలో అధికారులు వేసిన అంచనాల్లో కూడా గందరగోళం నెలకొంది. ఆయా జిల్లాల్లో వ్యవసాయశాఖ అధికారులు ఏటల నుండి రమారమి అంచనాలతో నివేదికలు రూపొందించారు. కొన్ని చోట్ల అయితే అది కూడా జరగలేదు. ఈ విధంగా వివిధ జిల్లాల్లో అధికారుల ప్రాథమిక అంచనాలకు వాస్తవంగా దెబ్బతిన్న విస్తీర్ణానికి ఎక్కడా పొంతన లేకుండా పోయిందని రైతుల వాదన. కాగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాల ప్రభావంతో నష్టపోయిన రైతులు మామిడి, ధాన్యం, మొక్కజొన్న వంటి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతన్నలకు తీవ్రనష్టం వాటిల్లింది. మామిడి, ధాన్యం,మొక్కజొన్న, కాకరవంటి పంటలు పూర్తిగా దెబ్బతిని, కోట్లాది రూపాయల నష్టంవాటిల్లింది. గాలివాన బీభత్సం వల్ల మామిడి పండ్లు నేలరాలి పోయాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఈదురుగాలులకుమామిడి, బొప్పాయి నేలవాలింది. అనంతపురం జిల్లాలో భారీ ఈదురుగాలులకు మామిడి పంట నేలరాలింది. మామిడి పంట మరో నాలుగైదు రోజుల్లో కోయాల్సి ఉండగా ఇంతలోనే ఈదురు గాలులకు కాయలన్నీ రాలిపోవడం దురదృష్టకరం. విజయవాడ శివారుప్రాంతాల్లో ఈదురుగాలులకుమామిడి పంట దెబ్బతింది. ఎక్కువస్థాయిలో చెట్టు నుంచి కాయలు రాలి కిందపడ్డాయి. రేపో,మాపో పంటను కోసి మార్కెట్‌కు తీసుకువెళ్దామని రైతులు భావించేలోపే అకాలవర్షం వారి ఆశలను నేలకూల్చింది. అసలే ఈ ఏడాది అంతంతమాత్రంగా మామిడి దిగుబడులు రాగా, ఉన్న పంట కాస్తా వర్షార్పణమైంది. లక్షల రూపాయలు వెచ్చించి మరీ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. భారీవర్షాలతో దెబ్బతిన్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులకు రైతులు మొర పెట్టుకుంటున్నారు. ఇక వరి,మొక్కజొన్న పంట వేస్తే ఎకరానికి రూ.23వేల వరకు పెట్టుబడి వస్తోంది. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం ఎకరాకు పరిహారం రూ.20 వేలు చెల్లించాలని రైతుసంఘాలు కోరుతున్నారు.పంట నష్టం లెక్కింపును దెబ్బతిన్న పంటలో 33 శాతం కాకుండా ఎంత మేరకు నష్టం జరిగిందో అంచనావేసి దానిప్రకారం పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. రెండు సీజన్లకు సంబంధించిన పెట్టుబడి సాయం దక్కలేదని, కనీసం పంట పరిహారమైన పెంచి అప్పుల నుంచి ఆదుకోవాలనే డిమాండ్ ఉంది. ●


జమ్ముకాశ్మీర్

పహల్గావ్‌లో జరిగిన దాడి తర్వాత దాయాది దేశంలో వణుకుపుడుతున్న సంగతి మనం దరం చూస్తూనే ఉన్నాం. ముందు నుంచి వాచాలత్వం ఎక్కువ ఉన్న పాకిస్థాన్ పాలకులు ఈసారికూడా అదే వంత పాడారు. పాక్ మాజీ ప్రధాని భుట్టో తరహాలోనే ఆయన తనయుడు కూడా ఈసారి తన నియంతృత్వాన్ని చాటుకున్నారు. మా నీళ్లైనా పారాలి లేకుంటే భారతీయుల రక్తమైనా పారాలి అంటూ అసందర్భపు ప్రేలాపనలు చేసారు. ఒక్కసారిగా భారత్ చేపట్టిన కార్యాచరణతో మింగుడుపడని పాకిస్థాన్‌కు ఏంచేయాలో అర్థం కానిస్థితిలోనే ఇలా వాచాలత్వం ప్రదర్శిస్తున్నారు. ఒకపక్క పాక్‌తో తెగతెంపులు చేసుకుంటూనే భారత్ తనదైన శైలిలో యాంటి టెర్రర్ ఆపరేషన్ చేపడుతోంది. ఉగ్రవాద సానుభూతిపరులు, ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నవారిని క్రోడీకరించింది. పహల్గావ్ తర్వాత ఇక మొత్తం ఆపరేషన్ షురూ చేసింది. ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లను గుర్తించి వాటిని పేల్చివేసింది. ఒక్కొక్కరి ఇంటిని గుర్తించి వెనువెంటనే వాటిని ధ్వంసం చేసింది. అంతేకాకుండా బండిపోరాలో ఎన్‌కౌంటర్‌లో లష్కరే టాప్ కమాండర్‌ను అంతం చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌వైపు ఫోకస్ పెంచింది. అటుగా వస్తున్న సరిహద్దు కవ్వింపు చర్యలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తూనే మరోవైపు దేశంలో ఉగ్రవాదుల ఏరివేత, నిర్మూలన పెద్దఎత్తునే చేపట్టింది. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్న సామెతగా జమ్ము కాశ్మీర్‌లో నెలకొన్న పేదరికం కారణంగా మిలిటెంట్ గ్రూపులు స్థానికులను ప్రలోభాలకు గురిచేసి సైనికదళాల ఆనుపానులు తెలుసుకుంటున్న సంగతి తెలిసిందే. ఏళ్లతరబడి ఇదే కుట్రలను అమలు చేస్తూ ఉగ్రముష్కరులు తమకుట్రలు అమలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు భారత్ దళాలు చేపట్టిన ఏరివేతలో ఉగ్రవాదులతోపాటు వారి సానుభూతిపరులపైనా ఫోకస్ పెంచడంతో ఇప్పుడు జమ్ముకాశ్మీర్‌లో ఈ కుటుంబాలు బిక్కుబిక్కుమని కాలంగడిపే రోజులు వచ్చాయి. ఇదొక నిరంతర కార్యాచరణగా కొనసాగితే తప్ప జమ్ము కాశ్మీర్‌లో అధికరణం రద్దుకు సాధికారత ఉండదు.

# మూలాలను పెకలించాల్సిందే!

**ఎ.వి.వి ప్రసాద్**

అలాగే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఆరాష్ట్ర అసెంబ్లీకి కూడా పరమార్థం ఉండదనే చెప్పాలి. ఇందుకోసం కేంద్రం చేపట్టిన కార్యాచరణకు విధిగా ఇప్పుడు అక్కడ ఎన్నికైన పాలకులు కూడా శ్రద్ధచూపించాలి. జమ్ముకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్, షోపియాన్, బండిపోరా, రాజౌరి వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఈ ఉగ్రకదలికలు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర సర్కారు ఎప్పుడో గుర్తించింది. ఉగ్రవాదులతో పాటు ఉగ్ర సానుభూతి పరులపైనా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సిన అవసరాన్ని ఇప్పటి పరిస్థితులు చాటి చెపుతున్నాయి. సరిహద్దుల మీదుగా పాకిస్థాన్‌కు వెళ్లి అక్కడ ఉగ్రశిబిరాల్లో శిక్షణ పొంది సొంత గడ్డపైనే మిలిటెన్సీని అమలు చేస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోను క్షమించేది లేదని అటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇటు ప్రధాని నరేంద్రమోడీ సైతం తీవ్రంగానే పరిగణిస్తున్నారు. అంతేకాదు ప్రతి రక్తం బొట్టుకు ఉగ్రవాదులు మూల్యం చెల్లించుకుంటారని, అంతేకాకుండా వారికి ఆశ్రయం ఇస్తున్న, సహకరిస్తున్న దాయాదికి సైతం ఇక నూకలు చెల్లాయన్న సంకేతాలు బలంగానే పంపించారు. పహల్గావ్ దాడి జరిగి ఇప్పటికి నాలుగురోజులు గడుస్తున్నాయి. ముందు సరిహద్దు గడ్డపై ఉన్న ఉగ్రవాదుల ఏరివేతను ఎలాగూ విజయవంతం చేసుకోగలిగే భారత్ ఇప్పుడు దాయాది పై చేపట్టే కార్యాచరణ ఎలా ఉంటుందన్నదే ఆసక్తికరంగా మారుతోంది. ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు భద్రతా బలగాలు పేల్చివేస్తే మరో రెండు ఇళ్లు ఉగ్రవాదులే స్వయంగా పేల్చుకున్నట్లయింది. భద్రతా దళాల కోసమని అమర్చిన శక్తివంతమైన పేలుడు సామగ్రి యాక్టివేట్ అయినట్లు గుర్తించిన వెంటనే అక్కడి నుంచి వచ్చేసిన మన బలగాలు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాయి. ఇక అప్పటి నుంచే ఏరివేత భారీఎత్తున కొనసాగిస్తోంది. ఈసంగతి అటుంచితే పుల్వామా దాడి తర్వాత మెరుపు దాడులతో పాక్‌ను గడగడలాడించిన భారత్ ఇప్పుడు అంతకంటే ఎక్కువ మందిని అంటే 26 మందిని పొట్టనపెట్టుకున్న పహల్గావ్ ముష్కరులను ఎట్టిపరిస్థితుల్లోను వదిలిపెట్టకూడదన్న లక్ష్యంతోనే ఉంది. మంచిదే. ఉగ్రమూకలకు భారత్‌లో స్థానం అనేదే ఉండకూడదు. మూలాలను సైతం పెకిలించాల్సిందే. అయితే ఈ క్రమంలో జమ్ముకాశ్మీర్ అమాయక ప్రజలు బలయిపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యత కూడా కేంద్రం పైనే ఉంది. ఉగ్రవాదానికి మూలాలు పాకిస్థాన్‌లో ఉన్నాయన్నది జగమెరిగిన సత్యమే. అక్కడ శిక్షణ ఇచ్చి అభివృద్ధి చెందుతున్న భారత్ పైకి ఉసిగొల్పడం అనేది నిత్యకృత్యంగా మారింది. దాయాది దేశంలో ప్రభుత్వం నడుస్తున్నా సైనిక పాలనకే ఎక్కువ మొగ్గు. అందువల్లనే అక్కడ ఐఎస్ఐకి ఎక్కడ లేని ప్రాధాన్యం లభిస్తుంది. ఆ నిఘా సంస్థకు పట్టుకున్న జాడ్యం వల్లనే ఇప్పుడు మనదేశంలో ఇలా అమాయక పౌరులు బలైపోతున్నారు.పైగా హిందువులను వేరుచేసి మరీ వారిని కాల్చివేస్తున్నారంటే వారిలో కరుడుగట్టిన ఇస్లామిక్ వాదం ఏమేర ఉందో తెలుస్తుంది. అటు దాయాదిపై కార్యాచరణ చేపట్టడంతోపాటు ఇటు సొంతగడ్డపై ఉన్న ముష్కరులను సమూలంగా ఏరివేయక పోతే భారత్‌కు ఎప్పటికీ దాయాది నుంచి ఈ ముప్పు కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదుల ఏరివేతకంటే వారికి సహకరిస్తున్న సానుభూతి పరులే ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద ముప్పు అని పాలకులు గ్రహించాలి. ముష్కరుల ఇళ్లను ఎలా కూల్చివేస్తున్నారో అదేరీతిలో సానుభూతిపరులకు సైతం గుణపాఠం చెప్పకపోతే దాయాది నుంచి ఇలాంటి అసాంఘిక మూలాలు ఎప్పటికీ భారత్‌కు ముప్పుగానే పరిణమిస్తాయి. ●



ఉగ్రవాదులు

పాకిస్థాన్

మా దేశంలో ఉగ్రవాదానికి తావు లేదని, అసలు ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలు మా దేశంలో లేనేలేవని బుకాయిస్తూ వచ్చిన పాకిస్థాన్ ఎట్ట కేలకు నోరుజారో, లేక నాలుక్కరు చుకునోకాని తప్పును అంగీకరించింది. గడచిన మూడుదశాబ్దాలుగా తమ దేశంలో ఉగ్రవాదులున్నారని, వారిని పెంచి పోషించిందికూడా తామేనంటూ సాక్షాత్తూ ఆదేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పష్టం చేసారు. ఈ చెత్త పనులన్నీ కూడా తాము అమెరికా కోసం మాత్రమే చేసామని నేరం అమెరికాపై నెట్టేసారు. సీమాంతర ఉగ్రవాదాన్ని విభజన నాటి నుంచే కొనసాగిస్తున్న దాయాది దేశం అంతర్జాతీయ వేదికలపై కూడా భారత్‌ను తిట్టిపోస్తూండటం, వాటిని భారత్ కడిగిపారేయడం వంటివి జరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితిలో తరచూ భంగపాటుకు గురవుతున్నా ఉగ్రవాదాన్ని తాము ప్రోత్సహించడం లేదని, తమ దేశంలో లేనేలేదని చెప్పుకుంటూ వచ్చింది. అప్పటి పిటిఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్ హయాం నుంచి ఇప్పటి షెహబాజ్‌షరీఫ్ సంకీర్ణ సర్కారు వరకూ కూడా ఇదేపాట పాడింది. అయితే పహల్గావ్ దాడి తర్వాత ఒక్కసారిగా ఆదేశంలో వణుకు బయలుదేరిందనే చెప్పాలి. పీఓకేపై మెరుపు దాడులు జరుగుతాయనో లేక ఏ క్షణంలో అయినా యుద్ధం ప్రకటించవచ్చనే ఆందోళనతోనో కాని పాకిస్థాన్ పౌరుల్లోను, పాలకుల్లోను కూడా నరనరాల్లోను భయంపీడిస్తోంది. అందుకే రక్షణమంత్రి ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నట్లు తెలుస్తోంది. ఉగ్రసంస్థలకు నిధులు సమీకరించడం, ఉగ్రవాదులకు శిక్షణ, ఉగ్రవాదానికి మద్దతివ్వడం, ఉగ్రసంస్థల కార్యాలయాలకు స్థావరాల వసతి కల్పించిన పాక్ ఇప్పుడు పహల్గావ్ దాడి ఒక కుట్రగా అభివర్ణిస్తూ అంతర్జాతీయ విచారణకు ఆదేశించాలని అందుకు తాము పూర్తిగా సహకరిస్తామంటూ కొత్తరాగం అందుకుంది. ఇవన్నీ ఇలా ఉంటే దాయాది దేశ రక్షణమంత్రి మాత్రం ఉన్నదున్నట్లు చెప్పేసారనే మనం అనుకోవాలి. అమెరికా, బ్రిటన్‌తోసహా ఇతర పశ్చిమ దేశాలు, పాశ్చాత్య దేశాల ఒత్తిడితోను,వాటిప్రాపకం కోసమే ఇదంతా చేసామని అంగీకరించారు. దీనివల్ల మూడు దశాబ్దాలుగా ఎన్నో ఇబ్బందులు పడినట్లు కూడా చెప్పిన రక్షణమంత్రి ఇది పొరపాటు కార్యాచరణే నని ఆ తర్వాత తెలుసుకున్నామన్నారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ చేరకపోయి ఉంటే ఇప్పుడు తిరుగులేని ట్రాక్ రికార్డు ఉండేదన్నారు. పాక్ రక్షణమంత్రి వైఖరి ఇలాఉంటే సాక్షాత్తూ ఆదేశ ఉపప్రధాని ఇషాక్‌ధర్ మాత్రం నరనరానా తన ఇస్లామిస్టు వాదాన్ని జీర్ణించుకున్నారు. పహల్గాంవ్‌లో దాడిచేసిన వారుబహుశా స్వాతంత్ర్య సమరయోధులై ఉంటారని చెప్పడం ఆ దేశ మత ఛాందసవాదానికి పరాకాష్ట. తాజాగా పాక్ రక్షణమంత్రి పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర సంస్థల వివరాలు వెల్లడి తోపాటు లష్కరే తోయిబాకు గతంలో పాకిస్థాన్‌తో కొన్ని సంబంధాలు కూడా ఉన్నాయని అంతర్జాతీయ ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో అంగీకరించారు. అయితే ఈఉగ్రవాద సంస్థ ఇప్పుడు పాకిస్థాన్‌లో అంతమైందని, అలాంటప్పుడు అనుబంధ సంస్థ అంటూ చెపుతున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఎక్కడిదని ఆయన ఎదురు ప్రశ్నలు వేసారు. లష్కరేనే లేనప్పుడు ఇక ఆఫ్‌షూట్ సంస్థ ఎక్కడి నుంచి వస్తుందని కొంతమేర తప్పించుకునే వైఖరి ప్రదర్శించినా మొత్తంగా తమదేశం ఉగ్రవాద,సంస్థలతో ఉన్న అనుబంధాన్ని మాత్రం ఒప్పుకున్నారు. కేవలం పశ్చిమదేశాల ప్రాపకం కోసమే ఇదంతా చేస్తున్నామని, అయితే ఇది తప్పుఅని తెలుసుకున్నామని, అందుకే పాకిస్థాన్ ఇప్పటికీ భారీ మూల్యం చెల్లించుకుంటున్నదని అన్నారు. సోవియట్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలోను, 9/11దాడుల్లో పాక్ చేరకపోయి ఉంటే తమ దేశానికి నిష్కళంకమైన ట్రాక్‌రికార్డు ఉండేదని చెప్పారు. సోవియట్‌కు వ్యతిరే కంగా జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ అమెరికాకు మద్దతిచ్చింది. అలాగే అల్‌ఖైదా2001సంవత్సరం సెప్టెంబరు 11న న్యూయార్క్‌లో జరిపిన దాడి తర్వాత ఆఫ్ఘానిస్థాన్‌పై దాడికి కూడా అమెరికాకు మద్దతిచ్చింది. ఆఫ్ఘానిస్థాన్‌లో ఉన్న సోవియట్ సేనలతో పోరాడేందుకు అమెరికా ఉగ్రవాదులను ప్రాక్సీలుగా ఉపయోగించుకుందని ఖవాజాఆసిఫ్ వెల్లడించారు. ఇప్పుడు పాకిస్థాన్‌లో సంక్షోభం సృష్టించే ప్రయత్నంలో భాగంగా భారతదేశం పహల్గావ్ ఉగ్రదాడిని పావుగా ఉపయోగించుకుంటున్నదని ఆసిఫ్ ఆరోపించారు. పాకిస్థాన్ వీధుల్లో యధేచ్ఛగా ప్రభుత్వ బందోబస్తుమధ్య తిరుగుతున్న హాఫీజ్‌సయీద్ ఫోటోలు ఇటీ వలి అంతర్జాతీయ మీడియాలోసైతం వచ్చాయి. వీటిని చూసి అయినా రక్షణమంత్రి తమ దేశం గడ్డ మీద ఉన్న ఆసంస్థ చీఫ్ హాఫీజ్ సయీద్ కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందన్నది ఒప్పుకోవలిసిందే. ఇదంతా ట్రాష్ అంటున్న రక్షణమంత్రి లష్కరేకు తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మాత్రమే చెప్పారు. తమ గడ్డపై లేదని మాత్రం స్పష్టత ఇవ్వలేకపోయారు. హాఫీజ్ నేతృత్వంలో పహల్గావ్ దాడి జరిగిందన్నది మాత్రం నగ్నసత్యం. వీటన్నింటినుంచి బయటపడేందుకు ఇప్పుడు ఈదాడిపై అంతర్జాతీయ దర్యాప్తు అవ సరమని, అందుకు తమదేశం పూర్తిగా సహకరిస్తుందని మరో వాదనను తెరపైకి తెచ్చింది. సింధుజలాల ఒప్పందం ఏకపక్షం అని భారత్‌లాగే తమకు సైతం చట్టాలున్నాయంటూ పాక్ మంత్రులు కొందరు అసందర్భపు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. అలాగే లండన్‌లోని పాక్ హైకమిషన్ వద్ద ఉన్న పాక్ ఆర్మీ అధికారి పహల్గాంవ్ దాడికి నిరసన తెలుపుతున్న ప్రవాస భారతీయులను గొంతుకోస్తామని సంజ్ఞలుచేస్తూ హెచ్చరించడం కూడా ఆదేశం భారత్‌పట్ల అనుసరిస్తున్న వైఖరిని తేటతెల్లం చేస్తుంది. మొత్తంగా చూస్తే తమ దేశంలో అసలు ఉగ్రస్థావరాలే లేవని పొరుగు దేశం బాహ్యప్రపంచాన్ని నమ్మించే విఫలయత్నం చేస్తుందని మాత్రం స్పష్టం అవుతోంది. ●

# ఔను..వాళ్లున్నారు!

**గన్ని మోహన్**



ఖవాజా ఆసిఫ్

# ప్రతీకారేచ్ఛలో భారత్.. సంకటంలో పాక్



సుంకవల్లి సత్తిరాజు

పహల్గాం సంఘటన తర్వాత భారత్ పాక్‌పై తీసుకుంటున్న చర్యలకు ప్రతీకారంగా పాక్ కూడా భారత్‌పై ప్రతిచర్యలకు పూనుకుంది. పాకిస్థాన్ గగనతలంపై భారత విమానాలకు అనుమతి రద్దు చేసింది.భారత దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించింది. సైన్యానికి సెలవులు రద్దు చేసి భారత్‌తో యుద్ధానికి సై అంటూ సంకేతాలు పంపించింది. పహల్గాం సంఘటనపై భారత్‌కు సంఫీభావం తెలిపిన ప్రపంచదేశాలు భారత్,పాక్ మధ్య యుద్ధం సంభవిస్తే ఎవరి పక్షం వహిస్తాయో ఇప్పుడే చెప్పలేం. అమెరికా,రష్యాలు భారత్ వైపే నిలబడే అవకాశాలున్నాయి. పాక్‌తో అంటకాగుతున్న చైనా ఈ విషయంలో భారత్‌కు మద్దతిస్తుందని చెప్పలేం. ఇస్లామిక్ దేశాలు భారత్‌కు మద్దతిస్తాయా లేదా అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఏదిఏమైనప్పటికీ పాక్ వైఖరి ప్రపంచాన్ని మరోమారు యుద్ధ వాతావరణంలోకి నెట్టింది. భారత్, పాక్‌ల మధ్యయుద్ధం గనుక సంభవిస్తే పాకిస్థాన్ మనుగడ ప్రమాదంలో పడుతుందని విస్పష్టంగా చెప్పగలం. ఉగ్రవాదుల ఘాతుకాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అందుకు తగ్గట్టుగానే ఉగ్రవాదులను భారత్‌పై ఎగదోస్తున్న పాకిస్థాన్‌పై మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన చర్యలకు ఉపక్రమించింది. ఎప్పటి నుంచో అనేకమంది భారతీయ మేధావులు, రాజకీయ పండితులు ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. సింధునదీ జలాలను పాక్ వైపు పోకుండా నిరోధించాలని సూచించిన దేశభక్తుల ఆశలు నెరవేరబోతున్నాయి. భారత్ నిర్ణయంతో ట్రాన్స్ హిమాలయన్ రివర్ "ఇండస్' ప్రస్తుతం ఒక చర్చనీయాంశంగా మారింది. 'ఇండియా' అనే పేరుకు కారణమైన ఇండస్ నది దురదృష్టవశాత్తూ పాకిస్థాన్‌కు ఆయాచితవరంగా మారడం, ఇండస్ జలాలు అత్యధిక శాతం పాక్‌వైపు తరలిపోవడం బాధాకరమే అయినప్పటికీ, ఇప్పటివరకు "ఇండస్ వాటర్ ట్రీటీ'ని అమలు చేసినందుకు కనీస కృతజ్ఞత చూపని పాక్‌కు భారత్ ప్రస్తుత నిర్ణయంతో తగిన శాస్తి జరిగిందనే చెప్పాలి. సింధునది ఒప్పందం నుండి భారత్ వైదొలగడం సముచిత నిర్ణయమే. అయితే భారత్ నిర్ణయం ఆచరణ సాధ్యమా? కాదా? అనే అంశం అంతర్జాతీయ చట్టాలు తేల్చాలి. ఇటీవల ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్‌లోని అనంత్ నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ మైదానంలో కాల్పులు జరిపి 28మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న పైశాచిక సంఘటనను భారతదేశం తీవ్రంగా పరిగణించింది. పర్యాటకులను చంపే ముందు కూడా వారిని మతం పేరుతో పరీక్షచేయడం అత్యంత దారుణం. ఇందుకు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని మోడీ తీవ్రంగా హెచ్చరించడమే కాకుండా, పాక్‌పై పలు ప్రతీకార చర్యలు తీసుకోవడం గమనార్హం. పాక్ పౌరులు భారత్‌లో ప్రవేశించడంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడమే కాకుండా అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. భారత్ పాక్‌ల మధ్య గతంలో కుదిరిన సింధు నదీ జలాల ఒప్పందం నుండి వైదొలగడం వీటిలో అత్యంత ప్రధానమైనది.భారత్ పాక్‌ల మధ్య 1960లో సింధునది నీటి పంపిణీకి సంబంధించిన ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని నెహ్రూ, నాటి పాక్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్‌లు సంతకాలు చేయడం జరిగింది. ఈ ఒప్పందంపై ఇప్పటి ప్రపంచ బ్యాంకుగా పిలుస్తున్న అప్పటి "ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐ.ఆర్.బి.డి) మధ్యవర్తిగా వ్యవహరించింది. "ఇంటర్ వాటర్ ట్రీటీ' నిబంధనలకు అనుగుణంగా భారత్ నిరాటంకంగా పాకిస్థాన్‌కు గత 64 సంవత్సరాలకు పైబడి నీటిని సరఫరా చేస్తున్నది. సింధునది చైనా ఆధిపత్యం క్రింద నలిగిపోతున్న టిబెట్‌లోని మానస సరోవరం వద్ద పుట్టి, కేవలం 8 శాతం చైనాలో ప్రవహిస్తూ, పాక్ లోని 80 శాతం భూములను సస్యశ్యామలం చేస్తున్నది. పాక్ విద్యుత్ అవసరాలను,సాగు నీరు తదితర అవసరాలను తీరుస్తూ ఆ దేశ స్థూల జాతీయోత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్నది. అత్యధిక శాతం నీరు పాక్‌కు తరలిపోతు



న్నది. దక్షిణ ఆసియాలోను, భారత ఉపఖండంలోను అత్యంత పొడవైన నది సింధు. సింధునది పాక్ ప్రజల జీవనాడిగా ప్రసిద్ధి గాంచింది. భారత్ లో అతి పొడవైన నదిగా "గంగానది" ప్రసిద్ధి చెందింది.'ఇండియా'కు ఆ పేరు రావడానికి సింధునది(ఇండస్) కారణం. నాగరికతకు సంకేతమై, 'ఇండియా'అనే పేరుకు మూలాధారమైన సింధు నది దేశ విభజన తర్వాత అత్యధికభాగం దాయాది దేశానికి ధారాదత్తం చేయబడింది.ప్రపంచంలోని అతి పెద్ద నదుల్లో ఒకటిగా గుర్తింపబడింది.సింధు నదికి సంబంధించిన అనేక ఉపనదులు భారత్ లోని జమ్ము కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల మీదుగా ప్రవహించి పాకిస్థాన్‌లో ప్రవేశిస్తాయి. పాకిస్థాన్ మాత్రం ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా భారత్ వలన మేలు పొంది, తిన్నింటి వాసాలు లెక్కబెడుతూ, భారత్‌కు పక్కలో బల్లెంలా తయారైనది. పాక్ దుశ్చర్యలను అరికట్టడానికి, భారత్ కఠినమైన నిర్ణయాలు తీసుకోకతప్పదు. మారుతున్న పరిణామాల నేపథ్యంలో పాక్‌ను కట్టడి చేయడంలో ప్రపంచ దేశాల సహకారాన్ని తీసుకుంటూనే, మరోవైపు పాక్ తెంపరితనాన్ని అణచడానికి భారత్ తనకున్న మార్గాలను అన్వేషించాలి. సింధునదీ జలాల పంపిణీపై గతంలో జరిగిన ఒప్పందంనుండి ప్రస్తుతం వైదొలగడాన్ని అంతర్జాతీయ చట్టాలు అంగీకరించవని పాక్ పేర్కొంటున్నది. అయితే ఇప్పటి వరకు పాక్‌తో ఎన్ని యుద్ధాలు జరిగినా, ఉగ్రవాదుల ఊచకోతకు భారత పౌరులు,జవాన్లు తమ ప్రాణాలను కోల్పోయినా, భారత్ మాత్రం తన భూభాగం నుండి పాక్‌వైపు ప్రవహిస్తున్న సింధునదీ ప్రవాహాన్ని నిలువరించలేదు. ఇది భారత్‌దేశం ప్రదర్శిస్తున్న మానవత్వానికి, సహనానికి మచ్చుతునక. అయితే సహనం హద్దులు దాటినప్పుడు దండోపాయమే శరణ్యం.సింధు నదీ జలాల ఒప్పందానికి భారత రాష్ట్రపతి ఆమోదముద్ర లేదని కొంత మంది వాదన. అయితే ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే అంతర్జాతీయ న్యాయస్థానం అంగీకరిస్తుందా? అనే అనుమానం ఉంది. పాక్, చైనాలు భారత్‌తో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించడంలో లేని అభ్యంతరం ఇండియా ఉల్లంఘిస్తే తప్పేమిటి? అగ్రదేశాలు అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడే ఉంటున్నాయా? అంతర్జాతీయ న్యాయస్థానం అగ్రరాజ్యాలను అదుపులో ఉంచగలుగుతుందా? భారత్ తన దేశ శ్రేయస్సును ఆశించి సింధు జలాల ఒప్పందం నుండి వైదొలగడంలో తప్పేముంది? పాక్‌కు సింధునదీ జలాల పంపిణీ నిలుపుదల చేసిన భారత ప్రభుత్వం దీనిపై వచ్చే అంతర్జాతీయ న్యాయపరమైన చిక్కుల గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలోను, భారత్ భూభాగాల విషయంలో చైనా ప్రదర్శిస్తున్న వైఖరి విషయంలోను భారత్ తన వ్యూహాన్ని మార్చుకోవాలి. 1965లో ఇరుదేశాల మధ్య యుద్ధం జరిగింది. 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం మరోసారి ఇరు దేశాలు యుద్ధానికి తలపడ్డాయి. ఈ రెండు యుద్ధాల్లో పాక్ భారత్ చేతిలో చిత్తుగా ఓడిపోయి,ప్రపంచ దేశాలను శరణుకోరడంతో భారత్ శాంతించింది. ఈ సందర్భంగా జరిగిన ఇరు దేశాల ఒప్పందాలను పాక్ తుంగలో తొక్కి భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు అండగా నిలుస్తున్నది. 1999లో కార్గిల్‌లో చొరబాట్లకు పాల్పడి,చావు దెబ్బతిన్న పాక్ ఇంకా గుణపాఠం నేర్చుకోలేదు. 2016లో జరిగిన పఠాన్ కోట ఎయిర్ బేస్‌పై దాడి, యూరి పట్టణం పైదాడి, 2019లో పుల్వామా దాడివంటి పలు పాక్ ప్రేరిత ఉగ్రవాద విధ్వంస కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పదేపదే భారత్‌ను కవ్విస్తూ, కయ్యానికి కాలు దువ్వడం పాక్ తెంపరితనానికి నిదర్శనం. లాల్ బహదూర్ శాస్త్రి,ఇందిరాగాంధీ,వాజ్ పేయి, మోడీలు పాకిస్థాన్ చర్యలకు ధీటైన సమాధానం చెప్పారు. అయినప్పటికీ భారత్‌లో పాక్ ఆగడాలు ఆగడం లేదు. పాక్ వైఖరిలో మార్పు రావడం లేదు. ఉగ్రవాదం వలన భారత్ తన అపారమైన వనరులను అభివృద్ధికి వెచ్చించలేకపోతున్నది. రక్షణ రంగానికి అధిక నిధులను కేటాయించవలసి వస్తున్నది. ఉగ్రవాదులకు ఊతమిస్తున్న పాక్ ఆర్థికంగా పీకల్లోతు కష్టాల్లోకి నెట్టబడింది. పాక్ భవితవ్యమే అగమ్యగోచరంగా మారింది. పాక్ ప్రజలుకూడా పాక్ ప్రేరిత ఉగ్రవాదంపట్ల అసహనంగా ఉన్నమాట వాస్తవం. భారత్ పాక్‌ల మధ్య యుద్ధం సంభవిస్తే పాక్ ఉనికి ప్రమాదంలో పడుతుంది. రణమా? శరణమా?అనే విషయం మతోన్మాద పాక్ తేల్చుకోవాలి. ●

## సిక్కింలో విరిగిపడిన కొండచరియలు

### చిక్కుకుపోయిన 1000 మంది పర్యాటకులు

**గ్యాంగ్‌టక్, ఏప్రిల్ 26:** ఈశాన్య భారతదేశంలోని ఉత్తర సిక్కింలో ప్రకృతి వైపరీత్యం కారణంగా పెద్ద సంఖ్యలో పర్యాటకులు చిక్కుకుపోయారు. మున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్‌చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ వద్ద గురువారం భారీ కొండ చరియలు విరిగిపడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ విపత్తు సంభవించింది. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో నిరంతర వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతిని రద్దు చేశారు అధికారులు. కొండచరియలు విరిగిపడిన కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 1,000 మంది పర్యాటకులు చిక్కుకుపోయారని పోలీసు అధికారులు ధృవీకరించారు. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు 200 పర్యాటక వాహనాలు చిక్కుకుపోయాయి. దీంతో అధికారులు ప్రయాణికులను సమీపంలోని గురుద్వారాకు తరలించి బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేవరకూ ఉత్తర సిక్కింకు పర్యాటకులను పంపవద్దని అధికారులు అన్ని టూర్ ఆపరేటర్లను ఆదేశించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పరిస్థితులు మెరుగుపడే వరకు సందర్శకులు, స్థానికులు నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



## బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుడు

**టెహ్రాన్, ఏప్రిల్ 26:** ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ నగరంలో శనివారం భారీ పేలుడు సంభవించింది. పేలుడు తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. ఈ పేలుడులో ఇప్పటివరకు 406 మంది గాయపడినట్లు సమాచారం. వారందరినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బందర్ అబ్బాస్ నగరంలోని రాజాయ్ ఓడరేవులో ఈ పేలుడు చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. పేలుడుతో పెద్ద ఎత్తున పొగ ఈ ప్రాంతాన్ని కమ్మేసింది. రాజాయ్ ఓడరేవు ఇరాన్ ఓడరేవుల్లో ఒకటి. పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్‌తో అనుబంధంగా ఉన్న సినా కంటైనర్ యార్డ్‌లో శనివారం పేలుడు జరిగిందని ఇరాన్‌కస్టమ్స్ అథారిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. పేలుడు కారణంగా ఓ భవనం కుప్పకూలిపోయింది. ఇరాన్ స్టేట్ టెలివిజన్ ప్రాథమిక నివేదిక ప్రకారం సంఘటనా స్థలంలో మండే గుణం ఉన్న పదార్థాలు ఉన్నాయని, నిల్వలో నిర్లక్ష్యం వహించడమే ఈ పేలుడుకు కారణమని పేర్కొంది. పోర్ట్‌లో జరిగిన ఈ భారీ పేలుడు కారణంగా ఓ భవనం కూలిపోయిందని తెలుస్తున్నది. కిలోమీటర్ల దూరం పాటు భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. పలు భవనాలు దెబ్బతిన్నట్లు సమాచారం.




## మానస్‌సరోవర్ యాత్రకు రిజిస్ట్రేషన్లు షురూ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** కైలాస మానససరోవర్ యాత్ర ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు కొనసాగుతుందని విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఏడాది 50 మంది యాత్రికుల ఐదు బ్యాచ్‌లు ఉత్తరాఖండ్ నుంచి లిపులేఖ్ పాస్ మీదుగా యాత్రకు వెళ్తాయని పేర్కొంది. మరో 50 మంది పర్యాటకుల పది బ్యాచులు సిక్కిం నుంచి నాథు లా పాస్ మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొంది. ఆసక్తి ఉన్న వారు యాత్ర కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ని ప్రారంభించింది. దరఖాస్తులను కంప్యూటర్ జనరేటెడ్, ర్యాండమైజ్, జండర్ బేస్డ్ విధానంలో ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించనున్నారు. కొవిడ్ మహమ్మారి కారణంగా 2020 నుంచి కైలాస మానస సరోవర యాత్ర నిర్వహించని విషయం తెలిసిందే. ఈ సారి నిర్వహించనున్న యాత్రపై ద్రవ్యోల్బణం ప్రభావం పడే అవకాశం ఉన్నది. కైలాస మానస సరోవర్ యాత్ర కోసం పర్యాటకులు కుమావున్ మండల్ వికాస్ నిగమ్ కి రూ.35 వేలకు బదులుగా రూ.56 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ప్రయాణం, వసతి, ఆహారం తదితరాల కోసం వికాస్ నిగమ్ వెచ్చిస్తుంది. దాంతో పాటు వైద్య పరీక్షలు, చైనా వీసా, పోర్టర్, టిబెట్ అటానమస్ రీజియన్, చైనా బోర్డర్ ఫీజులను ప్రత్యేకంగా చెల్లించాల్సి ఉంటుంది. కుమావున్ మండల్ వికాస్ నిగమ్ లిపులేఖ్ పాస్ ద్వారా కైలాస్ మానస సరోవర్ యాత్ర కోసంఏర్పాట్లు చేస్తుంది. ఈ సారి రిజిస్ట్రేషన్‌తోపాటు, యాత్రికులు ఆహారం, ప్రయాణం, వసతి కోసం కేఎంవీఎన్‌కు రూ. 56వేలు చెల్లించాలి. ఈ యాత్ర ఢిల్లీ నుంచి ప్రారంభమై ఫితోర్‌గఢ్‌లోని లిపులేఖ్ పాస్ ద్వారా యాత్ర సాగుతుంది. యాత్ర తొలి బృందం జూలై 10న లిపులేఖ్ పాస్ ద్వారా చైనాలోకి ప్రవేశిస్తుంది.

# ఉగ్రదాడిపై దర్యాప్తునకు మేం సిద్ధమే..

### పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 26:** పహల్గాం దాడి తరువాత భారతదేశానికి ప్రపంచ దేశాల మద్దతు పెరుగుతోంది. దీనితో పాకిస్థాన్‌పై క్రమంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనితో ఇప్పటి వరకు మౌనంగా ఉన్న పాకిస్థాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ నోరు మెదిపారు. పహల్గాం దాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. అక్కడితో ఆగకుండా ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్థాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్, భారత్‌పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల గురించి మాట్లాడారు. "జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఓ విషాదకర ఘటన జరిగింది. దీంతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఈ ఉగ్రదాడిపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తునకు మేము సిద్ధంగా ఉన్నాం. శాంతికే మేము ప్రాధాన్యత ఇస్తాం అని షరీఫ్ అన్నారు. ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న విషయాన్ని దాచిపెట్టి, ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి వచనాలు వల్లె వేశారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కూడా పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ పరోక్షంగా స్పందించారు. "మా దేశ భద్రత, సార్వభౌమత్వం విషయంలో ఎన్నటికీ రాజీపడం. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇండియా ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఇలాంటి చర్యలతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మేము చర్చల ద్వారానే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నాం అంటూ భారత్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. ఇప్పటికే పలువురు పాక్ మంత్రులు భారత్‌పై తమ అక్కసు వెళ్లగక్కిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది ప్రాణాలను బలితీసుకుని నరమేధం సృష్టించారు. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫోర్స్ ఈ దాడులకు పాల్పడినట్లు ప్రకటించుకుంది. దీంతో సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు పలు ఆంక్షలు విధించింది. పాక్ పౌరులు తక్షణమే భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది. దీనితో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి.

# ఉగ్రమూకల రహస్య స్థావరం ధ్వంసం



### భారీగా మందు గుండు సామగ్రి స్వాధీనం

**శ్రీనగర్, ఏప్రిల్ 26:** పహల్గాం ఘటనతర్వాత ఉగ్రమూకలను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు ముమ్మరంచేసాయి. ఇందులో కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా దలాలు గుర్తించి ధ్వంసంచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆప్రాంతంనుంచి భారీగా ఆయుధాలు మందుగుండుసామగ్రిని స్వాధీనంచేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు ఉత్తర కశ్మీర్ జిల్లాలోనిసెడోరి నాలా అటవీప్రాంతంలో భద్రతా దళాలు సోదాలునిర్వహించాయి. దీనితో ఈప్రాంతంలో కుట్రలు చేస్తున్నట్లు అనుమానాలు రావడంతో సైన్యం వారి స్థావరాలను ధ్వంసంచేయడం ఉగ్రవేటలో మరో భాగమని చెపుతున్నారు. పహల్గాం దాడి తర్వాత రాష్ట్రం అంతటా మిలిటెంట్లకోసం జల్లెడ పడుతున్నారు. కుల్గాం ఇల్లాలో ఉగ్రవాదులతోకలిసి పనిచేస్తున్న ఇద్దరిని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేసాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపు లోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే వారిపేర్లు ఇతర వివరాలు మాత్రం వెల్లడించలేదు.

# నిరసనకారుల గొంతు కోస్తానని సంజ్ఞలు చేసిన పాక్ ఆఫీసర్

**లండన్, ఏప్రిల్ 26:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది మరణించడంపై భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా భారతీయ నిరసనకారులను పాకిస్థాన్ అధికారి బెదిరించాడు. గొంతు కోస్తామన్నట్లుగా సంజ్ఞ చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శుక్రవారం లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల ప్రవాస భారతీయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సుమారు 500 మంది బ్రిటీష్ హిందువులు ఇందులో పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిని వారు ఖండించారు. ఉగ్రవాదం, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాద గ్రూపులకు పాకిస్థాన్ మద్దతు ఇస్తోందని విమర్శించారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరుగాలని డిమాండ్ చేశారు. అక్కడ దేశ భక్తి గీతాలు ప్లే చేశారు. కాగా, లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్‌లో ఉన్న ఆ దేశ ఆర్మీ, ఎయిర్ అడ్వైజర్ కల్నల్ తైమూర్ రహత్ ఈ సందర్భంగా భారతీయ నిరసనకారులను బహిరంగంగా బెదిరించాడు. గొంతు కోస్తామన్నట్లుగా సంజ్ఞ చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్మీ అధికారి తీరుతోపాటు ఆ దేశంపై విమర్శలు వెల్లువెత్తాయి.







# కారు చోరీచేసి మళ్లీ అదే యజమానికి అమ్మకం



**లండన్, ఏప్రిల్ 15:** బ్రిటన్‌లోని వెస్ట్ మిడ్‌లాండ్స్ ప్రాంతానికి చెందిన 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఈవాన్ వాలెంటైన్‌కు చెందిన నల్ల రంగు హోండా సివిక్ కారును ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటి ముందు పార్క్ చేసి ఉంచగా గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినా, అధికారులు కారు తిరిగి దొరికే అవకాశాలు చాలా తక్కువ అని నిరాశ వ్యక్తం చేశారు. అయితే అదృష్టం కొద్దీ బీమా కంపెనీ నుండి పూర్తి పరిహారం అందింది. దీనితో తనకు ఎంతో ఇష్టమైన అదే మోడల్, అదే రంగు హోండా సివిక్ కారును మళ్లీ కొనాలని ఈవాన్ నిర్ణయించుకున్నారు. కొద్ది రోజుల తర్వాత ఆన్‌లైన్ కార్ సేల్స్ ప్లాట్‌ఫామ్‌లో బ్రౌజ్ చేస్తుండగా, అచ్చం తన పాత కారులాంటి ఒక వాహనం కనిపించింది. రూపం, రంగు, మోడల్ అన్నీ కూడా ఏ మాత్రం తేడా లేకుండా ఉండటంతో ఆ వాహనాన్ని సుమారు రూ. 22 లక్షల కు కొనుగోలు చేశారు. కారు ఇంటికి వచ్చాక మొదటిదైన ఆనందం కనిపించినా, క్రమంగా కొన్ని అనుమానాలు ఈవాన్ మదిలో మొదలయ్యాయి. కారులో ఉన్న పాత వస్తువులు టెంట్ మేకు, క్రిస్మస్ చెట్టు ఆకులు, చాక్లెట్ రేపర్లు అతడికి చాలా పరిచయంగా అనిపించాయి. ఇవన్నీ గతంలో తన కారులో వదిలిపెట్టినవే అని గుర్తుకు వచ్చాయి. ఈ అనుమానంతో కారులోని శాటిలైట్ నావిగేషన్ సిస్టమ్ హిస్టరీని చెక్ చేసిన ఈవాన్, అక్కడ తన పాత చిరునామాలు, ప్రయాణ మార్గాలు కనిపించటంతో షాక్‌కు గురయ్యారు. తాను కొత్తగా కొనుక్కున్నది అసలు కొత్త కారు కాదని తాను పోగొట్టుకున్నకారునే మళ్లీ కొనుక్కున్నట్లు గ్రహించాడు. ఒకవైపు మళ్లీ తన కారును తిరిగి పొందిన ఆనందం, మరోవైపు దొంగల చేతిలో మోసపోయిన బాధ ఆతడిని గందరగోళంలోకి నెట్టేసాయి. దొంగలు కారు నంబర్ ప్లేట్‌ను మార్చి, మైలేజీని ఫేక్ చేసి, అసలు వివరాలు దాచిపెట్టి దానిని రీసెల్ చేయడంతో తన కారును ఈవాన్ గుర్తించలేకపోయాడు. కారు పోయి నదానికంటే చోరీకి గురయిన తన కారును తిరిగి తానే 22 లక్షలకు కొనుగోలు చేయడంతో సొమ్ముపోయిందని తల పట్టుకున్నాడు.

# సరిహద్దుల్లో కవ్విస్తున్న పాక్ జవాన్లు



**శ్రీనగర్, ఏప్రిల్ 26:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నియంత్రణ రేఖ వెంట మరోసారి కాల్పుల కలకలం రేగింది. రెచ్చగొట్టే ధోరణితో పాక్ ఆర్మీ కాల్పులకు తెగబడింది. వెంటనే భారత సైన్యం అప్రమత్తమై ప్రతిదాడులు జరిపింది. సమర్థంగా తిప్పికొట్టింది. ఏప్రిల్ 2526 అర్థరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు శనివారం వెల్లడించారు. నియంత్రణ రేఖ వెంబడి పలు పోస్టుల నుంచి పాక్ ఆర్మీ కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించారు. ఏప్రిల్ 24, 25 అర్ధరాత్రి వేళ కూడా పాక్ ఎల్ఓసీ వద్ద కాల్పులు జరిపింది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. దీంతో ఆ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కుతోంది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది. అలాంటి పరిణామాల వేళ సరిహద్దుల్లో కాల్పులు చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. మరోవైపున పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ముస్లింలు శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రదర్శనలుచేపట్టారు. చేతికి నల్లరంగు బ్యాండ్లు ధరించి నిరసన తెలిపారు. పాకిస్థాన్‌కు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాజా దాడి నేపథ్యంలో పాక్‌పై దౌత్యపరంగా, సైనిక పరంగా కఠిన చర్యలకు ఉపక్రమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు పహల్గాంలో దాడికి పాల్పడిన వ్యక్తు లు తమను తాము ముస్లింలుగా చెప్పుకొం టున్నప్పటికీ వారి చర్య ఇస్లామ్ మతానికి పూర్తి విరుద్ధమైనదని ఢిల్లీలోని చారిత్రక జామా మసీద్ షాహీ ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ వ్యాఖ్యానించారు.



# పాక్‌పై సొంత పౌరులే జోకులు..

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 26:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ దాయాదితో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయాలని నిర్ణయించుకుంది. దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పాక్ రక్షణ మంత్రి మాట్లాడుతూ సింధూ నదిలో ప్రతి చుక్కా తమదేనని, భారత్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. భారత్ తమకు నీళ్లు ఆపేస్తే నదుల్లో మళ్లీ రక్తం పారుతుందని మరో నేత హెచ్చరించారు. కాగా వారి మాటలపై స్పందిస్తూ పాక్ నెటిజన్లు తమ ప్రభుత్వంపై అసంతృప్తిని తెలిపేలా జోకులు పేల్చుతున్నారు. భారత్ తీసుకున్న పలు చర్యలపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ఓ వ్యక్తి స్నానం చేస్తున్న సమయంలో నీళ్లు ఆగిపోయిన ఫొటోను షేర్ చేస్తూ 'సబ్బు కళ్లల్లోకి వెళ్లింది.. భారత్ నీళ్లువదులు' అని నెటిజన్ రాసుకొచ్చారు. పాకిస్థాన్ వైమానిక దళాన్ని ట్రోల్ చేస్తూ ఓ నెటిజన్ పేపర్‌బోర్డుతో తయారుచేసిన ఫైటర్ జెట్ లాంటి నిర్మాణంతో తయారుచేసిన మోటార్‌సైకిల్‌ను నడుపుతున్న పాక్ వ్యక్తి ఫొటోను షేర్ చేశారు. అలాంటి మరికొన్ని కొన్ని సరదా మీమ్స్ ఇవి..

'మమ్మల్ని చంపేస్తారా? మా ప్రభుత్వం రోజూ చంపేస్తోంది. లాహోర్ తీసుకుంటారా? అరగంటలో అక్కడేమీ లేదని తిరిగి ఇచ్చేస్తారు'

'భారత్.. పాకిస్థాన్‌ను స్వాధీనం చేసుకోవాలని అనుకుంటోంది. అదే జరిగితే ప్రజలపై డబ్బు ఖర్చు చేయడానికి, ప్రపంచ దేశాలను రుణ మాఫీలు చేయమని అడిగే అవసరం ఇక్కడి ప్రభుత్వానికి ఉండదు'.

# వాటికన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ.. సానుకూలంగా చర్చలు



**వాటికన్, ఏప్రిల్ 26:** వాటికన్‌సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం పోప్ ఫ్రాన్సిస్ (88) అంతిమయాత్ర ప్రారంభమయింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రపంచ దేశాల అధినేతలు, ప్రతినిధులు దాదాపు 164 మంది హాజరయ్యారు. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తదితరులు ఇందులో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కాసేపు సమావేశమైనట్లు అధికారులు పేర్కొన్నారు. యుద్ధం ముగింపు, ఖనిజాల ఒప్పందం మొదలైన విషయాల గురించి వారి చర్చించినట్లు, ఇద్దరి మధ్య చర్చలు సానుకూలంగా సాగాయని అధ్యక్ష కార్యాలయాలు వెల్లడించాయి. అమెరికాలోని ఓవల్ కార్యాలయంలో ట్రంప్‌నకు, జెలెన్‌స్కీకి వాగ్వాదం జరిగిన తర్వాత వారు కలవడం ఇదే మొదటిసారి. ఇటీవల యుద్ధం ముగింపు గురించి ట్రంప్ మాట్లాడుతూ ఈ వారంలోనే ఓ ఒప్పందానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పోప్ అంత్యక్రియల కార్యక్రమంలో వీరిద్దరు ఒకే దగ్గర కూర్చోకపోవడంతో వీరి మధ్య ఇంకా మనస్పర్థలు ఉన్నాయన్న వార్తలు వచ్చాయి. వీటిపై వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చియుంగ్ స్పందిస్తూ.. కార్యక్ర మంలో ఫ్రెంచ్ అక్షర క్రమంలో అంత్యక్రియలకు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులకు సీటింగ్ ఏర్పాటు చేశారని అంతకుమించి వేరే కారణం లేదని స్పష్టతనిచ్చారు. శుక్రవారం ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని అన్నారు. ఒబామా హయాంలోనే సబ్‌మెరైన్లను రష్యా అక్కడ మోహరించిందని తెలిపారు. ఆ ప్రాంతం రష్యాతో ఉన్న విషయాన్ని జెలెన్‌స్కీ సహా ప్రతిఒక్కరూ త్వరలో అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చలను అడ్డుకుంటూ జెలెన్‌స్కీ యుద్ధాన్ని పొడిగిస్తున్నారని ఆరోపించారు. ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు.

# గుజరాత్‌లో 450 మంది అక్రమ బంగ్లా శరణార్థులు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 26:** గుజరాత్‌లో అక్రమంగా ఉంటున్న సుమారు 450 మంది బంగ్లాదేశీ శరణార్థులను అరెస్టు చేశారు. అహ్మదాబాద్ సిటీలో నిర్వహించిన కూంబింగ్ ఆపరేషన్ ద్వారా వీళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఇవాళ తెల్లవారుజామున పోలీసులు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్లు క్రైం బ్రాంచ్ డీసీపీ అజిత్ రాజియాన్ తెలిపారు. చాలా వరకు బంగ్లాదేశ్‌కు చెందిన శరణార్థుల్ని పట్టుకున్నామని, వాళ్లను దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఒకవేళ సరైన డాక్యుమెంట్లు లేకపోతే వాళ్లను డిపోర్ట్ చేయనున్నట్లు తెలిపారు. అహ్మదాబాద్ క్రైం బ్రాంచ్, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు, ఎకనామిక్ అఫెన్స్ వింగ్, ఆరో జోన్‌తో పాటు హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన పోలీసులు ఈ కూంబింగ్ ఆపరే షన్‌లో పాల్గొన్నారు. కాంకరియా ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆ అక్రమ వలసదారుల్ని బంధించినట్లు తెలిపారు. సూరత్‌లో కూడా గత రాత్రి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఎస్ఓజీ, డీసీబీ, ఏహెచ్‌టయూ, పీసీబీ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించింది. దాదాపు వంద మందికిపైగా బంగ్లాదేశీలను అరెస్టు చేశారు. అక్ర మంగా ఇండియాలోకి ప్రవేశించిన బంగ్లాదేశీలు ఫేక్ డాక్యుమెంట్లతో సూరత్‌లో నివసిస్తున్నట్లు తెలిసింది. విచారణ తర్వాత అందర్నీ బం గ్లాదేశ్‌కు పంపనున్నట్లు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు డీసీపీ రాజ్‌దీప్ సింగ్ నాకుం తెలిపారు.

# భారత్‌కు కోడలిని..ఇక్కడే ఉంటా..

### సీమా హైదర్



**లక్నో, ఏప్రిల్ 26:** భారత్‌లో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు సీమా హైదర్ విజ్ఞప్తి చేశారు. తాను ఖచ్చితంగా పాక్ కూతురినే అయినప్పటికీ ప్రస్తుతం భారత్‌కు కోడలినని ఈ క్రమంలో భారత్‌లో ఉండనివ్వాలని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఇటీవల పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత ప్రభుత్వం పాకిస్తాన్ విషయంలో కఠిన చర్యలు తీసుకుంది. సార్క్ వీసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే భారత్‌కు వచ్చిన వారంతా వారంలోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఆ తర్వాత సీమా హైదర్‌ను పాక్‌కు పంపాలనే డిమాండ్ మొదలైంది. వైరల్ అవుతున్న వీడియోలో సీమా హైదర్ మాట్లాడుతూ 'నేను పాక్‌కు వెళ్లాలనుకోవడం లేదు. ఇప్పుడు వారి ఆశ్రయంలో ఉన్నానని మోదీ జీ, యోగి జీకి విజ్ఞప్తి చేస్తున్నాను. నేను పాకిస్తాన్ కూతురిని, కానీ ఇప్పుడు నేను భారత్ కోడలిని. నన్ను ఇక్కడే ఉండనివ్వండి' అని పేర్కొంది. సచిన్ మీనాను వివాహం చేసుకున్న తర్వాత తాను హిందూ మతాన్ని స్వీకరించానని హైదర్ తెలిపింది. గ్రేటర్ నొయిడా నివాస సచిన్ మీనాతో ఆన్‌లైన్ పబ్‌జీ గేమ్ ద్వారా కనెక్ట్ అయ్యింది.

# అయోధ్య భక్తులకోసం భారీ ఓపెన్ పార్కింగ్

**అయోధ్య, ఏప్రిల్ 25:** అయోధ్య రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు శుభవార్త. ఐదు అంతస్తుల భవన సముదాయంలో భక్తుల సౌలభ్యం కోసం ఆధునిక ఓపెన్ సర్ఫేస్ పార్కింగ్ నిర్మించాలని ఉత్తర్‌ప్రదేశ్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. మంఝా జంతారా సమీపంలోని 35 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ పార్కింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు యూపీ ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పార్కింగ్ ఇంజనీరింగ్, ప్రొక్యూ రిమెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ మోడ్ కింద నిర్మిత మవ్వనుంది. ఈ ప్రాజెక్టును ప్రజా పనుల శాఖకు చెందిన సీడీ2 యూనిట్ నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్ ఖర్చు అంచనా రూ.16,557 కోట్లు. అయోధ్యలో ఓపెన్ సర్ఫేస్ పార్కింగ్ నిర్మాణం వల్ల భక్తుల రద్దీని అరికట్టడం సులువు అవు తుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే ట్రా ఫిక్ నిర్వహణ కూడా ఈజీ అవుతుందని యోచిస్తున్నారు. శ్రీరాముడి ఆలయం ప్రారంభోత్సవం తర్వాత అయోధ్యకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రతిరోజూ లక్షలాది మంది రామయ్య దర్శనం కోసం వస్తున్నారు.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్

ప్రకటన నం.: R/03/2025, తేదీ : ఏప్రిల్ 16, 2025

ఈ సంస్థ భారతీయ జాతీయుల నుండి, వివిధ నాన్-టీచింగ్ స్థానాలకు (మెడికల్ కేడర్) ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. విద్యార్హత, అనుభవం మరియు అప్‌డేట్స్ సంబంధిత వివరాల కొరకు http://www.iitkgp.ac.in/non-teaching-positions వీక్షించండి.

CBC 21255/12/0001/2526 రిజిస్ట్రార్.



## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో జెఎన్‌టియు విసి కిషన్‌కుమార్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జవహార్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టీయూహెచ్) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్ కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మని కలిశారు. జెఎన్‌టియూ విసిగా నియమితులైన అనంతరం మొదటిసారి గవర్నర్‌ను కలిశారు. తాను గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్టు విసి తెలిపారు. గవర్నర్‌తో భేటి సందర్భంగా విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా పరమైన వినూత్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికల గురించి గవర్నర్‌కి వివరించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశోధనలో నూతనత, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో సమన్వయాన్ని పెంపొందించడంలో యూనివర్సిటీ తీసుకుంటున్న చొరవను గవర్నర్ అభినందించారని విసి తెలిపారు.

## నాపై దాడి చేసిన వారిని న్యాయపరంగా ఎదుర్కొంటా

### చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** కారణంగా తనపై దాడిచేసి కొట్టి, అవమా నించిన నిందితులను న్యాయపరంగా ఎదుర్కొంటానని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానార్చకులు రంగరాజన్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6న కుంభమేళాకు వెళ్లి తిరిగి వచ్చి అలసిపోయి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నానన్నారు. మరుసటి రోజు అంటే 7న 20 మంది దుండగులు తన ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి రామరాజ్య స్థాపనకు తమకు సహకరించాలని కోరారన్నారు. అసలు వారి ఉద్దేశ్యమేమిటో అడిగానని, దీంతో కోపంతో తనపై దాడి చేసి కొట్టారన్నారు. భుజంపై నామాలున్న చోట తన్నారని, వీడియో రికార్డు చేసి తనను బెదిరించారన్నారు. తమ తర్వాతి టార్గెట్ చిన్నజీయర్ స్వామి అంటూ బెదిరిస్తూ వెళ్లిపోయారన్నారు. తమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డితో పాటు పలువురిని అరెస్టు చేశారని తెలిపారు. ప్రస్తుతం బెయిల్‌పై వచ్చిన వీరరాఘవ రెడ్డి పలు ప్రైవేట్ యూట్యూబ్ చానెళ్లలో తనపై అసత్యపు ఆరోణలు చేస్తున్నాడన్నారు. తనను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడంతో పాటు తన పరువుకు భంగం వాటిల్లేలా బహిరంగంగా మాట్లాడుతున్నాడన్నారు. అతని వ్యాఖ్యలపై న్యాయం పోరాటం చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తానని పేర్కొన్నారు. తనపై దాడి చేసిన రోజు ఒక్క ఫోన్ చేస్తే వారు చిలుకూరు దాటే వారు కాదని, కాని తాను అలా చేయలేదని, న్యాయపరంగానే వారిని ఎదుర్కొనేందుకు పోలీసులను ఆశ్రయించానన్నారు. వారికి శిక్షపడే వరకు వదిలిపెట్టేది లేదన్నారు.

## బంకర్లకు చేరుతున్న సరిహద్దు గ్రామాల ప్రజలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తరువాత భారత్...పాక్ సరిహద్దులో పరిస్థితులు క్రమేపి వేడెక్కుతున్నాయి. పహల్గాం దాడికి ముందు అంతా సవ్యంగా వున్న సరిహద్దు గ్రామాలలో ఇప్పుడు ఉద్రిక్తత పరిస్థితుల ఏర్పడ్డాయి. భారత్ తరపున ఇప్పటికే భారీగా భద్రతా బలగాలు సరిహద్దు వెంట మోహరించగా పాక్ కూడా అందుకు తగినట్లుగా బలగాలను దిం చింది. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాలైన కర్మర్హ సహా మరికొన్ని చోట్ల బంకర్లను వాడడం గురించి ప్రజలకు పోలీసులు సూచనలు చేయసాగారు. అత్యవసర పరిస్థితుల్లో బంకర్లలో ఎలా జాగ్రత్తగా వుండాలి, నిత్యావసర వస్తువులను ఎలా జాగ్రత్త పరచుకోవాలి...? అనే విషయాలను పోలీసులు సరిహద్దు గ్రామాల ప్రజలకు చెబుతున్నారు. దీంతో కొందరు గ్రామస్తులు బంకర్లలో నిత్యావసర సరు కులతో వెళ్లడం ప్రారంభించారు.

సరిహద్దుల్లో ఇప్పటికే పాకిస్తాన్ కవ్వింపు చర్యల్లో భాగంగా కాల్పులకు దిగుతుండగా, దీనికి ధీటుగా భారత సైనికులు కూడా కాల్పులు జరుపుతుండడం విదితమే. ప హల్గాం దాడి తరువాత పాక్ నుంచి ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు కొనసాగుతుం డగా దీనిని భారత్ తిప్పికొడుతుందని రక్షణ రంగ అధికారులు చెబుతున్నారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా సరిహద్దు గ్రామాల ప్రజలను బంకర్లలో వుండేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. పోలీసులతో పాటు పౌర అధికారులు కూడా బంకర్ల వద్ద ఏర్పాట్లు చూడసాగారు. కార్గిల్ ఉదంతం తరువాత, పుల్వామలో సిఆర్‌పిఎఫ్ బలగాలపై జరిగిన ఆత్మాహుతి దాడి తరువాత బంకర్ల వాడకం పెరిగింది. వీటిని గతంలో కంటే మరింత ఆధునీకరించి, ఎక్కువ మంది వుండేలా తీర్చిదిద్దారు. పహ ల్గాం దాడి తరువాత తీర ప్రాంతాలలో భద్రతా బలగాలు భారీగా గాలింపు చర్యలు చేబడుతూ ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయసాగింది. ఉగ్రవాదుల ఇళ్లను కూడా పేల్చి వేసింది. దీనికి ప్రతీ కారంగా ఉగ్రవాదుల తరపున సరిహద్దుల్లోని గ్రామాలపై దాడులు జరిగే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో బంకర్లలో ప్రజల తరలింపు మొదలయ్యింది. గతంలో అనేకసార్లు ఇక్కడి ప్రజలు రోజుల తరబడి బంకర్లలో తలదాచుకున్న ఘటనలు వున్నాయి. అధికారికంగా పోలీసులు ప్రకటించే వరకు వీరంతా బంకర్లలోనే జీవనం సాగించారు. ఈసారి పరిస్థితులు ఎలా వుంటాయో? చూడాల్సి వుంది.

## ఓదెల-2 చిత్రానికి కులం చిచ్చు

### అభ్యంతరకర సన్నివేశాలు తొలగించాలని బిసి కమిషన్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఓదెల-2 చిత్రానికి భారీ షాక్ తగిలింది. ఈ చిత్రంలో కులం పేరుతో ఉన్న అభ్యంతరకరమైన దృశ్యాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ ఫిర్యాదు చేసింది. అదేవిధంగా ఆయా సన్నివేశాలను తొలగించాలని ప్రాంతీయ సెన్సార్ బోర్డు కమిషన్ సూచించింది. ఈ నెల విడుదృున ఓదెల2 సినిమాలో ఒక వివాహ సన్నివేశంలో సర్పంచ్ 116 రూపాయలు కానుక రాయించిన విషయమై జరిగిన వాద ప్రతివాదనలో పిచ్చగుంట్ల కులం పేరును అభ్యంతరకరంగా వాడినట్టు తమ దృష్టికి వచ్చిందని బీసీ కమిషన్ పేర్కొంది. ఈ విషయంపై పిచ్చగుంట్ల కులానికి చెందిన వారు బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో దీనిపై స్పందించింది. ఆ సన్నివేశంలోని అభ్యంతరకర పదాలను తొలగించాలని కోరినట్టు వెల్లడించింది. ఆ సినిమా ప్రొడ్యూసర్, డెరెక్టర్, రచయిత, అభ్యంతర పదాలను వాడిన నటులపై చర్యలు తీసుకోవాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. అలాగే ఫిలిం సెన్సార్ బోర్డు ఈ అభ్యంతరకర పదాలు ఉన్నటువంటి చిత్రాన్ని, ఆ పదాలు తొలగించకుండా కూడా సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వడాన్ని కమిషన్ తప్పు పట్టింది. ఈ చిత్రం ప్రస్తుతం సినిమా థియేటర్లో నడుస్తున్నందున ఇకపైన జరిగే చిత్ర ప్రదర్శనలో ఈ అభ్యంతర పదాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. దీనిపై స్పందించిన సెన్సార్ బోర్డు అధికారి రాహుల్ గౌలీకర్ ఆ సన్నివేశంలోని అభ్యంతరకర పదాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

# టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి స్కిల్ కోర్సుల్లో శిక్షణ!

### ఎన్ఎస్‌డిసితో ఎంఒయు చేసుకోనున్న ఉన్నత విద్యామండలి

### జిల్లాకొక సెంటర్ ఏర్పాటు.. పైలట్ ప్రాజెక్టుగా నాగర్‌కర్నూల్‌లో ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువత ప్రపంచంతో పోటీ పడేలా చేయాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ముందుకు తీసుకుపోతోంది. రాష్ట్రంలో టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటోంది. టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారితో పాటు డ్రాపౌట్ అయిన వారికి కూడా స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించడానికి ఉన్నత విద్యా మండలి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డిసి)తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకోవాలని భావిస్తోంది. ఎన్ఎస్‌డిసితో ఎంఓయూ చేసుకుని యువతకు వివిధ స్కిల్ కోరుసల్లో శిక్షణను ఇప్పించాలని భావిస్తోంది. ఇటువంటి శిక్షణా కేంద్రం ప్రతి జిల్లాలోనూ ఒకటి ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. సుమారు 39 స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. అయితే యువతకు స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి ఎన్ఎస్‌డిసితో ఎంఓయూ చేసుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయం కోసం ఉన్నత విద్యా మండలి ఎదురు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న యువత అందరికీ అక్కడ శిక్షణ ఇప్పించడం సాధ్యం కాదు కాబట్టి.. ప్రతి జిల్లాలోనూ ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. ఆ జిల్లాలో ఉన్న యువత దేని గురించి ఆలోచిస్తుందో సర్వే చేయించి తద్వారా అవే కోర్సుల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. మే నెలలో ముఖ్యమంత్రి సమయం మేరకు ఎన్ఎస్‌డిసితో ఎంఓయూ చేసుకొన్న అనంతరం కేంద్రం నుంచి వచ్చే శిక్షకులతోపాటు రాష్ట్రం లోనూ శిక్షణ ఇచ్చిన వారితో యువతకు స్కిల్ కోర్సుల్లో ట్రెయినింగ్‌ను ఇవ్వాలని భావి స్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ ట్రెయినింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నప్పటికీ.. పైలట్ ప్రాజెక్టుగా మొదటగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోనూ స్కిల్ కోర్సు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తు న్నారు. రాష్ట్రంలోని యువతకు ఇంజనీరింగ్ కోర్సులు కాకుండా మిగిలిన సుమారు 39 కోర్సుల్లో ట్రెయినింగ్ ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నారు. వాటిలో అగ్రికల్చర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, డ్రోన్ టెక్నాలజీ తదితర 39 కోర్సుల్లో ట్రెయినింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు.

## హైదరాబాద్‌లో నలుగురు పాకిస్థానీయులకు నోటీసులు

### ఆదివారం రాత్రిలోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** పహల్గాం దాడి తరువాత భారత్‌లో అక్ర మంగా లేదా వీసాలపై ఉంటున్న పాకిస్థానీయులను వెనక్కు పంపేందుకు చర్యలు తీసుకున్న కేంద్రం ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వ డం తెలిసిందే.

జంట నగరాలు, శివారు ప్రాంతాల్లో (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిష నరేట్ల పరిధులు) మొత్తం 213 మంది ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో తాత్కాలిక వీసాపై ఉన్న నలుగురిని వెనక్కు పంపేందుకు పోలీసు శాఖ చర్యలు చేబట్టి పాతబస్తీలో ఉంటున్న వారికి హైదరాబాద్ పోలీసులు శనివారం నోటీసులు ఇచ్చారు.

వీరిని ఆదివారం రాత్రిలోగా భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వీరికి ఇచ్చిన తాత్కాలిక వీసాలు ఆదివారం తరువాత పని చేయవని పోలీసు శాఖ పేర్కొంది. హైదరాబాద్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్లే ఆ దేశ స్తులు విమానాల్లో లేదా పంజాబ్‌లోని వాఘా సరిహద్దుగుండా వెళ్లేందుకు వీలు కల్పించారు. ఈ సరిహద్దు ఈ నెల 30వ తేదీవరకు తెరిచి ఉంటుంది. కాగా మిగతావారు దీర్ఘకాలిక వీసాపైవున్న వారు కావడంతో వారి విషయంలో ఏం చేయాలనే దానిపై రాష్ట్ర పోలీసు శాఖ కేంద్ర హోంశాఖతో సంప్రదింపులు జరు పుతోంది. ఇదే సమయంలో తెలంగాణలో మరో 13మంది పలు రకాల వీసాలపై ఉండగా వారిని కూడా వెనక్కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బిఆర్ఎస్ పదేళ్లలో సాధించలేనిది యేడాదిన్నరలో సాధించాం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిన విష యాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. "రూ.వేల కోట్లు అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా అత్యధిక పంట పండింది. యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. తాజాగా సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఏడాదిన్నరగా మేం చేసిన కృషి ఫలించింది. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు. దశాబ్దకాలంగా భారాస సాధించలేనిది.. మేం ఏడాదిన్నరలోనే సాధించాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరం. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేస్తాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## రవాణా రంగ రక్షణకు మోటార్ వాహన చట్టాన్ని సవరించాలి

### కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్



రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సదస్సులో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రవాణా రంగ రక్షణకై, మోటార్ వాహన చట్టం2019ని సవరించాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికై, కార్మికుల హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్రం లోని రవాణా రంగ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవాణారంగ కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019లో మోటారు వాహనాల చట్టానికి చేసిన సవరణలు ఉనికికే ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయని, అప్పో సప్పో చేసి ఆటో, టాక్సీ, లారీ లాంటి వాహనాలు కొనుక్కొని బతుకుతున్న వారిని గెంటివేసి ఊబర్, ఓలా, రాపిడో, పోర్టర్ లాంటి కార్పోరేట్ సంస్థ లకు రవాణా రంగాన్ని అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహ నాల చట్టంలో అగ్రిగేటర్ అనే కొత్త సెక్షన్93ను చేర్చింది. మొత్తంగా రవాణారంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్ట బడింది. రవాణా రం గాన్ని కాపాడడానికి, కార్మికుల సంక్షేమం, భారీగా పెరిగిన పెనాల్టీల తగ్గింపు, ఆత్మగౌరవంతో విధులు నిర్వహించే పరిస్థితులు కల్పించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అనేక దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసింది. అనేక నిరసన కార్యక్రమాలను నిర్వహించినా, ప్రభుత్వంలో మాత్రం చలనం రాలేదు. నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఈ దుస్థితి ఇంకా కొనసాగాలా? బ్రతికినంత కాలం వెట్టిచాకిరీ చేస్తూ బానిస బతుకులు బతకాలా? ఇక సహించేది లేదని ఎలుగెత్తాలి! ప్రభుత్వ వినాశకర విధానాలను తిప్పికొట్టాలి. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలి. అందుకే మేం 20న దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, అఖిల భారత రవాణారంగ కార్మికుల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పుష్పాల శ్రీకాంత్, ఎస్. దయానంద్ (ఐఎన్టియుసి), సిహెచ్. జంగయ్య (ఏఐటియుసి), వి. ప్రవీణ్ (టియుసిఐ), పి. రాంరెడ్డి (ఐఎఫ్ టియు), సిహెచ్. బాల నర్సింహ (బిఆర్టియు), పి. యాదగిరి (టిఎన్ టియుసి), ఈ సదస్సుకు కె. అజయ్ బాబు (సిఐటియు), బి. రామకృష్ణారెడ్డి (ఐఎన్టియుసి), ఎస్. అశోక్ (ఏఐటియుసి), ఆర్. లింగం గౌడ్ (టియుసిఐ), ఎస్. రామకృష్ణ (బిఆర్టియు)లు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఎల్. కోటయ్య, సతీష్, రవి, ఉమరాఖాన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. రవాణారంగ కార్మికులందరూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

## విద్యార్థిగా పాక్‌కు వెళ్లి ఉగ్రవాదిగా మారి..

### పహల్గాం ఉగ్రదాడి నిందితుడు ఆదిల్ హుస్సేన్ థోకర్ నేపథ్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన పహల్గాం ఉగ్రదాడిలో నిందితుడుగా వున్న కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాకు చెందిన ఆదిల్ హుస్సేన్ థోకర్ వయస్సు కేవలం 20 ఏళ్లు మాత్రమే. ఇతను స్వగ్రామం బిజ్‌బెహారాకు సమీపంలోని గురీ. ఇది ఓ చిన్న గ్రామం. 2018లో 13 ఏళ్ల వయస్సులో ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో ఇతను పాల్గొన్నాడు. ఆ తరువాత వున్నట్లుండి నిషిద్ధ ఛాందస సంస్థలు, ఉగ్రవాద సంస్థల సభ్యులతో సంబంధాలు పెంచుకున్నాడు. దీని తరువాత థోకర్ చదువుల కోసమని పాక్‌కు వీసా కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే లభించి ంది. 13 ఏళ్ల వయస్సులో టీనేజిలో పాకిస్తాన్‌కు చదువుకోసం వెళ్లిన థోకర్ అక్కడ ఏం చదువుకున్నాడో తెలియదు కానీ...ఉగ్రవాద సంస్థలు నిర్వహించే భారత వ్యతిరేక శిబిరాలలో చేరి భారత్‌కు బద్ద వ్యతిరేకిగా మారాడు. 2018 నుంచి 2024 వరకు ఇతను ఎక్కడ వెళ్లిందనేది తెలియరాలేదు. భారత్ నుంచి పాకిస్తాన్‌కు వాఘా సరిహద్దు గుండా వెళ్లిన థోకర్ మళ్లీ రాకపోవడంతో ఇతని గు రించి నిఘా వర్గాలు ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో కనిపించకుండా పోయిన బాలుడి కేసుగా పరిగణించారు. దీని తరువాత పాక్‌లోని పలు ఉగ్ర శిబిరాలలో శిక్షణ పొంది చివరగా లష్కర్ ఏ తోయిబాలో చేరాడు. అనంతరం ఆ సంస్థకు అనుబంధంగా వుండి కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న ఆర్‌టిఎఫ్‌లో చేరాడు. దీని తరువాత 2024 డిసెంబర్ నెలలో థోకర్ నలుగురు పాక్ ఉగ్రవాదులతో కలిసి పుంచ్ సెక్టార్ ద్వారా దొంగదారిన భారత్‌లోకి చొరబడ్డాడు. ఈ ప్రాంతం అంతా దట్టమైన అటవీ ప్రాంతం కావ డంతో గస్తీ పూర్తిస్థాయిలో వుండక పోవ డాన్ని థోకర్ తనకు అనుకూలంగా మలచుకుని భారత్‌లోకి వచ్చాడు. థోకర్‌తో పాటు భారత్‌లో అక్రమంగా వచ్చిన నలుగురు పాక్ ఉగ్రవాదుల్లో హాషీం మూసా అలియాస్ సులేమాన్ కూడా వున్నా డు. సులేమాన్ పహల్గాం దాడుల్లో కీలక సభ్యుడు కావడం గమనార్హం. కాగా గత ఏడాది డిసెంబర్ నెలలో భారత్‌కు వచ్చిన థోకర్ తన బృందంతో భద్రతా బలగాలకు చిక్కకుండా పలుమార్లు స్థావ రాలు మార్చినట్లు తేలింది. చివరగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత్‌లో పర్యటించిన సమయంలో థోకర్, సులేమాన్ సహా మరో ఇద్దరు పర్యాటకులపై దాడికి వ్యూహం రచించారని నిఘా వర్గాలు తేల్చాయి. ఇందుకోసం రెండు నెలలుగా రెక్కీ నిర్వహించాయి. పర్యాటకులు ఎక్కువగా వచ్చే వీలున్న బైసరీన్ లోయను ఎంచుకుని వారంతా ఒకేచోట గు మికూడే చోటును ఎంచుకుని ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నలుగురు ముష్కరులు ఆటోమేటిక్ తుపాకులతో కాల్పులకు దిగారని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ కాల్పుల్లో 28 మంది పర్యాటకులు మరణించగా ఇందులో ఇద్దరు విదేశీయులు వున్నారు. ఈ దాడికి కారణమైన నలుగురిలో ఒకడైన థోకర్ అనంతనాగ్ జిల్లాకు చెందినవాడు కావడం స్థానికులను షాక్‌కు గురిచేసింది. ఈ దారుణం తరువాత అనంతనాగ్‌తో పాటు పరిసర ప్రాంతా లలో భద్రతా బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఉగ్రవాదుల స్థావ రాలతో పాటు వారి ఇళ్లను ధ్వంసం చేశారు.

## కరెంట్ బిల్లుల చెల్లింపుపై సమాచారం నమ్మొద్దు

### సంస్థ ద్వారా ఎటువంటి సందేశాలు రావు

### ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** విద్యుత్ వాడకం బిల్లలు, బకాయిల పేరుతో కొంతమంది వ్యక్తులు వినియోగదారులను మోసాలకు గురి చేస్తు న్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యు త్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) హెచ్చరించింది. ప్రధానంగా వినియోగదారుల సెల్ ఫోన్లకు మెసేజ్, ఫోన్ చేయడం వంటి వాటి ద్వారా సంప్రదించి విద్యుత్ బిల్లులు, వాటి బకాయిలు పెండింగ్ లో ఉన్నా యని అవి వెంటనే కట్టకుంటే రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెబుతున్నారని శనివారం ఒక ప్రకటనలో ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ కరెంటు బిల్లుల విషయమై వెంటనే సంప్రదించాలిసిందిగా ఒక మొబైల్ నెం బర్‌ను ఆగంతకులు పంపుతున్నారని చెప్పారు. ఆ మెసేజ్‌లను నమ్మి ఎవరైనా వారిని సంప్రదిస్తే అటువంటి వినియోగదారుని బ్యాంకు అకౌంట్ మరియు డెబిట్ కార్డు వివరాలు తీసుకుని వారి అకౌంట్ల నుండి నగదును విత్ డ్రా చేస్తూ మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కనుక విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఇలాంటి మోసపూరిత మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు.

ఇక ఎస్పీడీసీఎల్ పంపించే మెసేజ్‌ల్లో విభాగం పేరు, యుఎస్‌సి, సర్వీస్ నంబర్, వినియోగదారుని పేరు బిల్లు మొత్తం ఉంటాయన్నారు. తమ సంస్థ ఎప్పుడూ మొబైల్ నంబర్ నుండి సందేశాలు పంపదని తేల్చిచెప్పారు. అలాగే తమ సంస్థ ఉద్యోగులు చెల్లింపు రసీదు తప్ప, బ్యాంక్ ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డ్ వివరాలను ఎన్నడూ సేకరించరని వెల్లడించారు.

అంతేకాకుండా సంస్థ విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం ఎస్ఎంఎస్, సందేశం ద్వారా ఎటువంటి వెబ్‌సైట్ లింక్‌లను పంపదని తేల్చిచెప్పారు. విద్యుత్ వాడకం బిల్లులు, బకాయిల వివరాలను విద్యుత్ బిల్లు ద్వారా మాత్రమే వినియో గదారులకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. అలాగే వినియోగదారులు సంస్థ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రస్తుత వినియోగ బిల్లులు మరియు బకాయిల సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. ఇక తమ సంస్థ రాత్రిపూట, అర్ధరాత్రి విద్యుత్ సరఫరాను నిలిపివేయదని ఫరూఖీ స్పష్టం చేశారు.


# విద్య, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలి

### ఘనంగా ఒయు 108వ వార్షికోత్సవాలు

### ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు ఆకాంక్ష

**హైదరాబాద్ (తార్నాక), ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం 108 ఆవిర్భావ వేడుకలు ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరి గాయి. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అశు వులు బాసిన వారికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రారం భమైన ఆవిర్భావ వేడుకల్లో కిక్కిరిసిన విద్యార్థులు, అధ్యా పకులు, పూర్వ విద్యార్థులు, ఉద్యోగుల మధ్య పునర్వైభవాన్ని సాధిద్దామని ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవ హారాల సలహాదారు, రాజ్యసభ మాజీ సభ్యుడు కె. కేశవ రావు మాట్లాడుతూ విద్య, పరిశోధనా రంగాల్లో ఒయు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆధునిక తెలంగాణ రూపకల్పనలో ఒయు పాత్ర కీలక మైనదన్నారు. సమకాలీన స్థితుగతులు, పరిస్థి తులకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక రూపొందిం చాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన డైరెక్టర్ జనరల్, హైదరాబాద్ నగర పోలీ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఓయూ విద్యార్థులు సమగ్ర ప్రతిభకు పర్యాయపదంగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ అభివృద్ధిలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు కీలక భూమిక పోషించే అవకాశాన్ని వినియో గించుకోవాలని పిలుపునిచ్చారు. అతి చిన్న వయసులో ఐపీఎస్ అధికారిగా ఎంపిక య్యానని చెప్పుకొచ్చారు. ఓయూకు రుణపడి ఉన్నానన్న ఆనంద్ ఏదైనా చేయాలని ఉందని తన మనసులోని మాటను బయటపెట్టారు. తన తాత దూరదృష్టి పట్ల ఏడో నిజాం మీర్‌ఉస్మాన్ ఆలీఖాన్ మనవడు నవాబ్ మీర్ నజాఫ్‌అలీఖాన్ భావోద్వేగానికి లోనయ్యారు.

ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ విద్యా, పరిశోధనా రంగాల్లో ఓయూ ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రానున్న రోజుల్లో జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో రాణిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ 1966లో నియమించపడ్డ కొఠారి కమీషన్ విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని కోరుకున్నప్పటికీ నేటికీ నాలుగు శాతానికి మించి కేటాయింపులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కవి అందెశ్రీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఓ గొప్ప కార్యక్రమంలో పాల్గొన్నానని అన్నారు. ఉస్మానియా




ఒయు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, నగర సిపి సివి ఆనంద్, వైస్‌ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగరం తదితరులు

విశ్వవిద్యాలయ గాలికి, నేలకు వైబ్రేషన్ ఉంటుందని అవకాశం దొరికిన ప్రతి సందర్భం ఓయూలో గడిపేందుకే ఇష్టపడుతానని అన్నారు. ఈ చెట్ల కిందే ఎన్నో పాటలు రాసిన సందర్భాన్ని గుర్తు చేశారు. జై భోలో తెలంగాణ... జనగర్జనలో జడివాన అంటూ తెలంగాణ ఉద్య మంలో ఉర్రూతలూగించిన తన పాటన మరో సారి పాడటంతో విద్యార్థులంగా గొంతు కలిపారు. తాను రాసిన జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం తెలంగాణ రాష్ట్ర గీతం కావటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారి, కమిషనర్ కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఓయూకు అవసరమైన సహకారాన్ని అందిం చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెందర్ కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ లావణ్య, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, కార్యక్రమ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కొండా నాగేశ్వర్‌రావు సహా ఇతర సీనియర్ అధ్యాపకులు, ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఐదువేల టన్నుల విధ్వంసక నౌకను ప్రారంభించిన కిమ్‌జోంగ్

**ప్యాంగ్‌యాంగ్, ఏప్రిల్ 26:** ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ 5 వేల టన్నుల సామర్థ్యమున్న విధ్వంసక నౌకను ప్రారంభించారు. అమెరికాతో సహా దాని మిత్రపక్షాలు సంయుక్తంగా సైనిక విన్యాసాలు, క్షిపణి ప్రయోగాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు కిమ్ తన అణుసామర్థ్యాలను పెంచుకొంటున్నట్లు కనిపిస్తోంది. నాంపోలని పశ్చిమ పోర్టులో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగినట్లు అక్కడి మీడియా కథనాలు వెల్లడించాయి. అందులో 5 వేల టన్నుల సామర్థ్యం కలిగిన విధ్వంసక నౌకను కిమ్ ప్రారంభించారు. ఉత్తర కొరియా తన నౌకాదళాన్ని బలోపేతం చేసుకోవడంలో ఇది మరో పెద్ద ముందడుగని మీడియా సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో కిమ్‌జోంగ్ మాట్లాడుతూ.. అణు సామర్థ్య బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో సహా వివిధ ఆయుధ వ్యవస్థలను నిర్వహించడానికి దీన్ని రూపొందించినట్లు తెలిపారు. దీన్ని వచ్చే యేడాది ప్రారంభంలో నౌకాదళానికి అప్పగించనున్నట్లు ఆయన వెల్లడించారు. దక్షిణ కొరియాతో కలిసి అమెరికా అణ్వాస్త్ర వ్యూహాలకు పదును పెట్టడాన్ని ఖండించిన ఆయన.. అవి యుద్ధానికి సన్నాహాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ భౌగోళిక రాజకీయ సంక్షోభం, పరిణామాలపై నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఇక, కిమ్ ప్రారంభించిన యుద్ధ నౌకను గురించి దక్షిణ కొరియా ఇప్పటివరకు ఏ ప్రకటనా చేయలేదు. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో కిమ్ చర్య ఆందోళన కలిగిస్తోంది.

2019లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కిమ్‌లు భేటీ అయ్యారు. ఆ సమయంలో అణ్వాయుధాలు వదిలే విషయంలో జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. దీంతో వీరి మధ్య దూరం పెరిగింది. బైడెన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అది మరింత ముదిరింది. ఈ క్రమంలో ఇటీవల అగ్రరాజ్యంపై కిమ్ వైఖరి కఠినంగా మారింది. ట్రంప్‌తో ఎలాంటి వ్యక్తిగత దౌత్యాలు నడపకూడదని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. కిమ్‌తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. కిమ్ ఒక న్యూక్లియర్ పవర్ అని కొనియాడారు. మరోవైపు.. దక్షిణ కొరియా-అమెరికా సైనిక విన్యాసాలు, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలతో కొరియా ద్వీపకల్పంలో నిత్యం ఉద్రిక్త వాతావరణమే ఉంటుంది. ద.కొరియా-యుఎస్ సైనిక విన్యాసాలను తమపై దాడికి సన్నాహంగా కిమ్ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ద.కొరియాలోని బుసాన్ పోర్టులో అమెరికాకు చెందిన విమాన వాహక నౌకను మోహరించారు. ఇది కిమ్ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. ఈ క్రమంలోనే కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ అగ్రరాజ్యం రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరికలు చేశారు.

# కాళేశ్వరం ఇఎన్‌సి హరిరామ్ అరెస్ట్

## రిమాండ్‌కు తరలింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** కాళేశ్వరం స్కాం దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. కాళేశ్వరం మాజీ ఈఎన్‌సి హరిరామ్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ రిమాండ్‌కు తరలించింది. ఆయనపై ఏసీబీ అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. హరిరామ్ కుటుంబం పేరు మీద గజ్వేల్‌లో భారీగా చట్ట విరుద్ధమైన ఆస్తులను ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సి హరిరామ్,అతని బంధువుల ఇండ్లలో 14 చోట్ల సోదాలు చేసింది. నగరంలోనే షేక్‌పేట్,కొండాపూర్ ప్రాంతాల్లో విల్లాలు,శ్రీనగర్‌కాలనీ నార్సింగి,మాదాపూర్ ఏరియాల్లో కాళేశ్వరం ఈఎన్‌సి వారి రామ్‌పేరిట ఫ్లాట్స్‌ను ఏసీబీ అధికారులు గుర్తించారు. తెలంగాణలోనే కాదు ఏపీ రాజధాని అమరావతిలో కూడా హరిరామ్ వాణిజ్య స్థలం కొన్నట్లు ఏసీబీ గుర్తించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి,పటాన్‌చెరులో 20 గుంటలు,శ్రీనగర్‌కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇండ్లు, 6 ఎకరాల మామిడితోట,ఒక ఫామ్‌హౌస్, కొత్తగూడెం, మిర్యాలగూడలో ఓపెన్ ప్లాట్లు... ఇది ఏసీబీ గుర్తించిన కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఆస్తుల చిట్టా. జిఎండబ్ల్యూ కారుతో సహా బంగారు ఆభరణాలు,పలు ఆస్తుల పత్రాలు,బ్యాంకు డిపాజిట్లు బయట పడ్డాయి. ఈఎన్సీ హరిరామ్‌పై ఇంకా ఏసీబీ దాడులు కొనసాగిస్తూనే ఉంటామని, ఆయన దగ్గర ఉన్న ఆస్తులు కోట్లాది రూపాయల విలువైనవని ఏసీబీ అధికారులు తెలిపారు. అధికారిక వాల్యూ కంటే అనధికారిక బహిరంగ మార్కెట్ వాల్యూ 10 రెట్లు ఎక్కువ అని ఏసీబీ పేర్కొంది. మొత్తంగా రూ.200 కోట్లకు పైగా ఆదాయానికి మంచిన ఆస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

# ఆక్టోపస్ నిఘాలో తిరుమల.. కొనసాగుతున్న తనిఖీలు

**తిరుమల,ఏప్రిల్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రనిఘావర్గాల ముందస్తు సమాచారంతో హిందువుల పుణ్యక్షేత్రం తిరుమలకు నాలుగంచెల భద్రత కొనసాగుతోంది. కొండపై జిఎన్‌సి టోల్‌గేట్ నుండి ఔటర్,ఇన్నర్ రింగురోడ్డులు పూర్తిగా ఆక్టోపస్ బలగాలు నిఘాలో ఉన్నాయి. తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్ ,ఆక్టోపస్ బలగాలు నిరంతరం తుపాకులతో పహారాకాస్తున్నారు. కొండంతా నాలుగువేలకుపైగా సిసికెమెరాలు నిఘా ఉంచడంతోబాటు పరిసరాలన్నీ పూర్తిగా భద్రతలవలయంలో ఉన్నాయి. మూడురోజుల క్రిందట జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడితో హిందూపుణ్యక్షేత్రం తిరుమలలో హైఅలర్ట్ కొనసాగుతోంది. తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రం నుండి రెండో,మొదటి ఘాట్‌రోడ్లు పూర్తిగా బాంబుడిస్పోజల్ పోలీసులు, ఆర్మ్‌డ్‌రిజర్వు పోలీసులు, ఎస్‌టిఎఫ్ దళాలు తుపాకులతో, పోలీసు జాగిలాలతో కొండక వస్తున్న ప్రతి భక్తుడిని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగాతనిఖీ చేసి పంపుతున్నారు. అనుమానం కలిగితే ఘాట్‌రోడ్లపై మధ్యలోనే ఆపివేసి తనిఖీలుచేస్తుండటం భద్రతను అప్రమత్తం చేసింది. తిరుమలకు ప్రదాన ప్రవేశమార్గం అలిపిరి టోల్‌గేట్‌లో భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మరింత నిశితంగా యాత్రికుల లగేజీలు, వాహనాలను, యాత్రి కులను తనిఖీ చేస్తున్నారు.

# 108 యేళ్లలోకి అడుగుపెట్టిన ఒయు

## మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:**ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం 107 సంవత్సరాలు పూర్తి చేసుకుని 108 సంవత్సరాలలోకి అడుగు పెట్టబోతున్నదని ఆర్ట్స్ కళాశాల మాజీ అధ్యక్షుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతం నుంచి వర్తమానం వరకు అవలోకనం చేసుకొని భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాల్సిన ఒక చారిత్రాత్మక అవసరం ఉందని పేర్కొన్నారు. ఉన్నతమైనటువంటి ఆశయంతో అత్యంత దూరదృష్టితో హైదరాబాద్ రాష్ట్ర ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఏప్రిల్ 26న 1917 సంవత్సరంలో స్థాపించారని గుర్తు చేశారు. భారతదేశ ఉన్నత విద్యారంగంలో ఈ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనేక సంవత్సరాలుగా దక్షిణ భారతదేశంలో మూడవ ప్రాచీన ఉన్నత విద్యాలయ సంస్థగా స్థానం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప విద్యా వారసత్వమున్న మన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆ విశ్వవిద్యాలయంలో చదువుకున్నటువంటి ప్రతి విద్యార్థికి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విశ్వ విద్యాలయం నుంచి ప్రపంచ వ్యాప్తంగా దేశవ్యాప్తంగా అనేక రంగాల్లో రాణిస్తున్నటువంటి వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజలే కేంద్రంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం

## భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** తెలంగాణ ప్రభుత్వం పక్షాన భారత్ సమ్మిట్‌కు దేశ, విదేశ ప్రతినిధులందరినీ ఆహ్వానించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భారీ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ =లో నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం హెచ్‌ఐసిసిలో భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మా ప్రభుత్వం వచ్చిన మొదటిరోజు నుంచే ప్రజలు కేంద్రంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం, వారే కేంద్రంగా పరిపాలన సాగిస్తున్నామని తెలిపారు. అణగారిన, పేద వర్గాల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు.మా ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు చెప్పుకునేందుకు భారత సమ్మిట్ ఒక వేదిక మాత్రమే కాదు.. అనేక విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడిందన్నారు. అహింస, స్వతంత్రం, శాంతి...మా నాయకుడు రాహుల్‌గాంధీ విజన్ న్యాయం వంటి అంశాలను గ్రహించామన్నారు. ఇప్పటికే వీటిని కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మా పాలసీలు, పథకాలు, ఆలోచనల్లో వీటిని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని తెలిపారు.




# వరంగల్ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది

## టెలీకాన్ఫరెన్స్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** రాష్ట్ర రాజకీయాల్లో వరంగల్ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓరుగల్లు వేదికగా ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా తెలంగాణ సబ్బండవర్గాల ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించి కదలిరావాలని సూచించారు. పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక సభ కావడంతో సభకు హాజరయ్యే వారంతా గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి సభకు తరలిరావాలనే ఉత్సాహం ప్రజల్లో పెద్ద ఎత్తున ఉందని, వారందరినీ సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్టీ సిల్వర్ జూబ్లీ సభకు తరలివచ్చే ప్రతి వాహనానికి అన్ని వైపులా గులాబీ జెండాలు కట్టుకుని ఉత్సాహంగా బయలుదేరాలని సూచించారు. ఎండల వల్ల ఇబ్బంది లేకుండా ప్రతి బస్సులో మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన వసతులకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ నలువైపుల నుంచి తరలివచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఇప్పటికే రూట్ మ్యాప్ పంపించామని, దానికి అనుగుణంగానే ఆయా రూట్లలో సభ స్థలికి చేరుకోవాలని చెప్పారు. సభా ప్రాంగణానికి 30 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్లపై ఎక్కడ వాహనాలు నిలపరాదని, నేరుగా సూచించిన పార్కింగ్ స్థలాలకు చేరుకొని వాహనాలను నిలపాలని సూచించారు. అనేక ప్రాంతాల్లో పార్టీ వాలంటీర్లు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడానికి సిద్ధంగా ఉంటారని తెలిపారు. సభకు చేరుకునే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి చోట మంచినీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. చారిత్రక సభలో కేసీఆర్ గారి ప్రసంగంపై అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొని ఉందని, రాష్ట్ర రాజకీయాల్లో ఈ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఉగ్రవాద దాడి బాధితులకు ఎల్ఐసి సడలింపులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు ఎల్ఐసీ సడలింపులు ప్రకటించింది.ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో అమాయక పౌరులు మరణించడం పట్ల ఎల్ఐసీ ఆఫ్ ఇండియా తీవ్ర విచారం వ్యక్తం చేసింది. బాధితులైన వారికి మద్దతు ఇవ్వడానికి, ఆర్థిక ఉపశమనం అందించడానికి క్లెయిమ్ పరిష్కారాలను వేగవంతం చేయనున్నట్లు ఆ సంస్థ సిఇఒ, ఎండి సిద్ధార్థ మొహంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలసీల హక్కుదారుల కష్టాలను తగ్గించడానికి అనేక రాయితీలను ప్రకటించారు. ఉగ్రవాద దాడిలో మృతి చెందినట్లు మరణ ధృవీకరణ పత్రాలకు బదులుగా, ప్రభుత్వ రికార్డులలోని ఏదైనా ఆధారాలు పాలసీదారు మరణించినట్లు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన ఏదైనా పరిహారాన్ని మరణ రుజువుగా అంగీకరించబడుతుందన వెల్లడించారు. హక్కుదారులను చేరుకోవడానికి మరియు క్లెయిమ్‌లు బాధిత కుటుంబాలకు త్వరగా పరిష్కరించబడతాయని నిర్ధారించడానికి అన్ని ప్రయత్నాలు చేయబడతాయన్నారు. తదుపరి సహాయం కోసం హక్కుదారులు సమీపంలోని ఎల్ఐసీ బ్రాంచ్, డివిజన్, కస్టమర్ జోన్‌లను సంప్రదించవచ్చని, అలాగే హక్కుదారులు మా కాల్ సెంటర్ 022 68276827 కు కూడా కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

# ప్రపంచంలో శాంతిని కోరుతూ హైదరాబాద్ తీర్మానం విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:**హెచ్‌ఐసిసిలో రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్‌లో శాంతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునేవారు(గ్లోబల్ జస్టిస్) ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగిన వారు 8 ప్యానెల్స్‌గా చర్చల్లో పాల్గొన్నారు. దాదాపు 100 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. చర్చించిన వాటిల్లో 44 అంశాలతో కూడిన హైదరాబాద్ తీర్మానం పత్రాన్ని(ఐదు పేజీలు) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, దేశ,విదేశీ ప్రతినిధులు కలిసి విడుదల చేశారు.

# షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు భూకేటాయింపులపై సమగ్ర విచారణ చేయండి

## ఎపి డిసిఎం పవన్‌కళ్యాణ్

**విజయవాడ,ఏప్రిల్26,ప్రభాతవార్తప్రతినిధి:** షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని ఆరోపణలపై విచారణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు, విచారణం శాలపై తక్షణం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. షిరిడీ సాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా గాలికి వదిలేశారని, అటవీ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించి కేటాయింపులు జరిపారనే అభియోగాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ దృష్టిపెట్టారు.ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపైనా వివరాలు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. తిరుపతిలోని శేషాచలం అడవులకు ఆనుకుని ఉన్న ఉపాధ్యాయనగర్ గ్రాండ్ వాల్ట్ రోడ్డులో అటవీ సరిహద్దు కంచె ధ్వంసం కావడంతో వన్య ప్రాణులు దప్పిక కోసం, తిండి కోసం బయటకు వస్తూ ప్రాణాపాయ పరిస్థితిలోకి వెళ్తున్నాయని కథనాలపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి అటవీ, బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ పరిధిలో ఉన్న ఫెన్సింగ్‌కు



తగిన మరమ్మ తులు చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు. శేషా చలం పరిధిలో మానవ ఆవాసాలకు అనుసంధానం అయిన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నీటి తొట్టెల ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే వన్యప్రాణుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శేషాచలం పరిధిలో ఉన్న కంచె పాడవడానికిగల కారణాలను తెలియజేయాలని ఆదేశించారు.దివ్యారామం చెట్లు నరికేయడంపై పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. తిరుపతిలో శేషాచలం అడవుల పరిధిలో అటవీ శాఖ అత్యంత సుందరంగా నిర్మించిన దివ్యారామం క్షేత్రంలో జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా చెట్లు నరికే యడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధం గా వ్యవహరించడంపై తిరుపతి దివ్యారామంలో చెట్లు నరికి వేతలో నిబంధనల ఉల్లంఘనపై విచారణ అధికారిగా పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావును నియ మిస్తూ అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము ఉత్తర్వులు జారీ చేశారు.

# మే 11నుండి తిరుచానూరు పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



**తిరుమల,ఏప్రిల్ 26ప్రభాతవార్తప్రతినిధి:చి** చిటిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మా వతి అమ్మవారి ఆలయంలో మేనెల 11వతేదీ నుండి 13వరకు మూడురోజులు వసం తోత్స వాలు నిర్వహిం చిచనున్నారు. మే నెల 10వతేదీ సాయంత్రం అంకురార్పణ జరుగు తుంది. భక్తులు 150 రూపాయలు చెల్లించి ఒక్కొక్కరు వసంతోత్స వంలో పాల్గొనవచ్చు. వసంతోత్స వాల్లో భాగంగా మేనెల 12వతేదీ ఉదయం 9.45గంటలకు అమ్మవారి స్వర్ణరథోత్స వం నిర్వహిస్తారు. వసంతోత్స వాలు జరిగే మూడురోజులు మధ్యాహ్నం 2.30గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్స వర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి అమ్మవారి ఉత్స వమూర్తి ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఊరేగుతారు. కాగా మేనెల 6వతేదీ అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభలో హరీశ్‌కు దక్కని ప్రాధాన్యం



## కావాలనే పక్కకు పెడుతున్నారని సోషల్ మీడియాలో వైరల్

**వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు జరిగే రజతోత్సవ సభ కు హరీష్ రావుకు పార్టీ ప్రాధాన్యత ఇవ్వడం లేదనేది గత వారం రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గత నెల రోజుల నుంచి ఎంతో అట్టహాసంగా హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి లో భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ప్రతిష్టత్మంగా చేపడుతున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి పార్టీలో నంబర్ 2 పొజిషన్ లో ఉన్న హరీష్ రావును పక్కకు పెడుతున్నారని బహిరంగ సభ ఏర్పాట్లలో హరీష్ రావుకు ప్రాధాన్యత దక్కడం లేదని గత వారం రోజులుగా ప్రతిపక్ష నాయకులతో పాటు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ గా మారుతున్నాయి.. బిఆర్ఎస్ శ్రేణులు ఈ వార్తలను కొట్టి పారేస్తున్న జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తే ఆ వార్తలు నిజమే అనిపిస్తున్నాయి..2001లో టిఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటినుండి నేటి వరకు దాదాపు 25 సంవత్సరాలు పార్టీ అధినేత కేసిఆర్ తో కలిసి నడిచి 14 సంవత్సరాల ఉద్యమం మరో పది సంవత్సరాలు తెలంగాణలో అధికారంలో ఉన్న బి ఆర్ఎస్ పార్టీకి ప్రతి ఎన్నికల్లో ట్రబుల్ షూటర్ గా పేరు తెచ్చుకున్న హరీష్ రావు గత 16 నెలలుగా పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా అటు అసెంబ్లీ లోను ఇటు ప్రజాక్షేత్రంలోనూ అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్న హరీష్ రావుకు ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ సభకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్పష్టంగా అర్థమవుతుంది... ప్రధానంగా సభ వేదిక దగ్గర ఏర్పాటుచేసిన మీడియా పాయింట్ వెనకాల ఉన్న ఫ్లెక్సీలో కేవలం కెసిఆర్, కేటీఆర్ ఫోటో మాత్రమే ఉంది.. .

## నిరుత్సాహంగా హరీశ్‌రావు వరంగల్ పర్యటన..

శనివారం వరంగల్ పర్యటనలో కూడా హరీశ్‌రావు ముభావంగానే కనిపించాడు. ఉదయం 10 గంటలకు వరంగల్ చేరుకున్న హరీశ్‌రావు హనుమకొండలో ఒక ప్రైవేటు ఫంక్షన్ కి హాజరై సభ వేదిక వద్దకు చాలా ఆలస్యంగా చేరుకున్నారు. వేదిక దగ్గర ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కూడా జిల్లా బిఆర్ఎస్ నాయకులతో అంటీ ముట్టనట్లే ఉన్నారు..

# నాయీబ్రాహ్మణుల వేతనం పెంపుతో పూజలు



**తిరుమల,ఏప్రిల్ 26ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడితోబాటు ఇతర దేవాలయాలలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణుల జీతాలను భారీగా పెంచుతూ రాష్ట్రప్ర భుత్వం నిర్ణయం తీసుకోవడంతో తిరుమల, తిరుపతిలోని నాయీబ్రా హ్మణుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం నాయీబ్రా హ్మణుల పెంచిన వేతనాలు 25వేల రూపాయలు విడుదల చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,దేవాదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద కల్యాణకట్ట నాయీబ్రాహ్మణుల సంఘం కార్యదర్శి జి.ప్రసాద్, అధ్యక్షుడు శ్రీహరి, శేఖర్, గిరిధర్, కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారని తెలిపారు.

# రిమాండ్ ఖైదీ మృతి

## చోరీ కేసులో అరెస్ట్ చేసిన ముస్తాబాద్ పోలీసులు

## అర్ధరాత్రి అపస్మారక స్థితిలోకి..

## హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీ మృతిచెందిన ఘటన సంచలనం సృష్టించింది.రెండు రోజుల క్రితం చోరీ కేసు లో సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.వివరాలిలా ఉన్నాయి. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాబుల్లా కూలి చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఈ నెల 18 న ఐ కె పి సెంటర్ లో ట్రాక్టర్ చోరీ జరిగింది. అందులో నిందితునిగా షాబుల్లా తో పాటు అతని బావమరిది మరొకరిని ముస్తాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలు కు తరలించారు.జైలు లో ఉన్న షాబుల్లా 23నా అస్వస్థతకు గురి కావడంతో జైలు అధికారులు చికిత్స చేయించారు.అనంతరం షాబుల్లా ను అతని బావమరిది ఒకటే బరాక్ లో ఉంచినట్లు జైలు అధికారులు చెప్తున్నారు.అయితే శుక్రవారం రాత్రి షాబుల్లా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఎస్కార్ట్ సిబ్బంది సహకారంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే అతను మృతి చెందడంతో వెంటిలేటర్ పై ఉంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు చేరుకున్న తర్వాత జైలు సిబ్బంది షాబుల్లా మృతి చెందినట్లు తెలపడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.జైలు సిబ్బంది నిరక్ష్యం,పోలీస్ అధికారుల ఇంటరాగేషన్ వల్లే మృతి చెందాడని ఆరోపించారు.కుటుంబ సభ్యుల ఆందోళనతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.జైలు అధికారులు మాత్రం నిందితుడు ఆల్కహాలిక్ అని జైలు కు వచ్చిన తర్వాత అనారోగ్యానికి గురయ్యాడని చికిత్స కూడా చేయించినట్లు తెలిపారు.అయితే రిమాండ్ ఖైదీల ఆరోగ్యం విషయంలో సమాచారం ఇవ్వడం ద్వారా బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉన్న జైలు అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు దారి తీస్తుంది.పైగా నిందితులకు



శుక్రవారం బెయిల్ కూడా మంజూరు కాగా శనివారం ఉదయం బెయిల్ ఉత్తర్వులు జైలు కు అందినట్లు సమాచారం.రిమాండ్ సమయంలో పోలీసులు మెడికల్ చేయించి కోర్టు లో హాజరు పరుస్తారు.నిందితుని ఆరోగ్య పరిస్థితిపై వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు ఎందుకు క్లియరెన్స్ ఇచ్చారో అర్థం కాకుండా ఉంది.జైలు కు వచ్చిన తర్వాత అనారోగ్యానికి గురైతే డాక్టర్లు మెడికల్ సమయంలో ఎందుకు గుర్తించలేకపోవడం అనేది పోలీస్, వైద్య శాఖ సిబ్బంది పరస్పర సహకారాన్ని బయటపడుతుంది. ఏది ఏమైనప్పటికీ బెయిల్ పై ఇంటికి వెళ్లాల్సిన వ్యక్తిని పోలీస్,జైలు, వైద్య శాఖ సిబ్బంది తిరిగిరాని లోకాలకు పంపించడంతో ఆ కుటుంబంకు తీరని ఆవేదన మిగిల్చింది.

# వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల,ఏప్రిల్ 26 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులతో బాటు వారాంతపుకావడం,శని ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. శనివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి సర్వదర్శనానికి శనివారం మధ్యాహ్నానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఐదుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. వేసవిసెలవులు కూడా కావడంతో రద్దీ విపరీతంగా ఉంది. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఒక్కోవాహనం క్షుణ్ణంగా తనిఖీకి 15నిమిషాలు సమయం పడుతోంది. టోల్‌గేట్ తనిఖీలకు ఉదయం నుండి వాహనాలు బారులుతీరాయి.

# తలసేమియా బాధితుల కోసం మే 8న 3కె, 5కె, 10కె రన్

తలసేమియా బాధితులకు అండగా ఉంటామన్న భరోసా కల్పిద్దామని పిలుపునిచ్చారు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి. ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రెస్ మీట్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ, మా ఆహ్వానాన్ని మన్నించి ఈ ప్రెస్ మీట్‌కి విచ్చేసిన మీడియా వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఎస్ఎస్ తమన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు. ఫిబ్రవరి 15న విజయవాడలో జరిగిన మ్యూజికల్ నైట్ లో తలసేమియా సెంటర్‌ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాము. 25 బెడ్డుల కెపాసిటీతో ఈ వ్యాధి బాధితుల కోసం 25 పడకలతో తలసేమియా సెంటర్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ఈవ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి నెలా రక్త మార్పిడి చేయాలి. అది జరగకపోతే ప్రాణాలకే ముప్పు. అలాగే వారు వాడే మందులు కూడా చాలా ఖర్చు అవుతుంది. మనం చేసే గొప్ప సేవ రక్తదానమే. అందరూ 4 నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరుతున్నాం. ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య, విపత్తు నిర్వహణ, ఉపాధి కల్పన వంటి కార్యక్రమాలు చేస్తున్నాం. తలసేమియా బాధితుల కోసం మే 8న విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో 3కె, 5కె, 10కె రన్ నిర్వహిస్తున్నాం. ఇందులో పాల్గొని తలసేమియా బాధితులకు అండగా ఉంటామన్న భరోసా కల్పిద్దాం. ఒక్క పరుగు వంద జీవితాల్లో వెలుగునిస్తుంది. ఈ రన్ కోసం వాళ్ళ కోసం ఎన్నో కిలో మీటర్లు పరిగెత్తడానికి రెడీ. మీరందరూ కూడా రెడీ అయి ఈ రన్‌లో పాల్గొనాలని కోరుతున్నాను. అందరికీ కృతజ్ఞతలు అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మేడమ్ భువనేశ్వరి డెడికేషన్‌తో మ్యూజికల్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, లోకేష్ ముందు పెర్ఫామ్ చేయడం మెమరబుల్ ఎక్స్పీరియన్స్. తలసేమియా సెంటర్‌ని ప్రారంభించడం నాకు చాలా గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. చాలా హై ఇచ్చింది.

25 బెడ్డుల కెపాసిటీతో తలసేమియా బాధితుల కోసం 25 పడకలతో తలసేమియా సెంటర్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. తలసేమియా బాధితుల కోసం మే 8న విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో 3కె, 5కె, 10కె రన్ నిర్వహిస్తున్నాం. ఇందులో పాల్గొని



# 'సారంగపాణి జాతకం' సక్సెస్ సెలబ్రేషన్స్

సెన్సిబుల్ డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో సక్సెస్ ఫుల్ హీరో ప్రియదర్శి చేసిన చిత్రం సారంగపాణి జాతకం. శ్రీదేవి మూవీస్ బ్యానర్ మీద శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీలో రూపా కొడవయూర్ హీరోయిన్‌గా నటించారు. ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ, ప్రియదర్శి వెర్సటైల్ హీరో అని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. ఇప్పుడు ఆడియెన్స్ కూడా చెబుతున్నారు. శివలెంక కృష్ణ ప్రసాద్‌తో ఇది నా మూడో సినిమా. హ్యాట్రిక్ హిట్ అయినందుకు ఆనందంగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్లు, మెసెజ్‌లు చేస్తున్నారు. ఇంతలా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కి థాంక్స్. 20 ఏళ్లుగా నన్ను ఈ ప్రేక్షకులు ప్రేమిస్తూ, ఆదరిస్తూనే ఉన్నారు. మా సినిమాను బ్రహ్మరథం పడుతున్న ప్రేక్షకులకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఈ ప్రయాణంలో నాకు తోడు నిలిచిన నా టీంకు థాంక్స్. రూపా, వెన్నెల కిషోర్, వైవా హర్ష, శ్రీనివాస్ అవసరాల చివర్లో వచ్చి క్రెడిట్ తీసుకెళ్లిన తనికెళ్ల భరణి ఇలా అందరూ అద్భుతంగా నటించారు. ఇది సకుటుంబ సపరివారసమేతంగా చూడదగ్గ చిత్రం. ఇది థియేటర్లోనే చూడాల్సిన చిత్రం. మా సినిమా అద్భుతంగా ప్రారంభం అయింది. ఈ మూవీని మరింత పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ప్రియదర్శి మాట్లాడుతూ, మా సారంగపాణి జాతకం టీం కలిసి గెలిచింది. అంటే నేను కూడా గెలిచాను. వైజాగ్‌లో ప్రీమియర్లు వేసినప్పుడు ఫుల్ పాజిటివ్ వైబ్స్ వచ్చాయి. బుక్ మై షోలో మా చిత్రం ట్రెండ్ అవుతోంది. రివ్యూలు కూడా అద్భుతంగా వచ్చాయి. మా సినిమాను ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్. సినిమా గెలిచింది.. మేం గెలిచాం అని అన్నారు. శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, సారంగపాణి జాతకం ఎప్పుడూ వాయిదా పడుతూనే ఉంది అంతా అన్నారు. కానీ సరైన టైంకి వచ్చిందని ఇప్పుడు అంటున్నారు. మా చిత్రానికి అద్భుతమైన స్పందన వస్తోంది. దినదినప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది. మౌత్ టాక్‌తో ఈ చిత్రం మరింత ముందుకు వెళ్తుందని అంతా అంటున్నారు. మా సినిమాకు మీడియా ఎనలేని ప్రోత్సాహాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఇంత ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థాంక్స్.



# బెస్ట్ ఫిల్మ్ కేటగిరీలో నామినేషన్ పొందిన కిరణ్ అబ్బవరం 'క' మూవీ

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ "క" ప్రతిష్ఠాత్మక 15వ దాదాఫాల్కే ఫిలిం ఫెస్టివల్‌లో బెస్ట్ ఫిలిం కేటగిరీలో నామినేషన్ పొందింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ టీమ్ తమ హ్యాపీనెస్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. "క" సినిమాకు డెబ్యూ డైరెక్టర్స్ సుజీత్, సందీప్ రాసిన స్ట్రాంగ్ స్టోరీ, మ్యాజికల్ స్క్రీన్ ప్లే, సరికొత్త బ్యాక్ డ్రాప్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసింది. గతేడాది దీపావళికి రిలీజైన "క" సినిమా పెద్ద చిత్రాల పోటీని తట్టుకుని బ్లాక్ బస్టర్ విన్నర్‌గా నిలిచింది. ఈ సినిమాలో తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటించారు. "క" సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు.



# 'శర్వా 38'లో అనుపమ పరమేశ్వరన్

చార్మింగ్ స్టార్ శర్వా తన మేడిన్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ శర్వా 38ని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కొలాబరేషన్ శర్వా, దర్శకుడు సంపత్ నంది ఇద్దరికీ ఒక ముఖ్యమైన మైల్ స్టోన్‌ని చూస్తోంది. ఈ గ్రిప్పింగ్, హై-ఆక్టేన్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తారు. లక్ష్మీ రాధా మోహన్ సమర్పిస్తారు. ఈ చిత్రం హైబడ్జెట్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడుతుంది. ప్రీప్రొడక్షన్ విషయంలో కూడా టీం చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ చిత్రంలో వెరీ ట్యాలెంటెడ్ అనుపమ పరమేశ్వరన్ శర్వా సరసన హీరోయిన్‌గా నటించడానికి ప్రాజెక్ట్ లోకి వచ్చారు. పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు పేరుగాంచిన అనుపమ చేరిక సినిమా కథనానికి డెప్త్ జోడిస్తుంది. కథలో అనుపమ పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. అనౌన్స్ మెంట్ పోస్టర్ అనుపమను రగ్గడ్ ఇంటెన్స్ అవతార్‌లో 1960ల నాటి సినిమా వరల్డ్ కి సరిపోయేలా దుస్తులు ధరించి కనిపించారు. పోస్టర్ ఆమె పాత్ర కథాంశానికి తీసుకువచ్చే బలం, సంక్లిష్టత గురించి తెలియజేస్తోంది. 1960ల చివరిలో ఉత్తర తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులో సెట్ చేయబడిన శర్వా 38 ప్రేక్షకులను మరపురాని అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రం హైస్టేక్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. ఈ సినిమా కోసం శర్వా స్పెషల్‌గా మేకోవర్ అయ్యారు. శర్వా 38కి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు, సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సంపత్ నంది నిర్మాత: కేకే రాధామోహన్, బ్యానర్: శ్రీ సత్యసాయి ఆర్ట్స్ సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, డిఓపి: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె పిఆర్ఓ: వంశీ శేఖర్.



నభా నటేష్ నయా లుక్



# జార్జియా లొకేషన్స్ రెక్కీలో బోయపాటి శ్రీను పుట్టినరోజు వేడుకలు

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, రామ్ ఆచంట, గోపీ ఆచంట, 14 రీల్స్ ప్లస్, ఎమ్ తేజస్విని నందమూరి ప్రెజెంట్స్ అఖండ 2: తాండవం జార్జియా లొకేషన్స్ రెక్కీలో బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను పుట్టినరోజు వేడుకలు గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరిబాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హై యాంటిసిపేటెడ్ అఖండ 2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. వారి మునుపటి బ్లాక్ బస్టర్ అఖండకు ఈ సీక్వెల్ యాక్షన్, ఇంటెన్స్ నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ చిత్రాన్ని ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. ఈ చిత్రం నెక్స్ట్ షూటింగ్ షెడ్యూల్ జార్జియాలో జరగనుంది. ప్రస్తుతం దర్శకుడు బోయపాటి శ్రీను అక్కడ అద్భుతమైన ప్రదేశాల కోసం రెక్కీ చేస్తున్నారు, బాలకృష్ణ, ఇతర ప్రముఖ తారాగణం సభ్యులు పాల్గొనే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. జార్జియా సీనరిక్ బ్యూటీ నేపథ్యంలో ఈ సన్నివేశాలు ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటాయి. జార్జియాలో జరుగుతున్న రెక్కీల మధ్య బోయపాటి శ్రీను తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఇది సినిమా పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. హై బడ్జెట్‌తో భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో సంయుక్త ఫీమేల్ లీడ్‌గా కనిపించనుంది. సంగీత సంచలనం ఎస్ థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్, ఎడిటర్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్ వంటి అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. అఖండ 2 పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం దసరా పండగ సందర్భంగా సెప్టెంబర్ 25, 2025న థియేటర్లలోకి రానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, బ్యానర్: 14 రీల్స్ ప్లస్ సమర్పణ: ఎం తేజస్విని నందమూరి సంగీతం: థమన్ ఎస్, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్ ఎడిటర్: తమ్మిరాజు ఫైట్స్: రామ్‌లక్ష్మణ్ ఎఓపీ: వంశీ శేఖర్ మార్కెటింగ్: ఫస్ట్ షో.



# 'కాంత' ఫస్ట్ లుక్

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడిక్ ఫిల్మ్ మూవీ కాంత. అద్భుతమైన స్టార్ కాస్ట్, ఇంట్రస్టింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తూనే ఉంది. లీడ్ పెయిర్ దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సేల స్టన్నింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్లను రిలీజ్ చేసిన తర్వాత మేకర్స్ ఇప్పుడు ఈ చిత్రం నుండి మరొక ముఖ్యమైన పాత్రను పరిచయం చేశారు. వెరీ ట్యాలెంటెడ్ సముద్రఖని పుట్టిన రోజును పురస్కరించుకుని, టీం అతని ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. అద్భుతమైన మోనోక్రోమ్ ప్యాలెట్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్‌లో సముద్రఖని ఫెరోషియస్ అవతార్‌లో కనిపించారు. ఈ పోస్టర్ ఇది సినిమా కాల నేపథ్యాన్ని అద్భుతంగా చూపించింది. అతని ఇంటెన్స్ ఎక్స్ ప్రెషన్ తో ఫైలింగ్, అతని పాత్ర కథనంలోపవర్ ఫుల్ గా ఉండబోతుంది అని సూచిస్తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో వున్నాయి. కాంతా గొప్ప కథ, నటీనటులు, టెక్నికల్ టీంతో మస్ట్ వాచ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. సినిమా విడుదల తేదీ త్వరలో అనౌన్స్ చేయనున్నారు. తారాగణం: దుల్కర్ సల్మాన్, సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్ బ్యానర్లు: స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికృష్ణ గద్వాల్, సుజయ్ జేమ్స్ లైన్ ప్రొడ్యూసర్: శ్రవణ్ పాలపర్తి, డిఓపి: డాని శాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్టర్:రామలింగం రచయిత: తమిళ్ ప్రభ సంగీతం: ఝను చంతర్ ఎడిటర్: లెవెల్లిన్ ఆంథోనీ గోన్సాల్వేస్, కాస్ట్యూమ్ డిజైనింగ్: పూజిత తాడికొండ, అర్చనరావు, హర్మన్ కౌర్ పీఆర్వో: వంశీ శేఖర్.



# మే 9న 'సింగిల్' రిలీజ్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. మేకర్స్ మూవీ రిలీజ్ డేట్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. సింగిల్ మే9న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన హిస్టారిక్ డేట్ అనౌన్స్‌మెంట్ వీడియో అదిరిపోయింది. హీరో శ్రీవిష్ణు మే9న రిలీజైన కల్ట్ సూపర్ హిట్ మూవీస్ గురించి చెబుతుండగా చివర్లో నిర్మాత అల్లు అరవింద్ జైలర్ హుకుం స్టయిల్‌లో మే 9న రిలీజ్ డేట్‌ని లాక్ చేయడం ఇంట్రస్టింగ్‌గా వుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ అయ్యాయి. ఈ చిత్రంలో కేతికా శర్మ, ఇవానా ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్ విశాల్ చంద్ర శేఖర్. సినిమాటోగ్రఫీ ఆర్ వేల్ రాజ్, ఎడిటింగ్ ప్రవీణ్ కెఎల్. ఆర్ట్ డైరెక్టర్ చంద్రిక గొర్రెపాటి. నటీనటులు: శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిషోర్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: సమర్పణ: అల్లు అరవింద్, రచన, దర్శకత్వం: కార్తీక్ రాజు, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి బ్యానర్లు: గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్, సంగీతం: విశాల్ చంద్ర శేఖర్, డిఓపి: ఆర్ వెల్‌రాజ్ ఎడిటర్: ప్రవీణ్ కెఎల్, డైలాగ్స్: భాను భోగవరపు నందు సవిరిగాన, ఆర్ట్: చంద్రికా గొర్రెపాటి, కాస్ట్యూమ్ డిజైనర్: ఆయేషా మరియం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె డైరెక్షన్ టీం: రామ నరేష్ నున్న, ప్రసన్న నెల్లెం, శంకర్ కొత్త, సాయి కిరణ్ కట, సువర్ణ సుంకర, సందీప్ హర్ష, సుబ్బారెడ్డి పీఆర్వో: వంశీశేఖర్ మార్కెటింగ్: విష్ణు తేజ్ పుట్ట.



# 'హిట్: ది థర్డ్ కేస్' నుంచి సాంగ్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్: ది థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ చిత్రం, టీజర్, ట్రైలర్ పాటలతో విడుదలకు ముందే దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మేకర్స్ తను అనే స్పెషల్ సాంగ్‌ని విడుదల చేశారు. ఇది రొమాంటిక్, ఇంటెన్స్, పూర్తిగా ఒకే టేక్‌లో షూట్ చేశారు. మిక్కీ జె మేయర్ కంపోజిషన్, అనిరుధ్ రవిచందర్ వాయిస్ మెస్మరైజ్ చేశాయి. రాఘవ్ రాసిన సాహిత్యం నాని పాత్ర భావోద్వేగాలను డీప్‌గా చూపిస్తుంది. సినిమాలోని క్రైమ్ వరల్డ్ నేపథ్యానికి భిన్నంగా ఉండే సున్నితమైన విజువల్స్ కట్టిపడేశాయి. శ్రీనిధి శెట్టి పాత్రను కలవడానికి వెళ్తున్న నానిని హ్యాపీ మూమెంట్ లో చూడటం, కేఫ్ రీయూనియన్ సన్నివేశం మనసును ఆకట్టుకుంది. సాను జాన్ వర్గీస్ కెమెరా వర్క్ ప్రతి విజువల్‌ని మ్యాజికల్‌గా ప్రజెంట్ చేసింది. ఈ చిత్రానికి కార్తిక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్. 'హిట్: ది థర్డ్ కేస్' మూవీ మే 1న పాన్ ఇండియాగా విడుదల కానుంది. తారాగణం: నాని, శ్రీనిధి శెట్టి సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, బ్యానర్లు: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్, డీఓపీ: సాను జాన్ వర్గీస్ సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తిక శ్రీనివాస్ ఆర్



ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు, చీఫ్ కో డైరెక్టర్: వెంకట్ మద్దిరాల కాస్ట్యూమ్ డిజైనర్: నాని కమరుసు, ఎస్ఎఫ్ఎక్స్: సింక్ సినిమా విఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్: విఎఫ్ఎక్స్ డిటిఎం: డిఐ: బి2హెచ్ స్టూడియోస్, కలరిస్ట్: ఎస్ రఘునాథ్ వర్మ, పీఆర్వో: వంశీ శేఖర్ మార్కెటింగ్: ఫస్ట్ షో.

# పిల్లలకు డబ్బు విలువ తెలపాలి



చాలామంది తల్లిదండ్రులు పిల్లలు కోరిన వెంటనే అడిగినవి సమకూరుస్తున్నారు. పిల్లల్ని అలా పెంచడమే గొప్ప అని ఫీలవుతున్నారు. తాము పడిన ఇబ్బందులు తమ పిల్లలు పడకూడదని భావిస్తున్నారు. అయితే పిల్లలకు ఇలా అవసరాలకు మించిన సౌకర్యాలను కల్పించడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కష్టం విలువ తెలియకుండా పెంచడం వల్ల వారిలో సర్దుకుపోయే స్వభావం తగ్గిపోతుందని చెబుతున్నారు. ఇలాగే పెరిగితే వారి భవిష్యత్తుపైనా ప్రభావం పడుతుందని అంటున్నారు. పిల్లలు అడగకముందే అన్ని కొనివ్వడం కాదు. వాళ్ల అడిగింది కొనివ్వడానికి కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. అది చిన్న ఆటబొమ్మ అయినా పెద్ద వస్తువైనా అవసరమైతేనే తీసుకోవాలి. అది కూడా కొన్ని షరతులు విధించి మరీ అందివ్వాలి. పిల్లలు కోరిన వస్తువు దక్కాలంటే వారికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించాలి. ఇంటి పనులు చేసి పెట్టడమో పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడమో ఇలాంటి టార్గెట్లు విధించాలి. వాటిని పూర్తి చేస్తేనే ఆయా వస్తువులు కొనిస్తామని చెప్పాలి. అప్పుడే ఏదైనా కావాలంటే కష్టపడాల్సిందే అన్న విషయం పిల్లలకు అర్థమవుతుంది. ఇక కొందరు పిల్లలు మరీ మంకుపట్టు పడుతుంటారు. తమకు అవసరం లేదని తెలిసినా కొనివ్వాల్సిందేనని భీష్మించుకుంటారు. వారి అల్లరి భరించలేకో, ఏడుపు ఆపాలనో కొనివ్వడం మొదలుపెట్టారో వాళ్ల దాన్నే అలుసుగా తీసుకుంటారు. మీ బలహీనతను తమకు అనుకూలంగా మలుచుకుంటారు. అందుకే, ఇలాంటి సందర్భాల్లో ఖచ్చితంగా నో చెప్పేయండి! ఏడ్చినా, మంకుపట్టుపట్టినా కొద్దిసేపే ఉంటుంది. మరీ శ్రుతిమించితే వారికి అవసరమైన వేరే వస్తువును కొనివ్వండి. ఖరీదైన వస్తువుల విషయంలోనూ ఇదే విధంగా ఉండండి. తక్కువధరలోనూ ఎక్కువ సంతృప్తిని ఇచ్చే విధానాలను వారికి పరిచయం చేయాలి. అప్పుడే పిల్లలకు డబ్బు విలువ, జీవితం విలువ తెలిసొస్తుంది.

# అతిశయం మంచిది కాదు!



'అతిశయించువాడు దేనినిబట్టి అతిశయింపవలెననగా, భూమి మీద కృపచూపుచు నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలిసికొనుటనుబట్టియే అతిశయింపవలెను, అట్టి వాటిలో నేనానందించువాడనని యెహోవా సెలవిచ్చుచున్నాడు' (యిర్మీయా 9:24). కొందరు తమ తెలివితేటల్ని బట్టి, మరికొందరు తమ ఆస్తిఅంతస్తులనుబట్టి, ఇంకొందరు హోదాను బట్టి అతిశయిస్తుంటారు. నిజమే తమకు అన్ని కలిగినప్పుడు వాటి విషయంలో గర్విస్తుంటారు. సమాజంలో తామే గొప్పవారంగా భావిస్తుంటారు. కానీ భూమిపై కృపను చూపిస్తూ, నీతిన్యాయాలను జరిగించే దేవుడిని బట్టి మనం అతిశయించాలని దేవుడి కోరిక. అసలు దేవుడు మనల్ని జ్ఞాపకం చేసుకోవడమే గొప్ప ధన్యత. ఇలాంటి దేవుడిని మనం ఆరాధిస్తూ, ఆయన నీతిలో జీవించడం బట్టి దేవుడు సంతోషించేవాడుగా ఉన్నాడు. కానీ మనం చాలాసార్లు మనకున్న తలాంతులను బట్టి అతిశయించేవారంగా, ఇతరులను తృణీకరించేవారంగా ఉంటాం. మన నీతిక్రియలు మురికిపేలికలు వంటివి. అయినా ఆ మురికిలోనే మునిగితేలిపోతుంటాం. దేవుడిని పరిశీలించం. ఆయన గుణగణాలను ధ్యానించం. అవును మనల్ని మనం చూసుకుంటే ఎలాంటి మార్పు ఉండదు. కానీ దేవుడి నీతిలో, న్యాయంలో నిత్యం మనల్ని మనం పరిశీలించుకుంటే, దేవుడి భక్తిలో వృద్ధి చెందగలం. ఎంతైనా మనల్ని మనం తగ్గించుకుంటాం. అతిశయించే మనసుభావనకు ఏమాత్రం చోటు ఇవ్వం. నిత్యం దేవుడిని క్షమాపణలు వేడుకుంటూ, మంచి విశ్వాసంలో జీవించగలం.

అందుకే మన కన్నులు ఎప్పుడూ దేవుడిపై ఉంచాలి. మనసులో ఆయనను ఆరాధిస్తూ ఉండాలి.

ఇలాంటివారి విషయంలో దేవుడు సంతోషిస్తాడు. ఈవిధంగా జీవిస్తూ, మనమూ అన్ని విషయాల్లో వృద్ధి చెందుదాం.

- పి.వాణిపుష్ప

అంత ర్వాణి

# చాక్లెట్లలో పోషకాలు



చాక్లెట్ పేరు చెబితే చిన్నా, పెద్దా ఎవరికైనా నోరూరుతుంది. కానీ తిన్న తర్వాతే, మనసులో ఎక్కడో చిన్న ఇబ్బంది మొదలవుతుంది. అందులో చక్కెరలూ, కెలోరీలు గుర్తొచ్చి, ఆరోగ్యానికి మంచిది కాదేమో అనిపిస్తుంది. ఇక నుంచి అలా ఆలోచించాల్సిన పనిలేదు. ఎందుకంటే చాక్లెట్‌లో మన జీర్ణ వ్యవస్థకి మేలు చేసేలా ప్రోబయాటిక్స్ రూపంలో అదనపు పోషకాలని కలుపుతున్నారు. మనదేశంలోని జెపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (జిట్) శాస్త్రవేత్తలు. అదేమంత కష్టమైన పని కాద్ను అని అనుకోవచ్చు. కాని పెరుగూ, మరి కొన్ని రకాల పులిసిన పదార్థాలు మాత్రమే లభించే ప్రోబయాటిక్స్ ఏ ఇతర పదార్థాలతో కలిపినా మారిపోతుంది... ఇష్టంగా తినలేరు. అలా కాకుండా ఉండేందుకు ప్రోబయాటిక్స్ మన పొట్టలోకి చేరి చక్కగా పని చేసేందుకు కొన్ని ప్రియాటిక్స్ కూడా కలిపి ఈ చాక్లెట్‌ని తయారుచేస్తున్నారు. ప్రోయబాటిక్స్‌ని ఆరోగ్యంగా ఉంచే ఆహారమే ఈ ప్రియాటిక్స్. పవర్ హౌస్‌గా మారిన ఈ చాక్లెట్లు అనేక అనారోగ్యాలకి చెక్ పెట్టడంతోపాటు, మునుపటి కంటే అధికంగా యాంటీ ఆక్సిడెంట్లని కలిగి రోగ నిరోధకశక్తిని పెంచుతాయిఅంటున్నారు.

# ఇన్‌ఫ్లమేషన్‌కు పచ్చని పదార్థాలు

శరీర భాగాల్లో తలెత్తే ఇన్‌ఫ్లమేషన్ లేదా మంటని తగ్గించేందుకు ఈ పసుపు పచ్చని పదార్థాలు ఎంతో సహాయ పడతాయి. ఇంకా మన శరీరం మీద ఏర్పడిన గాయాల్నీ ఇవి త్వరగా మాన్పుతాయి. సూపర్ ఫుడ్స్‌గా పిలిచే వీటిని తినడం వల్ల గుండెకు రక్తప్రసరణ బాగా అందుతుంది. చెడు కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. అందుకే గుండె జబ్బులొచ్చే అవకాశం తక్కువేనట. ఆరు నెల పాపాయికీ ఇచ్చే పోషకాలపండు అరటి. అందరికీ బాగా తెలిసిన ఈ పసుపు రంగు పండుతో విటమిన్లతో పాటు పొటాషియం కూడా అధికంగా వస్తుంది. దీంతో శరీరంలోని నాడీ వ్యవస్థ, కండరాలూ ఆరోగ్యంగా ఉంటాయి. ఇంకా రక్తపోటు నియంత్రణలో ఉంటుందట. ఆరోగ్యానికి అవసరమైన విటమిన్‌సికి ఎల్లో సూపర్ ఫుడ్స్ పెట్టింది. పేరు అని చెప్పొచ్చు. కమలాలూ, నిమ్మకాయలూ,



పైనాపిల్, పొడిబారకుండా ఉంటుంది. వీటితో కొలాజిన్ ఉత్పత్తి హృద్రోగాలకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను అడ్డుకుంటుంది. కమలా పండులోని పాలీఫినాల్స్.. వైరల్ ఇన్‌ఫెక్షన్లనీ రానీయవు. అందుకే తరచూ జలుబూ జ్వరంతో బాధ పడేవాళ్లకి ఇవి ఎంతో మేలు చేస్తాయి.

చిలగడ దుంపతోపాటు క్యారెట్లలోని బీటీ కెరొటిన్ -వృద్ధాప్య ఛాయల్ని త్వరగా రాకుండా అడ్డుకుంటాయి. నిత్యం రెండు ఎల్లో కివీ పండ్లను తింటే శరీరంలోని అధిక కొవ్వు తగ్గిపోతుంది. బంగారు వర్ణంలో నోరూరించే పనసని పండులా తినడమే కాకుండా కూరల్లోనూ భాగం చేస్తున్నారు. మసాలాల్ని పీల్చుకుని శాకాహారుల ఐస్‌క్రీము ల్లోనూ చేరి పోయింది. అన్ని చోట్ల డిమాండు రావడానికి కారణం అధిక పీచు, ప్రోటీన్లూ ఇంకా కాపర్, పొటాషియం లాంటి ఖనిజాలూ అందుతాయి. అంతే కాదు, ఇది రక్తంలోని చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుతుంది. టొమాటా, వంకాయ, క్యాప్సికమ్, బీన్స్, కాలీఫ్లవర్, యాపిల్ కివీ, పుచ్చకాయ, డ్రాగన్‌ఫ్రూట్ లాంటివీ పసుపు ఛాయతో దొరుకుతూ ఎన్నో పోషకాల్ని అందిస్తున్నాయి. పసుపు రంగు పండ్లూ కూరగాయల్ని యాంటీ ఆక్సిడెంట్ కారకం. ఇది రోగాల్ని దరిచేరనివ్వదు. వీటిల్లోని అధికపీచు బరువు తగ్గాలనుకునేవారికీ ఉపయోగపడు తుంది. పీచుతో జీర్ణరసాలు పెరిగి మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణాశయమూ ఆరోగ్యంగా ఉంటుంది ఈ ఆహారపదార్థాల్లోని కెరొటినాయిడ్స్ రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడతాయని ఎన్నో పరిశోధనల్లో బయట పడింది. ఇతర వాటితో పోలిస్తే ఈ రంగు పండ్లూ,కూరగాయల్లో సహజ చక్కెరలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందుకే ఇవి ఎనర్జీ బూస్టర్లుగా పని చేస్తూ రోజంతా చురుగ్గా ఉంటాయి. అందుకే ఇవి ఎనర్జీ బూస్టర్లుగా పని చేస్తూ రోజంతా చురుగ్గా ఉంచుతాయి. .విటమిన్ కె. మాంగనీస్‌లు అధికంగా ఉండే వీటిని రోజూ తీసుకోవడం వల్ల దంతాలు, ఎముకలు దృఢంగా ఉంటాయి. ప్రకాశవంతమైన ఈ పసుపు రంగు సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది. అందుకే ఈ పదార్థాల్ని తీసుకోవడం వల్ల మానసిక ఉల్లాసం కల్గుతుంది. ఒత్తిడీ తగ్గుతుందట. ఈ పసుపు రంగు పదార్థాలు వంటకాలకు చక్కని రంగుతోపాటు రుచినీ ఇస్తాయి. సలాడ్లు, సూపులతో పాటు పిజ్జా, పాస్తా ల్లాంటి వాటిల్లో గార్నిష్ చేయడానికి ఉపయోగిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే .. అరటి, బొప్పాయి లాంటి ఏడాది పొడవునా దొరికే పండ్ల దగ్గర్నుంచీ వేరు వేరు సీజన్లలో మాత్రమే అందుబాటులో ఉండే మామిడి, కమలా ల వరకూ రకరకాల పసుపు రంగు పండ్లనూ- దోసకాల, కాప్సికకం లాంటి ఎల్లో కలర్ కాయగూరల్నీ రోజూ తినే ఆహారంలో చేర్చుకున్నామంటే.. ప్లేటే కాదు మన ఆరోగ్యమూ కలర్‌ఫుల్‌గానే ఉంటుంది.

# మొక్కల ఎదుగుదలకు..

ఇళ్లల్లో మొక్కలు పెంచడం చాలా చోట్ల చూస్తున్నాం. ఇళ్ల చిన్నమైనప్పటికీ ఏవో ఒక మొక్కలను పెంచుతున్నారు. వీటిలో కొన్ని ఆలంకరణ కోసం అయితే, మరికొన్ని ఆరోగ్యం కోసం. మనల్ని సంరక్షించే ఈ మొక్కలను కాపాడేందుకు సహజ ఎరువులను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.



✓ ఇంట్లో అరటి పండ్లు తిన్న తొక్కలను ముక్కలుగా కోసి ఒక బకెట్ లేదా బాటిల్‌లో వేసి నిండుగా నీటిని నింపాలి. వీటిని ఒక రాత్రంతా నిల్వ చేసి మరుసటి రోజు మొక్కలపై పిచికారీ చేసినా.. మొక్క ఉండే కుండీలో వేసినా అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. క్రిమికీటకాలు దరిచేరవు. ఇంట్లో వాడేసిన నిమ్మ చెక్కలను బకెట్‌లో వేసి రెండురోజుల తరవాత తొక్కలను వడకట్టాలి. ఈ నీటిని మొక్కలకు పోయాలి. ఇలా చేయడం వల్ల నేలలో పిహెచ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. వేర్లకు పురుగు పట్టకుండా మొక్కలను కాపాడుతుంది. నిమ్మకి బదులు నారింజ తొక్కలను కూడా వాడవచ్చు. ఇలా ఇంట్లో కూరగాయల తొక్కలను, గుడ్ల పెంకులను, ఉల్లిపొట్టును మొక్కలకు వేస్తూ ఉంటే మొక్కల ఎదుగుదలకు బాగా ఉపయోగపడతాయి. ఏవి వేసినా మొక్కల పై భాగంలో చెత్త పేరుకుపోకుండా చూడాలి.

## బ్యాంక్ ఉద్యోగులతో సమానంగా
# గోల్డ్ ఆప్రైజర్స్‌లకు గౌరవం ఇవ్వాలి
### ఎఐఇబిఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** :బ్యాంకు ఉద్యోగులతో సమానంగా గోల్డ్ ఆప్రైజర్స్ గౌరవం ఇవ్వాల్సిందేనని ఆఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఎఐఈబిఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు.శనివారం నగరంలోని కర్మన్‌ఘాట్, ఏపిఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ ఆప్రైజర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ ఘనంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి.రవీందర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు బి.ఎస్.రాంబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల ఆర్థిక వృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న గోల్డ్ ఆప్రైజర్స్ అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడంతో పాటు గోల్డ్ ఆప్రైజర్స్ వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య కార్డులను అందజేయాలన్నారు. అదేవిధంగా వారికి కమిషన్ వేతనం రూపంలో అందజేసి గౌరవ ప్రదమైన జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల రిజర్వుబ్యాంక్ విడుదల చేసిన మార్గ దర్శకాలు గోల్డ్ ఆప్రైజర్స్ పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయని వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంక్‌ల్లో రుణాలు ఏగవేసిన బడా కార్పొరేట్లకు లక్షల కోట్లను మాఫీ చేసిన ఆర్‌బిఐ, అదే బ్యాంక్ ఆర్థిక వృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న గోల్డ్ ఆప్రైజర్స్కు మాత్రం అన్యాయం చేస్తోందని విమర్శించారు. సుదీర్ఘ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు గోల్డ్ ఆప్రైజర్స్ సంసిద్ధంగా ఉండాలని నాయకులకు దిశా నిర్దేశనం చేశారు. పహాల్గాంలో మరణించిన వారికి మహాసభ రెండు నిమిషాల పాటు మోనం పాటించి నివాళ్లు అర్పించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శులు పి.వి.కృష్ణరావు, నల్లపరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, అజయ్‌కుమార్, మధుసూదన్, తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ ఆప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్రోజు రాఘవచారి, ఆంధ్రప్రదేశ్ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ ఆప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఈ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




ఆల్ బ్యాంక్స్ గోల్డ్ ఆప్రైజర్స్ ఫెడరేషన్ మహాసభలో మాట్లాడుతున్న ఆఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు

# విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య పనుల టెండర్లు రద్దు

**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వాసుపత్రుల్లో పారిశుధ్య పనులకు పిలిచిన టెండర్లు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. భోధనాసుపత్రులు, జిల్లా,ప్రాంతీయ,సామాజిక ఆస్పత్రులను 3 జోన్లుగా విభజించి, వాటిలో పారిశుధ్య పనులకు రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ టెండర్లు పిలిచింది. వాటిని దకి్కంచుకునేందుకు ప్రైవేటు సంస్థల నుండి తీవ్ర పోటీ నెలకొంది. టెండరులో పేర్కొన్న కొన్ని నిబంధనలను సవాల్ ఏస్తూ పలు సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. మరో వైపు ముగ్గురు ఎంఎల్‌ఏలు పోటీలో ఉన్న పలు కంపెనీల పేర్లను ఉదహరిస్తూ, వారు గత ప్రభుత్వ హయాంలో అవకతవకలకు పాల్పడినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఓ కంపెనీ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసినట్లు టెండర్ ధరఖాస్తుతో సమర్పించిన ధృవపత్రం బోగస్‌దని తేలింది. ఈ టెండర్ల విషయంలో రాజకీయ జోక్యం కూడ చోటు చేసుకుంది.

ఈ నేపథ్యంలో సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన బీఎఫ్‌సీ(బిడ్ ఫైనలైజేషన్)లో పారిశుధ్య టెండర్లను రద్దు చేయాలని దాదాపు నిర్ణయం తీసుకున్నారు.

రాయలసీమలో పెస్ట్ అండ్ రొడెంట్ కంట్రోల్ పనుల టెండరును కూడ రద్దు చేయాలని నిర్ణయించారు. దీని విలువ రూ.220 కోట్లు ఉంటుంది. మిగిలిన టెండర్లు ఖరారయ్యాయి.

## డిప్యూటీ సిఎంపవన్‌తో తమిళనాడు నేత కె.ఎస్. రాధాకృష్ణన్



పవన్ కళ్యాణ్‌కు కరుంగాలి కంబు(దండం)ను బహూకరిస్తున్న కె.ఎస్. రాధాకృష్ణన్

**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తమిళనాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, రచయిత, పర్యావరణ పోరాట నాయకుడు కె.ఎస్.రాధాకృష్ణన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వర్తమాన తమిళనాడు రాజకీయాలు, భాష సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలు చర్చకు వచ్చాయి. పర్యావరణపరమైన విషయాల్లో, రైతాంగ పోరాటం, కన్నగి ఆలయం విషయమై కేరళ ప్రభుత్వంతో సాగిన న్యాయ పోరాటంలో తన పాత్రను రాధాకృష్ణన్ తెలియచేశారు. పశ్చిమ కనుమలలో పర్యావరణ పరిరక్షణకి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో చేసిన పోరాటాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాజకీయంగా తమిళనాడు ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి, నెడుమారన్, ఈవీకే సంపత్ లాంటి నాయకులతో ఉన్న అనుబంధాన్ని ఆయన ప్రస్తావించారు. పవన్ కళ్యాణ్‌ని సత్కరించి కరుంగాలి కంబు(దండం)ను బహుకరించారు. కరుంగాలి కంబుకి ఇరువైపులా పవిత్రమైన పంచలోహాలతో కూడిన క్యాప్స్ ఉంటాయని రాధాకృష్ణన్ వివరించారు. పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతును ఇస్తుందని పవన్ కల్యాణ్‌కు కె.ఎస్.రాధాకృష్ణన్‌తో తెలిపారు. పర్యావరణ పరమైన విషయాల్లో, రైతాంగ పోరాటం, కన్నగి ఆలయం విషయంలో తమ సహకారం ఉంటుందని తెలిపారు.

# సిబిఐ వలలో రైల్వే చీఫ్ ఇంజనీర్
## మరో ముగ్గురు అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 26,ప్రభాతవార్త** కేంద్ర అవినీతి నిరోధక శాఖ నిఘా సంస్థ(సిబిఐ) ఈసారి ఆగ్నేయ మధ్య రైల్వేపై పంజా విసిరింది. ఈ దాడుల్లో రైల్వేకి చెందిన ఓ చీఫ్ ఇంజనీర్, మరో ముగ్గురు సహా మొత్తం నలుగురు నింధితులు సిబిఐ వలలో పడ్డారు. దీంతో రైల్వే కార్యాలయాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే ఆగ్నేయ మధ్య రైల్వే బిలాస్‌పూర్‌లో ఐఆర్ఎస్ఇ-2000బ్యాచ్‌కు చెందిన ఇంజనీరింగ్ అధికారి చిన్న,పెద్ద వంతెనలు,ఆర్‌ఓబి,ఆర్‌యుబి, రైలు మార్గం సామర్థ్యం పెంపుదల,ట్రాక్ లైనింగ్ పనులను ఓ ప్రైవేట్ కంపెనీకి పనులు అప్పగించేందుకు సానుకూలంగా వ్యవహరించిన సదరు రైల్వే చీఫ్ ఇంజనీర్ వర్క్ ఆర్డర్ మంజూరు చేసి అప్పగించేందుకు గాను,సదరు ప్రైవేటు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఉద్యోగిలను సిఇ స్వస్థలమైన ఝార్ఖండ్‌లోని రాంచీ పట్టణంలో తన కుటుంబ సభ్యుడుకి రూ.32లక్షల మొత్తాన్ని ఇవ్వమని ఆదేశించినట్లు ఆరోపణలు రావడంపై దృష్టి సారించారించిన సిబిఐ వలసన్ని చాకచక్యంతో రెడ్‌హ్యాండెడ్‌గా రైల్వే సిఇతో పాటు అతని కుటుంబ సభ్యుడు, లంచం ఇచ్చిన సదరు ప్రైవేటు కంపెనీ ఎండి, ఉద్యోగులను సిబిఐ అరెస్టు చేసి సిఇ కుటుంబ సభ్యుల నుంచి రూ.32లక్షల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుంది. ఇదే సమయంలో చత్తీస్‌ఘడ్, బిలాస్‌పూర్, రాంచీ సహా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి పలు నేరారోపణలకు సంబంధించిన పలు కీలక పత్రాలను, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని సిబిఐ వర్గాలు తెలిపాయి.

# ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

**విజయవాడ, ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** మే 2వ తేదీన అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి పర్యటన ఏర్పాట్లపై శనివారం రాష్ట్ర సచివాలయం వెనుక ఏర్పాటు చేస్తున్న సభా వేదిక ప్రాంగణంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ సంబంధిత అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఈసందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ వివిధ టాస్కులు కేటాయించిన అధికారులు ఆయా పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.టెంటటివ్ కార్యక్రమం ప్రకారం ప్రధాని మోడి మే 2న మధ్యాహ్నం 3గం.లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయానికి చేరుకుని 1.4కి.మీల మేర రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు.తదుపరి సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునః ప్రారంభానికి శంఖుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు.సభ అనంతరం సా.5.గం.లకు సభా ప్రాంగణం నుండి హెలీకాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ బయలు దేరుతారని చెప్పారు.ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేయడం జరుగుతోందని, వాహనాలు పార్కింగ్ కోసం 9 పార్కింగ్ స్థలాలను గుర్తించి అక్కడ తాగునీరు,ఆహారం, మరుగుదొడ్లు వంటివి వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ వేగవంతుగా పూర్తి చేయాలని వివిధ టాస్క్ లు కేటాయించిన అధికారులను వీరపాండ్యన్ ఆదేశించారు.ఈనెల 30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటుందని పేర్కొన్నారు.ప్రధాని సభకు వచ్చే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆహారం అందించడం జరుగుతుందని ఇందుకు సంబంధించి ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంకా పలు ఏర్పాట్లకు సంబంధించి ఆయా నోడలు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈసమావేశంలో అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని సభకు 100 మందికి పైగా వివిఐపిలు, 15 మంది వరకు ఎంఐపిలు, 5వేల మంది వరకు విఐపిలు రానున్నారని అందుకు అనుగుణంగా పార్కింగ్ ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు.పార్కింగ్ ప్రాంతంలో నిరంతరం మైక్ అనౌన్స్మెంట్ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు.గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి డ్యూటీ సంబంధించి ఆయా శాఖలు జాబితా ఇవ్వాలని కోరారు.



## కొల్లేరు సరిహద్దులపై మరోసారి పరిశీలన జరపాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు

**విజయవాడ,ఏప్రిల్26,ప్రభాతవార్తప్రతినిధి:** కొల్లేరుపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొల్లేరి వన్యప్రాణుల అభయారణ్యంపై మరోసారి తనిఖీ జరపాలని కేంద్ర సాధికార కమిటీకి జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అయితే,కొల్లేరులో ప్రైవేటు భూములను నోటిపై చేయడంపై సుప్రీం కోర్టును ప్రైవేటు మత్స్యకారుల సంఘం ఆశ్రయించిన విషయం విదితమే. ఇక,కొల్లేరు ప్రస్తుత స్థితిపై నివేదిక అందించాలని సీఈసీకి ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఏపీ వెట్ ల్యాండ్ స్టేట్ అథారిటీ సరిగ్గా అమలు చేస్తుందో,లేదో నివేదిక ఇవ్వాలని జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం సూచించింది.

## నేటి నుంచి తెలుగు రాష్ట్రాల మీదుగా కాన్పూర్ సెంట్రల్-బెంగళూరు మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 26,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ కాన్పూర్ సెంట్రల్-బెంగళూరు-కాన్పూర్ సెంట్రల్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాన్పూర్ సెంట్రల్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 04131ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27నుంచిజూన్ 1వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 7.50గంటలకు కాన్పూర్ సెంట్రల్ నుంచి బయలుదేరి మంగళవారం సాయంత్రం 6.30గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి కాన్పూర్ సెంట్రల్ వెళ్లే నెంబర్ 04132ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30నుంచి జూన్ 4వరకు ప్రతి బుధవారం ఉదయం 7.10గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2గంటలకు కాన్పూర్ సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమద్యలో తెలుగు రాష్ట్రాల్లో సిర్పూర్,కాగజ్ నగర్, బెల్లంపల్లి, చిర్యాల,వరంగల్లు,ఖమ్మం,విజయవాడ,చీరాల,ఒంగోలు,నెల్లూరు,గూడూరు స్టేషన్లతో పాటు ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్,మహారాష్ట్ర,తమిళనాడు రాష్ట్రాల్లోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.






# ప్లే ఆఫ్స్‌పై ఉత్కంఠ

## టీమ్‌ల మధ్య పోటా పోటీ పోరు.. వెనకబడిన జట్లు అదుకునేనా!


**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025, 18వ సీజను అత్యంత ఉత్కంఠ భరితంగా సాగుతోంది. ఈ ఐపీఎల్‌లో 74 మ్యాచ్‌లకు గాను ఇప్పటి వరకూ 49 మ్యాచ్‌లు జరిగాయి. ఇక ఐపీఎల్‌లో సాధారణంగా ఏవైనా జట్లు ప్లే ఆఫ్స్ చేరాలంటే కనీసం 8 మ్యాచ్‌లు గెలవాల్సి ఉంటుంది. ఇక దీని ప్రకారం చూసినట్టయితే శనివారం రాత్రి జరగాల్సిన మ్యాచ్‌ను మినహాయిస్తే ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ 8 మ్యాచ్‌లకు 6 మ్యాచ్‌లు గెలిచి 1.104 నెట్ రన్ రేటుతో పాయింట్ల పట్టికలో నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ కూడా 8 మ్యాచ్‌లకు 6 మ్యాచ్‌లలో విజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల్లో మాత్రం ఓడిపోయింది. రన్ రేట్ కాస్త తక్కువగా ఉండటంతో 0.657 తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు 9 మ్యాచ్‌లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించి మూడింటిలో ఓటమి పాలైంది. ముంబై ఇండియన్స్ 9 మ్యాచ్‌ల్లో ఐదింటిలో విజయం సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ నాలుగు జట్లు టాప్ 4లో కొనసాగుతున్నాయి. ఇక పంజాబ్ కింగ్స్ 8 మ్యాచ్‌లు ఆడి 5 మ్యాచ్‌ల్లో విజయంతో ప్రస్తుతం 5వ స్థానంలో కొనసాగుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ 9 మ్యాచ్‌లు ఆడి 5 మ్యాచ్‌ల్లో గెలుపొందింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 8 మ్యాచ్‌ల్లో 3 మాత్రమే విజయం సాధించి మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఫలితంగా 7వ స్థానంలో కొనసాగుతోంది. సన్ రైజర్స్ హైదరాబాద్ చివరి నుంచి మూడో స్థానానికి చేరింది. అంటే పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతోంది. దీంతో సన్‌రైజర్స్ ఇప్పటి వరకూ 9 మ్యాచ్‌లు ఆడగా, 3 మ్యాచ్‌లు గెలిసి 6 మ్యాచ్‌ల్లో ఓడి -1.103 నెట్ రన్ రేట్‌తో కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్ 9 మ్యాచ్‌లకు కేవలం 2 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించి పాయింట్ల పట్టికలో 8 వ స్థానంలో కొనసాగుతోంది. చెన్నై సూపర్ కింగ్స్ 9 మ్యాచ్‌లు ఆడి కేవలం 2 మ్యాచ్‌ల్లో ఆధిక్యం కనపరచి, -1.302 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో మాత్రం చిట్టచివరగా కొనసాగుతోంది. కాగా వాస్తవానికి చివరి నుంచి నాలుగు జట్లకు ప్లేఆఫ్స్ అవకాశాలకు దాదాపు దారులు మూసుకుపోయనట్లే. కానీ గత సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తొలి 7 మ్యాచ్‌ల్లో కేవలం ఒకే మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించింది. ఆ తరవాత వరుసగా 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించి ప్లే ఆఫ్స్‌కి అర్హత సాధించింది. ఈ సీజన్ లో కూడా ఆర్సీబీ మాదిరిగానే ప్లే ఆఫ్స్‌కి అర్హత సాధిస్తామని హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ ధీమా కనపరుస్తుండటం గమనార్హం. ఈ సీజన్‌లో ఇప్పటికే గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, ముంబై ఇండియన్స్ జట్లు ముందంజలో ఉన్నాయి. వీటిని దాటి పంజాబ్ మినహా ఏ జట్టు కూడా అర్హత సాధించే అవకాశాలు లేనట్లేనని లెక్కలు కడుతున్నారు. వీటిలో ఏయే జట్లు ఎన్ని మ్యాచ్ లు గెలిచి ప్లే ఆఫ్స్ కి వెళ్తాయనేది ఆసక్తికరంగా తయారయింది.

## ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధం

**న్యూఢిల్లీ:** ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్ కోసం రంగం సిద్ధమైంది. తాయ్‌లాండ్ వేదికగా ఈనెల జరుగనున్న 27వ రేసింగ్ కోసం హోండా ప్రకటించిన జట్టులో భారత్ నుంచి జోహాన్ రీవ్స్, కెవిన్ కింటాల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆసియాలోనే అత్యంత పోటీ ఉండే రేసింగ్ సర్క్యూట్లలో ఒకటైన ఐజాయ్‌లాండ్ రేసింగ్‌లో జోహాన్, కెవిన్..అంతర్జాతీయ రేసర్లతో పోటీపడనున్నారు. 2025 ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో మొత్తం ఆరు రౌండ్లు జరుగనున్నాయి. థాయ్‌లాండ్‌లోని చాంగ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో తొలి రౌండ్ మొదలుకానుంది. కెవిన్ ఇప్పటికే ఏఆర్ఆర్సీ సీజన్లలో అనుభవం పొందిన రైడర్ కాగా, జోహాన్ మాత్రం తొలిసారి అంతర్జాతీయ టోర్నీలో పోటీపడుతున్నాడు. సీజన్ ఏడు రౌండ్లు కలిగి ఉంటుంది, ప్రతి రౌండ్‌కు రెండు రేసులు నిర్వహించబడతాయి. కాగా ఆసియా రోడ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను మొదటిసారిగా 1996లో నిర్వహించారు, ఇది మోటార్ సైకిల్ రేసింగ్ క్రీడ అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఆసియావ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ 1997లో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి మోటోస్కైక్లిస్మ్ (ఇంటర్నేషనల్ మోటార్ సైక్లింగ్ ఫెడరేషన్) ఆమోదం పొందింది. అప్పటి నుండి ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి మోటోస్కైక్లిస్మ్ ఆసియా ఖండాంతర ఛాంపియన్‌షిప్‌గా గుర్తించబడింది.

## భారత యువ బాక్సర్ల జోరు.. 43 పతకాలు ఖరారు

**న్యూఢిల్లీ:** జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పంచ్‌లతో చెలరేగుతున్నారు. ప్రత్యర్థులను అలవోకగా చిత్తు చేస్తూ పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే 39 పతకాలు ఖరారు కాగా శనివారం మరో నలుగురు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లారు. దాంతో, ఈసారి దాదాపు 43 పతకాలు భారత బాక్సర్ల ఖాతాలో చేరనున్నాయి. జోర్డాన్ వేదికగా ఆసియా బాక్సింగ్ సమాఖ్య నిర్వహిస్తున్న అండర్ 15, అండర్ 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు, అమ్మాయిలు తమ పంచ్ పవర్ చూపిస్తున్నారు. అండర్ 17 పురుషుల విభాగంలో అమన్ సివచ్ (63 కిలోలు), దేవాన్ష్ (80 కిలోలు) తమ తడాఖా చూపించారు. ఐదో రోజు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఫిలిప్పీన్స్, జోర్డాన్‌కు చెందిన ఆటగాళ్లను మట్టికరింపించారు. మహిళల 60 కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్ పంచ్‌కు జోర్డాన్ బాక్సర్ అయా అల్హసనత్ చేతులెత్తేసింది. కనీస పోరాటం చేయకుండానే 50తో చిత్తుగా ఓడిపోయింది. ఇక 70 కిలోల ఫైట్‌లో హిమాన్షు పాలస్తీనా బాక్సర్ చేతిలో పోరాడి ఓడిపోయింది.


## వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో..
# భారత్ క్రీడాకారిణుల ఓటమి
### ముగిసిన శ్రీజ, మనిక, యశస్వి పోరు

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ ట్యూనిస్ కంటెండర్ టోర్నమెంట్‌లో భారత్ రెండో ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాలం ముగిసింది. మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైన శ్రీజ, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కే చెందిన సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలైంది. ఇక సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ శ్రీజ 6-11, 9-11, 8-11తో ప్రపంచ 76వ ర్యాంకర్, స్వీడన్‌కు చెందిన క్రిస్టినా కాల్‌బెర్గ్ చేతిలో పరాజయం చెందింది. 23 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 12 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 11 పాయింట్లు సాధించింది. భారత్ నంబర్ వన్, ప్రపంచ 30వ ర్యాంకర్ మనిక బత్రా కూడా అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. భారత్‌కే చెందిన దియా చిటాలె 12-10, 5-11, 9-11, 11-4, 11-4తో మనికను బోల్తా కొట్టించి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ డ్రాలో అడుగు పెట్టిన దియా 38 నిముషాల్లో మనికను ఓడించింది. తన సర్వీస్ 29 పాయింట్లను సాధించిన దియా ప్రత్యర్థి సర్వీస్‌లో 19 పాయింట్లు సొంతం చేసుకుంది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ యశస్విని ఘోర్పడే తొలి రౌండ్‌లో 7-11, 6-11, 9-11తో జపాన్‌కు చెందిన అనె యుసెవా చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ-సుతీర్థ ముఖర్జీ భారత్ ద్వయం 11-7, 8-11, 8-11, 10-12తో చైనా జంట జు కిహు-యంగ్ హుజి చేతిలో పరాజయం చెందింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ-సత్యన్ జ్ఞానశేఖరన్ ద్వయం 11-6, 11-9, 11-9తో సెర్బియి జోడీ దిమిత్రి లెవాజెక్-ఇజబెలాపై గెలిచింది. అయితే అనంతరం క్వార్టర్ ఫైనల్లో శ్రీజ-సత్యన్ 6-11, 11-2, 18-16, 2-11, 4-11తో భారత్‌కే చెందిన మనుష్ షా -దియా చిటాలె చేతిలో ఓడిపోయారు.

## అజ్లాన్ షా కప్‌లో పాక్‌కు నో
### కోలుకోలేని దెబ్బతీసిన మలేసియా హాకీ సమాఖ్య

**న్యూఢిల్లీ:** సుప్రసిద్ధ హాకీ టోర్నమెంట్ అజ్లాన్ షా కప్‌లో పాకిస్థాన్‌కు ఘోరమైన ఎదురు దెబ్బ తగలింది. ఈ టోర్నీలో పాకిస్థాన్ జట్టు ఈసారి పోటీ పడే అవకాశాన్ని కోల్పోయింది. టోర్నీ నిర్వహకులకు పాకిస్థాన్ హాకీ సమాఖ్య (పీహెచ్ఎఫ్) బకాయిలు పడటంతో మలేషియా హాకీ సమాఖ్య (ఎమ్‌హెచ్ఎఫ్) అహ్వానాన్ని నిలిపివేసింది. దీంతో పాకిస్థాన్ హాకీ జట్టుకు కోలుకోలేని పరాభవం చవిచూసినట్లయింది. రెండేళ్ల క్రితం 2023లో జరిగిన హాకీ టోర్నమెంట్‌కు సంబంధించిన 10,349 డాలర్లు (8,83,582 రూపాయలు) బకాయిలను జోహార్ హాకీ సంఘం (జేహెచ్‌ఏ)కు ఇంకా చెల్లించ లేదు. అందుకే ఈసారి పాకిస్థాన్‌కు అహ్వానాన్ని పంపడం లేదనే నిర్ణయాన్ని తీసుకున్నట్లు నిర్వహకులు ప్రకటించారు. జోహార్ హాకీ సంఘం నిబంధనల ప్రకారం ఆ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల సభ్యులకు మాత్రం ఆతిధ్య ఏర్పాట్లు చేస్తారు. అంతేకాని వారి వెంట వచ్చే కుటుంబ సభ్యులు, హాకీ సమాఖ్య ఉన్నతాధికారులు వస్తే బస, స్థానిక రవాణా, ఇతరత్రా ఖర్చులన్నీ వారే భరించాల్సి ఉంటుంది. 2023 అక్టోబరులో జరిగిన టోర్నమెంట్కుఉ సంబంధించి ఆటగాళ్ల కుటుంబ సభ్యులు, హాకీ అధికారులకు అయిన ఖర్చులను చెల్లించ లేదు. ఇందుకు సంబంధించి ఇది వరకే మలేషియా హాకీ, జేహెచ్ఏ వర్గాలు పాకిస్థాన్ సమాఖ్యకు లేఖ రాసినప్పటికీ చెల్లింపులు మాత్రం చేయలేదు. కుటుంబ సభ్యులు, సమాఖ్య అధికారులు ఆటగాళ్లకు బస కల్పించిన లగ్జరీ హోటల్స్‌లోనే గడిపారు. దీనిపై జోహార్ సంఘం మలేషియా సమాఖ్యకు తెలపడంతో బకాయిలు రాబట్టేందుకు పాకిస్థాన్ హాకీ సమాఖ్యకు అహ్వానం పంపకూడదని కీలక నిర్ణయం తీసుకుంది.

# వాణిజ్యం

## రూ.57.5 టన్నుల బంగారం కొనుగోలు చేసిన ఆర్‌బిఐ

**ముంబై, ఏప్రిల్ 26:** బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో 2025 ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 57.5 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఈ విధంగా ప్రపంచ మార్కెట్లో కొనసాగుతున్న అస్థిరత మధ్య రిజర్వ్ బ్యాంక్ తన సురక్షిత ఆస్తుల మొత్తాన్ని పెంచుకుంది. 2017 తర్వాత ఆర్‌బిఐ ఒక సంవత్సరంలో ఇంత ఎక్కువ బంగారాన్ని కొనుగోలు చేయడం ఇది రెండోసారి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుఎస్ డాలర్‌లో హెచ్చుతగ్గులు, యుఎస్ ప్రభుత్వ బాండ్ల పతనం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక కేంద్ర బ్యాంకులు భవిష్యత్తులో ఎటువంటి ప్రమాద పరిస్థితిని నివారించడానికి తమ బంగారు నిల్వలను పెంచుకోవడం అవసరమని భావించ డానికి కొన్ని కారణాలు ఉన్నాయి.



కొత్త డేటా ప్రకారం, మార్చి 2025 నాటికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారం మొత్తం 879.6 టన్నులకు చేరుకుంది. గత సంవత్సరం ఇదేకాలంలో ఇది 822.1 టన్నులు. ఇటి నివేదిక ప్రకారం, 2021-22లో ఆర్‌బిఐ 66 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీని తరువాత 2023, 2024లలో వరుసగా 35 టన్నులు, 27 టన్నుల బంగారం కొనుగోలు జరిగింది. ముఖ్యంగా నవంబర్ 2024లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత డాలర్‌లో చాలా అస్థిరతలు ఏర్పడ్డాయి. ఇది బంగారానికి డిమాండ్‌ను పెంచింది. అమెరికా ట్రెజరీ బాండ్లకు డిమాండ్ తగ్గుతున్న దృష్ట్యా, కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోలుపై ఎక్కువ దృష్టి సారిస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని కేంద్ర బ్యాంకులు యూఎస్ ట్రెజరీపై ఆధార పడటాన్ని తగ్గించుకుని, బంగారు నిల్వలను పెంచుతున్నాయని నువామా కరెన్సీ, వస్తువుల విభాగాధిపతి సజల్ గుప్తా అన్నారు. భారతదేశ విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటా గత సంవత్సరం 8.7 శాతంగా ఉండగా, 2025 ఏప్రిల్ 11 నాటికి 11.8 శాతానికి పెరిగింది. ఈ కాలంలో బంగారం ధరలు 30 శాతానికి పైగా పెరగడంతో రిజర్వ్ బ్యాంక్ తన పెరిగిన బంగారు నిల్వల నుండి ప్రయోజనం పొందింది.

## డిసిబి లాభాలు అప్, ఆర్‌బిఎల్ లాభాలు డౌన్..



**ముంబై, ఫిబ్రవరి 26:** ప్రైవేట్ రంగ డిసిబి బ్యాంకు మార్చితో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. లాభం క్రితం యేడాది ఇదే కాలంతో పోలిస్తే 14శాతం పెరిగి రూ.177 కోట్లకు చేరుకుంది. క్రితం యేడాది ఇదే కాలంలో లాభం రూ.156 కోట్లుగానే ఉండడం విశేషం. మొత్తం ఆదాయం రూ.1,581 కోట్ల నుంచి రూ.1,961కోట్లకు వృద్ధి చెందింది. బ్యాంకు స్థూల నిరర్థక రుణ ఆస్తులు (ఎన్‌పిఎలు) 2.99 శాతంగా నమోదయ్యాయి. క్రితం యేడాది ఇదే త్రైమాసికం చివరికి ఇవి 3.23 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పిఎలు పెద్దగా మార్పు లేకుండా 1.12 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం యేడాది ఇదే కాలంలో ఇవి 1.11 శాతంగా ఉన్నాయి. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.1.35 చొప్పున డివిడెంట్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఇందుకు కంపెనీ వార్షిక సమావేశంలో (ఏజిఎం) వాటాదారులు ఆమోదం తెలిపాల్సి ఉంటుంది. ప్రైవేట్ రంగ ఆర్‌బిఎల్ బ్యాంకు కన్సాలిడేటెడ్ లాభం గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో గణనీయంగా అంటే 76శాతం తగ్గిపోయింది. రూ.89 కోట్ల లాభం నమోదైంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.364 కోట్లుగా ఉండగా, 2024 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.47 కోట్లుగా ఉండడం విశేషం. నికర వడ్డీ ఆదాయం 2 శాతం తగ్గి రూ.1,563 కోట్లుగా నమోదైంది. రుణాల్లో 7 శాతం వృద్ధి కనిపించింది. ముఖ్యంగా ప్రొవిజన్లు, కంటింజెన్సీలకు కేటాయింపులు రూ.785 కోట్లకు పెరిగిపోవడం లాభాలకు కోత పెట్టింది. క్రితం యేడాది ఇదే త్రైమాసికంలో ఇవి రూ.414 కోట్లుగానే ఉన్నాయి. నికర వడ్డీ మార్జిన్ 5.54 శాతం నుంచి 4.89 శాతానికి తగ్గింది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యతను గమనిస్తే, స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు)2.6 శాతంగా నమోదయ్యాయి. క్రితంయేడాది ఇదేకాలంలో ఇవి 2.65శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పిఎలు కూడా 0.74 శాతం నుంచి 0.29 శాతానికి తగ్గాయి. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.695 కోట్ల లాభం నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,168కోట్లుగా ఉంది. ప్రతీ షేరుకు రూ.1 చొప్పున డివిడెండ్ పంపిణీకి బోర్డు సిఫారసు చేసింది.

## విమాన సంస్థలకు డిజిసిఎ అడ్వైజరీ

**శ్రీనగర్, ఏప్రిల్ 26:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇటీవల పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియే షన్ (డిజిసిఎ) విమానయాన సంస్థలకు పలు సూచనలు జారీ చేసింది. పాక్ గగనతలం మూసి వేత కారణంగా ఎయిర్‌లైన్ కార్యకలాపాలు ప్రభా వితమయ్యాయని డీజీసీఏ పేర్కొంది. అంతర్జాతీయ విమానాల రాకపోకల కు ప్రయాణ సమయం పెరగనున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే విమాన యాన సంస్థలకు పలు అడ్వైజరీలు జారీ చేసింది. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించింది. అంతేకాక విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో సహా ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది దేశం అక్కసు వెళ్లగక్కుతూ.. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కన బెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు



## పత్యక్ష పన్ను వసూళ్లు రూ.27.02 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** ప్రత్యక్ష పన్ను వసూళ్లలో భారతదేశం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గణనీయమైన వృద్ధిని సాధించింది. స్థూల వసూళ్లు 15.59శాతం పెరిగి రూ.27.02 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అధిక కార్పొరేట్, నాన్-కార్పొరేట్ పన్ను ఆదాయాలు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్‌టిటి) రాబడుల్లో పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల దేశం బలమైన ఆర్థిక కార్యకలాపాలు, మెరుగైన పన్ను విధానాన్ని ప్రతిబింబిస్తుంది. కార్పొరేట్ పన్ను వసూళ్లు 2024-25లో రూ.12.72 లక్షల కోట్లకు చేరాయి. అంతకు ముందు యేడాది ఇది రూ.11.31 లక్షల కోట్లుగా ఉంది. నాన్ కార్పొరేట్ టాక్స్ వసూళ్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.11.68 లక్షల కోట్ల నుంచి 2024-25లో రూ.13.73 లక్షల కోట్లకు పెరిగాయి. కేపిటల్ మార్కెట్లలో కార్యకలాపాలు పెరగడంతో ఎస్‌టిటి రాబడులు రూ.34,192 కోట్ల నుంచి రూ.53,296 కోట్లకు పెరిగాయి. రిఫండ్లను పరిగణనలోకి తీసుకుంటే నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.22.26 లక్షల కోట్లతో 26.04 శాతం పెరిగి రూ.4.76 లక్షల కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.19.60 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 13.57శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఇది ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ చట్టబద్ధమైన రీఫండ్ క్లెయిమ్‌లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియచేస్తుంది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెరగడం భారత ఆర్థిక వృద్ధికి సానుకూల సంకేతం. ప్రభుత్వ ఆదాయాన్ని బలోపేతం చేయడం, రుణాలపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఇది తోడ్పడుతుంది. అధిక పన్ను ఆదాయాలు మౌలిక సదుపాయాలు, సాంఘిక సంక్షేమం, ఇతర కీలక రంగాలపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడానికి వీలు కల్పిస్తాయి.



## మారుతి రాబడులు రూ.40,920 కోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా గతేడాది చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్ప వెనకడుగుతో రూ.3,911 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.3,952 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.38,471 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు 8శాతానికిపైగా పెరిగి రూ.37,585 కోట్లకు చేరాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ.135 డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో 3శాతం అధికంగా 6,04,635 యూనిట్ల అమ్మకాలు సాధించింది. ఒక త్రైమాసికంకు ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం. దేశీయ విక్రయాలు 3శాతం వృద్ధితో 5,19,546 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు 8శాతం పెరిగి 85,089గా నమోదయ్యాయి. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి మారుతీ కన్సాలిడేటెడ్ నికర లాభం 7.5శాతం పుంజుకుని రూ.14,500 కోట్లయింది. 2023-24లో రూ.13,488 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1,41,858 కోట్ల నుంచి రూ.1,52,913 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం 22,34,266 వాహనాలను విక్రయించింది. వెరసి గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక విక్రయాలు, ఎగుమతులను నమోదు చేసింది. దేశీయంగా మందగమనం ఉన్నప్పటికీ పటిష్ట ఫలితాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌సి భార్గవ్ పేర్కొన్నారు.



## 'ఇవి' విడిభాగాల తయారీలోకి హిండాల్కో..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) విడిభాగాల తయారీ విభాగంలోకి ప్రవేశించినట్లు హిండాల్కో వెల్లడించింది. ఇందుకు సంబంధించి పుణెలోని చకాన్‌లో రూ.500 కోట్లతో తేలికపాటి బ్యాటరీ సొల్యూషన్స్ ఉత్పత్తి కోసం తయారీ ప్లాంటును ప్రారంభించింది. ఎంఅండ్‌ఎం సంస్థకు 10వేల అల్యూమినియం బ్యాటరీ ఎన్‌క్లోజర్లను కూడా అందించినట్లు కంపెనీ సందర్భంగా తెలిపింది. మహీంద్రాతో కలిసి అభివృద్ధి చేసిన ఈ బ్యాటరీ ఎన్‌క్లోజర్, సాధారణ ఉక్కు డిజైన్లతో పోలిస్తే 40శాతం తక్కువ బరువు ఉంటుంది. వాహన రేంజి సుమారు 8-10 శాతం మెరుగుపడుతుంది. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుని దేశీయంగానే అత్యంత నాణ్యమైన అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు చకాన్ ప్లాంటు తోడ్పడగలదని హిండాల్కో ఇండస్ట్రీస్ ఎండి సతీష్ పాయ్ తెలిపారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.